

మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


ఆదర్శవంతమైన వియత్నాం అద్భుత అభివృద్ధి

సంకల్పబలమే జయం

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 158 | గురువారం | 08-05-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# 9 ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం




## పాకిస్థాన్, పిఒకె భూభాగాలపై క్షిపణులతో భారత్ మెరుపుదాడి

## పహల్గామ్ టెర్రరిస్టు దాడికి ప్రతిస్పందన హక్కును ఉపయోగించుకున్న భారత్

### జైష్-ఎ-మొహమ్మద్, లష్కర్-ఎ-తైబా ప్రధాన కేంద్రాలు నేలమట్టం

- 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిచర్య
- అర్ధరాత్రి దాటాక 1:05 గంటలకు మొదలై 25 నిమిషాల్లో పూర్తి
- మురిద్కేలోని మర్కజ్ తైబా, బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా, సియాల్‌కోట్‌లోని మెమూనా జోయా వసతి కేంద్రం, బర్నాలలోని ఎల్‌ఇటి కేంద్రం, ముజఫరాబాద్‌లోని షావాయ్ నల్లాలోని శిబిరాలపై మిస్సైల్, డ్రోన్లతో విరుచుకుపడిన భారత సైనిక బలగాలు

**న్యూఢిల్లీ :** పహల్గామ్ దారుణ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం ధీటైన జవాబు ఇచ్చింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పిఒకె) భూభాగాలలో నెలవైన తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారతీయ సైనిక బలగాలు ధ్వంసం చేశాయి. వాటిలో జైష్-ఎ-మొహమ్మద్, లష్కర్-ఎ-తైబాల ప్రధాన కేంద్రాలు కూడా ఉన్నాయి. బుధవారం తొలి జాములో (మంగళవారం అర్ధరాతి దాటిన తరువాత) 25 నిమిషాల పాటు ''నిర్దేశిత'',''ఉద్రిక్తత పెంపు రహిత'' మిస్సైల్, డ్రోన్‌లతో ఉగ్రస్థావరాలపై భారత సైనిక విభాగాలు విరుచుకుపడ్డాయి. 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో భారతీయ మిలిటరీ మురిద్కేలోని లష్కర్-ఎ-తైబాకు చెందిన మర్కజ్ తైబా, బహవల్‌పూర్‌లోని జైష్-ఎ-మొహమ్మద్‌కు చెందిన మర్కజ్ సుభాన్ అల్లా, సియాల్‌కోట్‌లోన హిజ్‌బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన మెమూనా జోయా వసతి కేంద్రం, బర్నాలలోని మర్కజ్ అహ్లే హాదిత్ పేరుతో ఉన్న ఎల్‌ఇటి కేంద్రం, ముజఫ్ఫరాబాద్‌లోని షావాయ్ నల్లాలోని శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు మిలిటరీ అధికారులు తెలిపారు.లాహోర్ నగరానికి కొద్ది దూరంలోనే ఉండే మురిద్కే విస్తారమైన ప్రదేశంలో ''మర్కజ్'' లేదా లష్కర్-ఎ-తైబాకు కేంద్రం. బహవల్‌పూర్ జైష్-ఎ-మొహమ్మద్‌కు గట్టి పట్టు ఉన్న ప్రాంతం.

ఏప్రిల్ 22న పహల్గాం దాడులకు ప్రేరేపించిన, ప్రణాళిక వేసిన వారిని చట్టం ఎదుట నిలబెట్టడంలో, పాకిస్తాన్ నియంత్రిత భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో ఆ దేశం నుంచి ''కనిపించే స్థాయిలో చర్య లేదని'' విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ అన్నారు. అందుకే ''తగిన''చర్యలు తీసుకోవాలని భారతదేశం నిర్ణయించిందని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రేరేపకులు, నిర్వాహకులు, ఆర్థిక సహాయకులు, ప్రాయోజకులను జవాబుదారీ చేయాలనే ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి ప్రకటనకు అనుగుణంగానే భారతదేశం చర్యలు ఉన్నాయని మిస్రీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఉదయం 1:05 నుంచి 1:30 గంటల్లో నిర్వహించబడిందని, అన్ని లక్ష్యాలను ఆశించిన స్థాయిలో నిరుపయోగంగా మార్చబడ్డాయని ఇద్దరు మహిళా సైనిక అధికారులైన ఆర్మీ కోర్ ఆఫ్ సిగ్నల్స్ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషి, ఐఎఎఫ్ హెలికాప్టర్ పైలెట్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఉగ్రశిబిరాలను ధ్వంసంపై బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో మిస్రీతో కలిసి ఈ ఇద్దరు మహిళా సైనిక ఉన్నతాధికారులు వివరాలను వెల్లడించారు. అంతకుముందు తెల్లవారుజాములన ఆపరేషన్ పూర్తయిన 15 నిమిషాల్లో రక్షణ మంత్రిత్వ శాఖ వివరాలను ప్రకటిస్తూ ''కొద్దిసేపటి క్రితమే భారతీయ సైనిక బలగాలు 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టి, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లో ఎక్కడ నుండైతే భారతదేశంలో ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించి, ఆదేశాలు వెళ్ళాయో, ఆ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయి'' అని పేర్కొంది. భారతీయ సైనిక బలగాల చర్యలు ''స్పష్టమైన, నిర్దేశితమైన, ఉద్రిక్తత పెంపు రహిత స్వభావమైనవని, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం, భారత్‌కు పంపే అవకాశం ఉన్న ఉగ్రవాదులను బలహీనపరచటంపైనే దృష్టి కేంద్రీకరించాయని, ఏ ఒక్క పాకిస్తాన్ సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకోలేదని తెలిపింది. ''లక్ష్యాలను ఎంపిక చేసుకోవటంలో,

తరువాయి 2లో

### నేడు అఖిలపక్ష సమావేశం

ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూ' నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో కమిటీ రూమ్ నంబర్ జి-074లో ఉదయం 11 గంటలకు ఆఖిలపక్ష సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షించినట్లు మిలిటరీ వర్గాలు తెలియజేశాయి. ఆపరేషన్ పూర్తయిన తరువాత ప్రతి బుధవారం నిర్వహించే యూనియన్ క్యాబినెట్ సమావేశం జరిగింది. జయప్రదంగా దాడులు పూర్తి చేసిన భారతీయ సైనిక బలగాలను ప్రశంసించారు. కాగా, రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళి రాష్ట్రపతి, ఆర్మీ సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ముకు ఆపరేషన్ సింధు వివరాలను ప్రధాన మంత్రి మోదీ వివరించారు. 'ఆపరేషన్ సిందూర్' పేరును ప్రధానే ఎంపిక చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సిందూర్ అంటే వివాహిత మహిళలు నుదట పెట్టుకునే సిందూరం.

### వివిధ దేశాల స్పందన

అణ్వస్త్రాలు కలిగివున్న భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే ప్రపంచం తట్టుకోలేదు. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)తో పాటు ఐబీ వెంబడి భారత సైనిక చర్యలతో సంయమం పాటించాలి. శాంతియుతంగా దౌత్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలి.
— ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్

భారత్, పాకిస్థాన్‌కు ప్రత్యేకంగా ఇచ్చే సందేశమేమీ లేదు కానీ ఇదంతా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా. ఈ పోరు ఇప్పటిది కాదు... కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి.
— అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

పాకిస్థాన్ మీద భారత్ ప్రతీకార దాడి... పోరు తీవ్రరూపం దాలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పరిస్థితి చేయిదాటకుండా చూసుకో వాలి.
— మారియా జఖోరోవా, రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

'భారత్, పాకిస్థాన్ ఇరుగుపొరుగు దేశాలు, చైనాకు కూడా ఇవి పొరుగు దేశాలు. వీటి మధ్య ఇలాంటి పరిస్థితులు నెలకొనడం బాధాకరం. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. పరిస్థితిని జఠిలం చేసే చర్యలు నివారించాలని సూచిస్తోంది'
— చైనా విదేశాంగ శాఖ

### ఎల్‌ఒసి వెంబడి పాక్ కాల్పులు

12 మంది పౌరులు మృతి, మరో 42 మందికి గాయాలు

**న్యూఢిల్లీ :** గత కొద్ది రోజులుగా జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) వెంబడి పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. బుధవారం కూడా ఎల్‌ఒసి వద్ద ఉన్న ఉన్న గ్రామాలపై పాకిస్తాన్ సైన్యం భారీ ఫిరంగి, మోర్టార్ షెల్లింగ్‌లతో విరుచుకుపడింది. కాల్పుల్లో నలుగురు పిల్లలు సహా కనీసం 12 మంది మరణించారని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేశాయి. ఆ తరువాత కొద్దిసేపటికే సరిహద్దు అవతల నుండి షెల్లింగ్‌లతో పాక్

తరువాయి 2లో

### 26 మంది మృతి





46 మందికి గాయాలు : పాకిస్తాన్

తగిన జవాబిచ్చే హక్కు మాకుంది : పాక్ ప్రధాని

మా కుటుంబంలో 10 మంది చనిపోయారు

ధృవీకరించిన ఎల్‌ఇటి ఛీఫ్

**ఇస్లామాబాద్ :** భారత ఆపరేషన్ జరిగిన కొన్ని గంటల తరువాత పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ ''భారతదేశం పాల్పడిన యుద్ధ చర్యకు తగిన జవాబు'' ఇచ్చేందుకు అన్ని హక్కులు తమ దేశానికి ఉన్నాయని అన్నారు. ఐదు ప్రాంతాలలో భారతదేశం

తరువాయి 2లో

### 'ఆపరేషన్ సిందూర్'కు వామపక్షాల మద్దతు

ఉద్రిక్తతలను తగ్గించాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీల పిలుపు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆపరేషన్ సిందూర్'కు బుధవారం వామపక్షపార్టీలు మద్దతు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతు ఇచ్చిన వామపక్ష పార్టీలలో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీలు ఉన్నాయి. ఉగ్రవాద మౌలికవసతులను కూల్చివేయడానికి పాకిస్థాన్‌పై నిరంతర ఒత్తిడి అవసరం అని అభిప్రాయపడ్డాయి. అదే సమయంలో ఒత్తిడిని మరింత తీవ్రతరం చేయకుండా కేంద్రందౌత్యపరమైన మార్గాలు అనుసరించాల్సిన ఆవశ్యకతను వామపక్షపార్టీలు నొక్కిచెప్పాయి. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26మంది పౌరులపై ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా దాడిచేసి కాల్చిచంపిన రెండు వారాల తర్వాత బుధవారం అర్ధరాత్రి దాటాక పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె), పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిష్టు పార్టీ (సిపిఐ) ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉగ్రవాదులు పహల్గామ్ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించిన

తరువాయి 2లో




### భారత బలగాలకు ఇదే మా వందనం

'ఆపరేషన్ సిందూర్' దేశానికి గర్వకారణం

కేంద్ర ప్రభుత్వ చర్యలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

**న్యూఢిల్లీ :** ''ఆపరేషన్ సిందూర్'' దేశానికి గర్వకారణమని కాంగ్రెస్‌పార్టీ అగ్రనాయకత్వం ప్రశంసించింది. ఎంతో ధైర్యసాహసాలతో భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉన్న ఉగ్రవాద శిబిరాలకు వ్యతిరేకంగా''ఆపరేషన్ సిందూర్'' పేరుతో నిర్ణయాత్మక చర్యలు చేపట్టి జరిపన దాడులు గర్వకారణమని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సాయుధ బలగాలకు, కేంద్ర ప్రభుత్వ చర్యలకు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే బుధవారంనాడు ఏర్పాటు చేసిన అత్యవసర

తరువాయి 2లో



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నా. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయి.. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలి. ''ఒక భారతీయ పౌరుడిగా నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తున్నాను. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. ఈ దాడులు మన సైన్యం సామర్థ్యం, ధైర్యాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటాయి. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరం వినిపిద్దాం. జై హింద్''
— ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాం. పాకిస్థాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను ఆసరాగా చేసుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది. ఆ దేశానికి సరైన గుణపాఠం చెప్పాల్సిందే. సహనానికి మారుపేరైన భారత్‌లో ఉగ్రవాదాన్ని ఖచ్చితంగా శాశ్వతతంగా నిర్మూలించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం పక్కా కార్యాచరణతో ముందుకు సాగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలి.
— సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నేడు ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి సంఘీభావ ర్యాలీ

ప్రణాళిక ప్రకారం నిర్ధేశిత లక్ష్యాలు ధ్వంసం చేశాం : రాజ్‌నాథ్‌సింగ్

ఇంతటితో ఆపొద్దు : హిమాన్షీ నర్వాల్

లోపలి పేజీల్లో

''భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నాను. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో వున్నా, ఏ దేశంలో వున్నా ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి'' భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికీ తీసిపోమనే విధంగా వారికి శక్తి సామర్థ్యాలుండాలి.
— బిఆర్‌ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు



### 'ఆపరేషన్ అభ్యాస్' సక్సెస్

హైదరాబాద్‌లో ఆరు ప్రాంతాల్లో మాక్ డ్రిల్





ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ : భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో సైరన్లు మోగాయి. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వివరించారు. నగరంలోని నాలుగు ప్రాంతాలు (నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఇసిఐఎల్ ఎన్‌ఎఫ్‌సి) నుంచి కొనసాగిన మాక్ డ్రిల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. మరోవైపు, మాక్ డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ జరిగినట్లుగా శబ్దాలు వినబటం, కొందరు సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే..

తరువాయి 12లో

### కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

### 22 మంది మావోయిస్టులు హతం


- కొనసాగుతున్న కాల్పులు
- జల్లెడపడుతున్న సంయుక్త బలగాలు
- గుట్టల చుట్టూ కాల్పుల మోత



ప్రజాపక్షం/భద్రాచలం

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు బీజాపూర్ జిల్లా పరిధిలోని కర్రెగుట్టల్లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలుమావోయిస్టులకు నడుమ సాగిన భీకరపోరులో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటను ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి ధృవీకరించారు. అంతరాష్ట్ర సరిహద్దులోని కర్రెగుట్టల అడవిలో సంయుక్త భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా సుమారు తెల్లవారు జాము సమయంలో మావోయిస్టులు తరసపడటంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఐదు గంటలకుపైగా హోరాహోరీగా సాగాన ఎదురు కాల్పుల్లో 22 మంది సాయుధ మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిని గుర్తించాల్సి ఉంది. ఎన్‌కౌంటర్‌తో మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య ఏప్రిల్ 21నుండి ఇప్పటి వరకు 26కి చేరుకుంది. బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ప్రారంభమైన

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## పలు దేశాల సెక్యూరిటీ అడ్వైజర్లకు అజిత్ దోవల్ ఫోన్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ప్రదేశాలలో ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలపై కేంద్రీకృత దాడులు జరిగిన తర్వాత మన నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పలు దేశాల ఎన్ఎస్ఎలతో అజిత్ సంప్రదింపులు జరిపారు. ఈ టెలిఫోన్ సంభాషణలో ఎన్ఎస్ఎ తన సహచరులకు.. యుద్ధంకు సంబంధించి తీసుకున్న చర్యలు, అమలు విధానం గురించి వివరించారు. అయితే, ఈ యుద్ధం తీవ్రతరం కానిది, సంయమనంతో కూడినది అని ఆయన సహచరులకు తెలిపారు. అయితే, పాక్ తో యుద్ధాన్ని తీవ్రతరం చేసే ఉద్దేశ్యం భారత్ కు లేదని, కానీ పాకిస్తాన్ తీవ్రతరం చేయాలని నిర్ణయించుకుంటే దృఢంగా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉందని దోవల్ నొక్కి చెప్పారు. రాబోయే రోజుల్లో దీనికి సంబంధించి తన సహచరులతో తాను సంప్రదిస్తానని కూడా ఎన్ఎస్ఎ అజిత్ దోవల్ తెలిపారు. ఇదే సందర్భంలో 'ఈ దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచాలనే నిబద్ధతకు తాము కట్టుబడి ఉన్నాం' అని కూడా ఆయన విదేశీ ప్రతినిధులకు వెల్లడించారు.

# యుద్ధం రానివ్వొద్దు...సంయమనం పాటించండి

## భారత్-పాక్‌కు ప్రపంచ నేతల హితవు
## ప్రాదేశిక సుస్థిరతకు విఘాతం కలగనివ్వొద్దు
## శాంతియుతంగా చర్చించి సమస్యలు పరిష్కరించుకోండి
## దౌత్యానికి మా వంతు సహకరిస్తాం

**వాషింగ్టన్/మాస్కో:** భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే పరిస్థితులు నెల కొనడంపై ప్రపంచ దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను శాంతియుతంగా, సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందుకోసం రాజకీయ, దౌత్య, ద్వైపాక్షిక మార్గాలను అనుసరించాలని భారత్, పాకిస్థాన్‌కు హితవు పలికారు. ప్రాదేశిక శాంతి, సుస్థిరతకు విఘాతం కలగనివ్వవద్దని సూచించారు. దౌత్యానికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమని కొందరు నేతలు వెల్లడించారు. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ మంగళబుధవారం మధ్యరాత్రి పేరిట మెరుపు దాడులు చేసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది. దీంతో ప్రపంచ దేశాధినేతలు స్పందించారు. శాంతికి పిలుపునిచ్చారు. సంయమం పాటించాలని సూచనలు చేశారు. ఈ శత్రుత్వం త్వరగా ముగుస్తుందని అమెరికా, రష్యా, చైనా, పాన్, అరబ్‌తో పాటు అనేక దేశాలు ఆకాంక్షించాయి. శాంతి మార్గంలో సమస్యలు పరిష్కారం కాగలవని, యుద్ధం వద్దని, సంయమం పాటించాలని ఐక్య రాజ్య సమితి కూడా పిలుపునిచ్చింది. పహల్గాంలో ఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్' ద్వారా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాను ధ్వంసం చేసింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ పరిణామాన్ని పాకిస్థాన్ యుద్ధ చర్యగా అభివర్ణించింది.

**యుద్ధమొస్తే ప్రపంచం తట్టుకోలేదు: ఐరాస**

అణ్వస్త్రాలు కలిగివున్న భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే ప్రపంచం తట్టుకోలేదని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)తో పాటు ఐబీ వెంబడి భారత సైనిక చర్యలతో సంయమం పాటించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా దౌత్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలని, యుద్ధంతో సమాధానం లభించబోదని హితవు పలికారు. ఈ మేరకు గుటెర్రస్‌కు అధికార ప్రతినిధి స్టెఫనీ దుజారిక్ వెల్లడించారు.




**శాంతించాలి...**

భారత్, పాకిస్థాన్‌కు ప్రత్యేకంగా ఇచ్చే సందేశమేమీ లేదు కానీ ఇదంతా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఓవల్ కార్యాలయంలోకి ప్రవేశించేటప్పుడు విషయం తెలిసిందని చెప్పారు. ఈ పోరు ఇప్పటిది కాదు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోందని అన్నారు. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. భారత్, పాకిస్థాన్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు అమెరికా మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. పాకిస్థాన్ మీద భారత్ ప్రతీకార దాడి... పోరు తీవ్రరూపం దాల్చుతుండటం ఆందోళన కలిగిస్తోందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖోరోవా అన్నారు. పరిస్థితి చేయిదాటకుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్రాదేశిక ఘర్షణను నివారించేందుకు సంయమం పాటించాలని కోరారు. శాంతియుత, రాజకీయ, దౌత్య మార్గాల్లో భారత్, పాకిస్థాన్ మధ్య విభేదాలు పరిష్కారం కాగలవని ఆకాంక్షించారు. 1972 నాటి సిమ్లా ఒప్పందం, 1999 నాటి లాహోర్ డిక్లరేషన్ ప్రకారం ద్వైపాక్షిక మాధ్యమంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భారత్, పాక్‌కు రష్యా అధికారి సూచించారు. ప్రాదేశిక, అంతర్జాతీయ శాంతికి ముప్పు కలిగించే పరిస్థితి తేవద్దని, పరిస్థితి మరింత జటిలం కాకుండా, ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చకుండా సంయమం పాటించాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉప ప్రధాని అబ్దుల్లా బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఒక ప్రకటనలో కోరారు. చర్చలు, పరస్పర అవగాహనతో సైనిక ఘర్షణల నివారణకు పిలుపునిచ్చారు. దక్షిణాసియా సుస్థిరతకు, ప్రాదేశిక ఉద్రిక్తతల నివారణకు శాంతియుతంగా చర్చించుకోవాలని సూచించారు. శాంతి, సుస్థిరత, సౌభాగ్యతకు కట్టుబడాలన్నారు. శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలని భావిస్తే తమ వంతు సహకారం అందించేందుకు యూఏఈ సిద్ధమన్నారు. భారత్, పాక్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు పాన్ చీఫ్ కేబినెట్ సెక్రటరీ యోషిమాసా హయాషి తెలిపారు. ఈ పరిస్థితులు యుద్ధానికి దారి తీయొచ్చు... సంయమం పాటించండి అని రెండు దేశాలను కోరారు. దక్షిణాసియా శాంతి, సుస్థిరత కోసం చర్చల ద్వారా పరిస్థితిని నియంత్రించాలన్నారు. ఇదిలావుంటే, ప్రాదేశిక శాంతి, సుస్థిరత పరిరక్షణకు చైనా పిలుపునిచ్చింది. సంయమం పాటించాలని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. 'భారత్, పాకిస్థాన్ ఇరుగుపొరుగు దేశాలు, చైనాకు కూడా ఇవి పొరుగు దేశాలు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. అయితే శాంతి, సుస్థిరత దృష్ట్యా సంయమం పాటించాలని, పరిస్థితిని జటిలం చేసే చర్యలు నివారించాలని సూచిస్తోంది' అని ప్రకటనలో చైనా విదేశాంగ శాఖ పేర్కొంది.

# వెనక్కు తగ్గిన పాక్!

## దౌత్యానికి సిద్ధమన్న రక్షణ మంత్రి
## దాడికి ప్రతిదాడి తప్పదని గాంభీర్యం



**ఇస్లామాబాద్:** భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ వెనక్కు తగ్గింది. రక్తం పారిస్తాం, దీటుగా బదులిస్తామని నిన్నటి వరకు హెచ్చరికలు చేసి... ఇప్పుడు దౌత్యానికి సిద్ధమంటోంది.అదే సమయంలో సరైన సమయంలో దాడులు చేస్తామంటూ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. తాజా పరిణామాలపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్పందిస్తూ 'మేము ముందు దాడి చేయలేదు. అది భారత్ చేసింది. మాది ప్రతిస్పందన మాత్రమే' అని అన్నారు. న్యూఢిల్లీ ఉద్రిక్తతలను పెంచితే ఇస్లామాబాద్ తప్పక బదులిస్తుందన్నారు. అయితే భారత్ వెనక్కు తగ్గితే ఈ ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతామని ఆసిఫ్ తెలిపారు. 'భారత్‌పై మేము ముందు దాడి చేయలేదు. అలా చేయమని పక్షం రోజులుగా చెబుతున్నాం. భారత్ ముందుగా దాడి చేసింది కాబట్టి ప్రతిఘటిస్తాం. భారత్ వెనక్కు తగ్గితే మాత్రం కచ్చితంగా ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతాం' అని చెప్పారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగే అవకాశంపై తనకు సమాచారం లేదని రక్షణ మంత్రి తెలిపారు. తమ భూభాగంలో అంగుళాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసినాగానీ భారత్ మూల్యాన్ని చెల్లించుకోవాలని హెచ్చరించారు. భారత్ వైఖరిని బట్టి పాకిస్థాన్ స్పందన ఉంటుందన్నారు. ఇస్లామాబాద్ చర్యలకు ఎంతో సమయం పట్టదన్నారు. అవసరాన్ని బట్టి దాడులు చేయడమా లేక దౌత్యాన్ని అనుసరించడమా అన్నది నిర్ణయిస్తామని ఆసిఫ్ వెల్లడించారు. ఇదిలావుంటే, భారత్ దాడులను పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం ఖండించింది. కాగా, తాము ఎంపిక చేసుకునే సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్థాన్ సైన్యం హెచ్చరించింది.

# సైన్యానికి సర్వాధికారాలు

## పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి



**ఇస్లామాబాద్:** ఆపరేషన్ సిందూర్ పేరిట తమ దేశంపై భారత్ మెరుపు దాడులను యుద్ధ చర్యగా పాకిస్థాన్ పేర్కొంది. తగు విధంగా బదులిస్తామని భారత్‌ను హెచ్చరించింది. ఇందుకోసం అన్ని బాధ్యతలను తమ సైన్యానికి అప్పగించినట్లు పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌పై ప్రతీకార చర్యలకుగాను సర్వాధికారాలు సాయుధ దళాలకు అప్పగించినట్లు వెల్లడించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) బుధవారం కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, త్రివిధ దళాధిపతులు, సీనియర్ అధికారులు సమావేశమైంది. తాజా పరిస్థితులను సమీక్షించి... ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణకు కల్పించిన హక్కుకు కట్టుబడి భారత్‌కు బదులిస్తావ్వాలని నిర్ణయించింది. ఇందుకు సమయం, స్థలం, దాడుల తీరుపై నిర్ణయాన్ని సైన్యానికే వదిలివేసింది. 'అమాయక మహిళలు, పిల్లలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యం చేసుకోవడం హేయం. మానవ, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా హేయమైన నేరానికి భారత సైన్యం పాల్పడింది. కల్పిత ఉగ్రవాదుల శిబిరాల నెపంతో దాడులు చేసి, అమాయక పౌరులను హతమార్చింది. నివాసాలు, మసీదులను ధ్వంసం చేసింది' అని పాక్ భద్రతా మండలి మండిపడింది. వేలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కల్పించేలా గల్ఫ్ దేశాల వాణిజ్య విమానాలను ప్రమాదంలో పడేవేసేలా భారత్ దాడులు చేసిందని పేర్కొంది. నీలంఝీలం జలవిద్యుత్ ప్రాజెక్టును భారత్ క్ష్యం చేసుకుందని పేర్కొంది. తమ భూభాగంలో ఉగ్రవాదులు లేరంటూ భారత్ ఆరోపణలను తోసిపుచ్చింది. ఏప్రిల్ 22 దాడులు ఆక్షేపణీయమని, వాటిపై తటస్థ, పారదర్శక విచారణను కోరినట్లు గుర్తుచేసింది. అమాయకుల ప్రాణాలు తీయడాన్ని పాకిస్థాన్ ఆమోదించదని, భారత్ ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టిస్తోందని, తదుపరి చర్యలకు ఆ దేశానిదే బాధ్యత అని భద్రతా మండలి పేర్కొంది.

**పంజాబ్ ప్రావిన్స్‌లో ఎమర్జెన్సీ:** భారత్ క్షిపణి దాడులతో అన్ని విద్యా వ్యవస్థలను మూసివేస్తూ పాకిస్థాన్, పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితిని సీఎం మరియం నవాజ్ ప్రకటించారు. పంజాబ్‌లో హై అలర్ట్ విధించారు. పంజాబ్ పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. ప్రావిన్స్‌లోని అన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులు రద్దు చేశారు. అన్ని జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు కూడా విధులకు హాజరు కావాలని ఆదేశాలిచ్చారు.

**48 గంటలు ఎయిర్‌స్పేస్ బంద్:** పాకిస్థాన్, పీఓకేలో భారత్ మెరుపు దాడులతో 48 గంటల పాటు గగనతలాన్ని మూసివేస్తూ పాకిస్థాన్ ఆదేశాలిచ్చింది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇస్లామాబాద్, లాహోర్ మీదగా వెళ్లే విమానాలను కరాచీకి దారి మళ్లించినట్లు ఏవియేషన్ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ, దేశీయ విమాన సేవలకు ఆటంకం కలిగింది. అయితే కొద్ది సేపటి కోసం తెరిచి... కొన్ని విమానాలను అనుమతించిన తర్వాత 24 గంటల కోసం లాహోర్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ పరిణామాలతో కరాచీలోని జిన్నా విమానాశ్రయం కిటకిటలాడింది. అంతర్జాతీయ, దేశీయ విమానాలన్నీ అక్కడ నుంచే రాకపోకలు సాగించాయి.

# 'సైబర్ జాగృక్త దివాస్'

## నిర్వహించిన టిజిసిఎస్‌బి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 325 ప్రాంతాల్లో 'సైబర్ జాగృక్త దివాస్' కార్యక్రమం నిర్వహించినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు శిఖాగోయల్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, వైద్య సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రజా సమావేశ కేంద్రాలు, బస్ స్టాండ్లలో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ గేమింగ్ చట్టం, 2017 ప్రకారం తెలంగాణలో ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లు చట్టవిరుద్ధం అని అన్నారు. బాధితులు 8712672222 వాట్సాప్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.




## భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

అతిపెద్ద ఆపరేషన్‌లో డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీస్ అన్ని విభాగాలు, సెంట్రల్ ఫోర్స్, కోబ్రా బలగాలు సుమారు 24000 మంది పాల్గొంటున్నారు. మావోయిస్టు అగ్రనేతలు కర్రెగుట్టల్లో మకాం వేసి ఉన్నారనే పక్క సమాచారం మేరకు ఈ ఆపరేషన్‌ను కేంద్రప్రభుత్వం సవాల్‌గా తీసుకుని ప్రారంభించి ంది. ఏప్రిల్ 24వ తేదిన పిఎల్‌జిఏ బెటాలియన్ 1కి చెందిన ముగ్గులు మహిళా మావోయిస్టులు కర్రెగుట్టల్లో జరిగిన కాల్పుల్లో మృతి చెందారు. వారి ఒక్కొక్కరి తలపై రూ.8 లక్షల రివార్డు ఉంది. దీని ఆధారంగా సుమారు తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న 90 కి.మీ కర్రెగుట్టల్లో బలగాలు క్యాంపులు ప్రారంభించాయి. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ ప్రాంతం పూర్తి సేఫ్ జోన్‌గా ఉండటంతో దళాలు ఆ దిశగా దృష్టి సారించి ఫలితాలు సాధిస్తున్నాయి. గత కొద్దిరోజుల క్రితం అత్యంత కీలకమైన బంకర్లను గుర్తించి ధ్వంసం చేసి మందుగుండు సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో మే 5న భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు కూడా మృతి చెందిన విషయం విధితమే. దట్టమైన అడవులు, ఎత్తైన కొండలతో ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దు కేంద్రంగా చేసుకుని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకుని భీమారంపాడు, కస్తూరిపాడు, చిన్నఊట్లపల్లి, పెద్ద ఊట్లపల్లి, పూజారి కాంకేర్, గుంజపర్ల, నచ్చిఎలిమిడి, నడిపల్లి, గల్లమ్ ప్రాంతాలను విస్తరించి ఉండి మావోయిస్టుల అత్యంత రహస్యస్థావరంగా ఉంది. జరిగిన ఎదురు కాల్పుల్లో చాలా మంది మావోయిస్టు నాయకులు మృతి చెంది ఉండవచ్చని, లేదంటే గాయపడి ఉండవచ్చని, వారిని వారి సహచర మావోయిస్టులు అడవుల్లోనికి తీసుకెళ్లిపోయి ఉంటారని పోలీస్ అధికారులు అనుమానిస్తున్నారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టల్లో ఇప్పటి వరకు అత్యంత కీలకమైన బంకర్లను, రహస్య స్థావరాలను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి, డిటోనేటర్లు, ఇతర నిల్వలను భారీగానే స్వాదీనం చేసుకున్నారు. కర్రెగుట్టల్లో కూంబింగ్ నిర్వహించే సమయంలో అడగడుగునా అవాంతరంగా మారిన ఐఇడి బాంబుల మూలంగా సుమారు ఆరుగురు జావన్ల వరకు తీవ్ర గాయాల పాలు కాగా ప్రస్తుతానికి వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల మోతతో గుట్టలు దద్దరిల్లుతున్నాయి. కొండలను చుట్టుమిట్టిన భద్రతా బలగాలు క్షుణ్ణంగా గాలింపుచర్యలు చేపట్టాయి. ఇదిలా ఉండగా తాజాగా ఈ ఏడాది చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌తో పాటు పలు ఎదురు కాల్పుల్లో 168 మంది మావోయిస్టులు హతమయ్యారు. వారిలో 151 మంది బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న బస్తర్ డివిజన్‌లో హతమార్చబడ్డారు.

## 26 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

దాడులు జరిపిందని, శతృవుతో ఎలా వ్యవహరించాలో తమ బలగాలకు తెలుసునని అన్నారు. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వావాజా ఆసిఫ్ మాట్లాడుతూ న్యూఢిల్లీ ఉద్రిక్తతలను తగ్గిస్తే గనుకతో, వారితో ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు పాకిస్తాన్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ''కవ్వింపు లేకుండా''నే భారత్ దాడులకు పాల్పడిందని, భారతీయ సైన్యం దీర్ఘశ్రేణి ఆయుధాలతో పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించినట్లు పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ వ్యాఖ్యానించింది. గత అర్థరాత్రి భారత్ ఆరు ప్రాంతాలలో దాడులు చేసిందని, అందులో పాకిస్తాన్ 26 మంది హతమయ్యారని, 46 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మెద్ షరీఫ్ చౌద్రీ తెలిపారు. బహవల్ పూర్ ప్రాంతంలోనే 13 మంది మరణించారని, 37 మంది గాయపడ్డారని చెప్పారు. మురిద్కేలో ముగ్గురు మరణించగా, ఒకరు గాయపడ్డారని, సియాల్‌కోట్, షకర్‌ఘర్ ప్రాంతంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని మీడియాకు వివరించారు. ఎల్‌ఒసి వెంబడి భారత్ జరిపిన కాల్పుల్లో ఐదుగురు పౌరులు మరణించారని అన్నారు. ఏ సందర్భంలోనూ భారతీయ విమానాలు పాకిస్తాన్‌లోకి అనుమతించలేదేని, అలాగే పాకిస్తాన్ విమానాలు భారత్‌లోకి ప్రవేశించలేదని అన్నారు. పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ ఆస్తులన్నీ సురక్షితంగా ఉన్నాయని తెలిపారు.బహవల్ పూర్‌లోని తమ ప్రధాన కేంద్రంపై జరిగిన భారత క్షిపణుల దాడులలో తమ కుటుంబంలోని పది మంది, నలుగురు సన్నిహిత సహచరులు మరణించినట్లు జైష్-ఎ-మొహమ్మద్ ఛీఫ్ మౌలానా మసూద్ అజహర్ ధృవీకరించారు.

## పాక్ కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. పాక్‌లో అనేక పోస్టులు ధ్వంసమైన తర్వాత భారత సైన్యం తగిన విధంగా షెల్లింగ్‌కు ప్రతిస్పందిస్తోందని, శత్రు దేశం వైపు పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగిందని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ షెల్లింగ్‌ల దాడుల్లో పూంచ్ జిల్లా విధ్వంసానికి గురైంది. అక్కడ ఉన్న పౌరులందరూ మరణించారని, 42 మంది గాయపడ్డారని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ జరిపిన విచక్షణారహిత కాల్పులు సరిహద్దు నివాసితులలో భయాందోళనలను సృష్టించాయి. వారు భూగర్భ బంకర్లలో లేదా వారి గ్రామాల లోపల లేదా వెలుపల సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. బాలాకోట్, మెంధార్, మంకోట్, కృష్ణ ఘాటి, గుల్పూర్, కెర్నీ, పూంచ్ జిల్లా ప్రధాన కార్యాలయాలతో సహా పూంచ్‌లోని ఎల్‌ఓసి వెంబడి కాల్పులు జరిగాయని, ఫలితంగా డజన్ల కొద్దీ ఇళ్ళు, వాహనాలు దెబ్బతిన్నాయని వారు తెలిపారు. మృతులను బల్వీందర్ కౌర్ అలియాస్ రూబీ (33), మొహమ్మద్ జైన్ ఖాన్ (10), అతని అక్క జోయా ఖాన్ (12), మొహమ్మద్ అక్రమ్ (40), అమ్రిక్ సింగ్ (55), మొహమ్మద్ ఇక్బాల్ (45), రంజీత్ సింగ్ (48), షకీలా, మొహమ్మద్ రఫీ (40) గా అధికారులు గుర్తించారు. బారాముల్లా జిల్లాలోని ఉరి సెక్టార్‌లో జరిగిన సరిహద్దు కాల్పుల్లో ఐదుగురు మైనర్ పిల్లలు సహా పది మంది గాయపడగా, రాజౌరి జిల్లాలో మరో ముగ్గురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. కుప్వారా జిల్లాలోని కర్నా సెక్టార్‌లో జరిగిన కాల్పుల్లో అనేక ఇళ్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయని అధికారులు తెలిపారు. సరిహద్దు అవతల నుండి కాల్పులు మధ్యాహ్నం వరకు తీవ్రంగా కొనసాగాయి, తరువాత అడపాదడపా జరిగాయి. ఎక్కువగా పూంచ్ సెక్టార్‌లో చోటు చేసుకున్నాయి. పూంచ్ బస్టాండ్‌పై పెద్ద ఎత్తున షెల్లింగ్‌లతో కాల్పులు జరపడంతో అనేక వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితులను ఆసుత్రులకు తరలించడంలో స్థానికులు ఇబ్బంది పడినట్లు అధికారులు తెలిపారు. 6, 7 తేదీల మధ్య రాత్రి సమయంలో, పాకిస్తాన్ సైన్యం ఎల్‌ఓసి, జమ్ముకశ్మీర్ ఎదురుగా ఉన్న అంతర్జాతీయ సరిహద్దు పోస్టుల నుండి ఫిరంగి దాడులతో ఏకపక్ష కాల్పులకు దిగిందని రక్షణ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత సైన్యం కూడా దీటుగా స్పందిస్తోందని ఆయన అన్నారు. భారత దళాలు ప్రతీకార చర్యలో పాక్ దళాలకు చెందిన అనేక పోస్టులను ధ్వంసం చేసి ప్రాణనష్టం కలిగించాయని ఆర్మీ వర్గాలు తెలిపాయి. జమ్ము ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలు బుధవారం మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జమ్ము, సాంబా, కథువా, రాజౌరి, పూంచ్‌లోని అన్ని మూసివేయాలని డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్ ఎక్స్‌లో తెలిపారు. పహల్గామ్ దాడి తర్వాత తీవ్ర ఉద్రిక్తతల మధ్య, జమ్ము కశ్మీర్‌లోని సరిహద్దుల వెంట పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడడం వరుసగా ఇది 13వ రాత్రి.

## వామపక్షాల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పౌరులను తీవ్రంగా రెచ్చగొట్టి అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారని, అలాంటి సమయంలో ఉగ్రవాదుల మూలాలపై దృఢంగా స్పందించడం తప్ప భారతదేశానికి వేరే మార్గం లేదని సిపిఐ విశ్వసిస్తున్నదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం దేశ ప్రజలను, సమగ్రతను రక్షించేలా చూడాలని, పూర్తి స్థాయి సంఘర్షణను ఆహ్వానించకుండా జవాబుదారీతనానికి ప్రాధాన్యతనిస్తూ క్రమబద్ధీకరించబడిన తీవ్రతరం కాని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్నదని సిపిఐ తెలియజేసింది. అయితే ఇదే సమయంలో భారత ప్రభుత్వం జాతీయ ఏకాభిప్రాయాన్ని బలోపేతం చేయడానికి, ఉగ్రవాదంపై జరిగే పోరాటంలో సమిష్టి సంకల్పంతో ఉగ్రవాదాన్ని తుదముట్టించడానికి తక్షణమే అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఒకటి ఏర్పాటుచేయాలని సిపిఐ కోరింది. ఆసియా ప్రాంతంలో మరింత ఉద్రిక్తతలను తగ్గించి ఈ ప్రాంతంలో శాంతిని పరిరక్షించడానికి, ఒప్పంద పరిష్కారాలను కనుగొనేందుకు దౌత్యమార్గాలను అనుసరించాల్సిన ఆవశ్యకతను సిపిఐ పునరుద్ఘాటించింది.ఉగ్రవాద దెబ్బకు గురైన పాకిస్థాన్ కూడా తన గడ్డపై నుండి పనిచేస్తున్న అన్ని నెట్‌వర్క్‌లను సమూలంగా నిర్మూలించాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తోంది. ఈ సమయంలో భారత ప్రజల ఐక్యత, బలం, న్యాయం పట్ల అచంచల నిబద్ధత, లౌకికవిలువల పరిరక్షణకు కృషిచేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సిపిఐ పిలుపునిచ్చింది. ఉమ్మడి ప్రాంతీయ సంకల్పం మాత్రమే హింసా చక్రాన్ని అంతం చేయగలదని, మన ప్రజలకు దీర్ఘకాలిక శాంతిని, భద్రతను ప్రసాదిస్తుందన్న విశ్వాసాన్ని సిపిఐ వ్యక్తం చేసింది.లక్ష్యంగా చేసుకున్న దాడుల స్వభావం..పాకిస్థాన్ సైనిక ఆస్తులను నివారించడం, ఉగ్రవాదుల మౌలిక వసతులపై మాత్రమే దృష్టి సారించడం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పిఒకె), పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాల మౌలికవసతులను నాశనం చేయాలనే ధ్యేయంతో భారత సాయుధ బలగాలు 'ఆపరేషన్ సిందూర్'ను నిర్వహించాయని, సాయుధ బలగాల ప్రకారం ఈ దాడులు నిశితదృష్టి సారించి నిర్దేశిత కేంద్రీకృత ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే జరిగాయని, తీవ్రతరం కాకుండా 9 స్థలాలలో విజయవంతంగా దాడులు చేయడం అభినందనీయమని సిపిఐ(ఎం) తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని రకాల చర్యలకు మద్దతు ఇచ్చాయని, ఉగ్రవాదులు, వారి మద్దతుదారులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపుడుతున్న చర్యలపై ఇప్పుడు ఆ మద్దతును ఇంకా కొనసాగిస్తున్నాయని సిపిఐ(ఎం) తెలియజేసింది. భారత ప్రభుత్వం దేశ ప్రజలను, సమగ్రతను రక్షించేలా చూడాలని సిపిఐ(ఎం) ప్రకటన కోరింది.ఇండోపాకిస్థాన్ యుద్ధాన్ని నివారించడానికి ఉద్రిక్తతలను తగ్గించాలని సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసే విధానంలో భారతదేశం విశేష నిగ్రహాన్ని ప్రదర్శించింది,'' అని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.బహవల్‌పూర్, మురిద్కే సహా తొమ్మిది లక్ష్యాలపై దాడులు విజయవంతమయ్యాయని భారతీయ అధికారులు తెలిపారు. మీడియా సమావేశంలో మిస్రీ మాట్లాడుతూఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసేందుకు, భవిష్యత్తు ఉగ్ర దాడులను ''నిరోధించేందుకు, ముందే నిర్వీర్యం చేసేందుకు'' భారతీయ సైన్యం ''నిర్దేశిత, ఉద్రిక్తత పెంపు రహిత, తగిన, బాధ్యతాయుతమైన'' సైనిక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ''పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాద కేంద్రాలను పర్యవేక్షిస్తున్న మన నిఘా వర్గాలు భారతదేశంపై మరిన్ని ఉగ్ర దాడులకు జరిగేందుకు అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చాయ''ని తెలిపారు. ''భారతదేశం తనకు ఉన్న ప్రతిస్పందించే హక్కును ఈరోజు ఉదయం వినియోగికొని, మరిన్ని సీమాంతర దాడులను ముందస్తుగా భగ్నం చేయడం, నియంత్రించడం జరిగింది'' అని అన్నారు. ''పహల్గాంలో దాడి అత్యంత ఆటవికమైనదని, బలైన వారిని వారి కుటుంబసభ్యుల ముందే నేరుగా తలపై గురిపెట్టి సమీపంగా కాల్చారని చెప్పారు. '' చంపిన తీరు ద్వారా కుటుంబసభ్యులను ఉద్దేశ్యపూర్వకంగా భీతావహులను చేశారని, ఇక్కడ నుంచి సందేశాన్ని పంపాలని చెప్పారని'' ఆయన అన్నారు. వింగ్ కమాండ్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఒకవేళ పరిస్థితులను ఉద్రిక్తంగా మార్చేందుకు ''దుస్సాహసానికి'' పాల్పడితే భారతీయ సాయుధ బలగాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహిళా సైనికాధికారులు 'ఆపరేషన్ సిందూర్' గురించి విడియోలను ప్రదర్శిస్తూ వివరించారు.తొలుత పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాద సంస్థలు చేసిన పాల్పడిన 2001 పార్లమెంట్‌పై దాడి, 2008 ముంబై దాడులు, 2019 పుల్వామా ఆత్మాహుతి దాడి వంటి దాడుల విడియోలను ప్రదర్శించారు. ఉగ్ర శిబిరాలపై సూక్ష్మ సామర్థ్యంతో , అత్యంత జాగ్రత్తగా వార్‌హెడ్‌లతో వినియోగించే ఆయుధాలను ఎంపిక చేసి, చుట్టుపక్కల ఎలాంటి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు. ప్రతి లక్ష్యం కూడా నిర్ధారిత భవనాన్ని లేదా భవనాల సమూహాలపైనే ప్రభావం ఉండేలా చూసినట్లు తెలిపారు.

## ఇదే మా వందనం

(మొదటి పేజీ తరువాయి)

వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ భద్రతకు, ఐక్యత, సమగ్రతలకు పూర్తి భరోసా ఇచ్చే భారత సాయుధ బలగాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఇద్దరూ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం గురువారంనాడు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ ఇద్దరు నాయకులూ పాల్గొంటారు. ''ఆపరేషన్ సిందూర్ గురించి, ప్రభుత్వ చర్యల గురించి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది, భారత సాయుధబలగాలు చేపట్టిన చర్యకు తామెంతో గర్విస్తున్నాం, పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో తిష్ఠవేసి ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం ద్వారా వారికి తగిన గుణపాఠం చెప్పాం, భారత సాయుధబలగాల ధైర్యసాహసాలకు ఇవే మా వందనాలు, వారి కృతనిశ్చయం, వారి దేశభక్తికి మా వందనాలు'' అని ఖర్గే సమావేశం అనంతరం పేర్కొన్నారు. ''పహల్గామ్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాదులు దాడిచేసిన మొదటి రోజు నుండి భారత జాతీయ కాంగ్రెస్ చాలా స్పష్టమైన వైఖరితో భారత సాయుధ బలగాలకు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది, ప్రభుత్వానికి కూడా స్థిరమైన మద్దతు ఇచ్చింది, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వారు తీసుకునే ప్రతి నిర్ణయాత్మకమైన చర్యను సమర్థిస్తామని ప్రకటించాం'' అని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ కూడా స్పందిస్తూ, భారత సాయుధ బలగాలు దేశ రక్షణకోసం తీసుకునే ప్రతి చర్యకూ కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. ''వర్కింగ్ కమిటీ సమావేశంలో మేం చర్చించాం, మా కోరికా అదే, వారిపట్ల పూర్తి ప్రేమాభిమానాలు ప్రదర్శిస్తున్నాం'' అన్నారు. పాకిస్థాన్ నుండి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు నుండి వచ్చే ఉగ్రవాదం భారత్‌కు పెద్ద సమస్యగా మారిందన్నారు. ''భారత్ వంటి గొప్ప దేశ జాతీయ ఐక్యతను, సమగ్రతను రక్షించుకోవడానికి అన్నిస్థాయిలలోనూ ఐఐక్యత ఎంతో అవసరం, భారత జాతీయ కాంగ్రెస్ భుజం భుజం కలిపి దేశ సైనికులతో ముందుకు నడుస్తుంది, దేశ చరిత్రలో భారత ఐక్యత, సమగ్రతకోసం మన సైనికులు ప్రాణత్యాగాలు చేశారు, జాతీయ ప్రయోజనాలను భారత్ ప్రధానాంశంగా భావిస్తుందని యావత్ ప్రపంచానికీ తెలుసు, మేం మన సాయుధ బలగాలకు పూర్తి మద్దతు ఇస్తున్నాం'' అని ఖర్గే తన ప్రకటనలో పేర్కొన్నారు. ''ఈ విషయంలో ఎలాంటి విభేదాలు లేవు, ప్రతిఒక్కరూ ఐక్యంగా ఉన్నారు. ''ఇండియాకూటమి'' భాగస్వామ్యపార్టీలు కూడా దేశ ఐక్యతకోసమే పాటుపడుతున్నాయి, ఇది నిర్ణయించిన విషయం, మేం మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం'' అని ఖర్గే పేర్కొన్నారు. సీనియర్ పార్టీ నాయకులు ఎఐసిసి కోశాధికారి అజయ్ మకెన్, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వాద్రా, ముకుల్ వాస్నిక్, జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా, కేంద్రమాజీమంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత యుద్ధ విమానాలు పాకిస్థాన్ గగనతల ఆంక్షలను ఉల్లంఘించకుండా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జైషే మహ్మద్ కేంద్రకార్యాలయం, లష్కరే తోయిబా కేంద్ర కార్యాలయాలపై దాడులు చేశాయి. చాలా సంక్షిప్తస్థాయిలో ఈ దాడులు ఇరవైఐదు నిమిషాల వ్యవధిలో ముగిశాయి. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులలో ఉన్న అత్యంత కీలకమైన మొత్తం తొమ్మిది స్థావరాలపై భారత యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఈ తొమ్మిది కీలక కేంద్రాలలో పెద్దసంఖ్యలో ఉగ్రవాదులు తలదాచుకుని ఉన్నారు. సుమారు 100 మంది ఉగ్రవాదులను భారత దళాలు మట్టుబెట్టాయని భారత మీడియా అంచనావేసింది.

**ప్రధానమంత్రి మోదీ కనీసం అఖిపక్షసమావేశానికి రావాలి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కనీసం అఖిలపక్ష సమావేశానికైనా హాజరుకావాలని కాంగ్రెస్‌పార్టీ కోరింది. దేశ సరిహద్దు ల్లో జరుగుతున్న పరిణామాలపై వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం గురువారంనాడు (8వ తేదీ) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఈ అఖిలపక్ష సమావేశానికైనా ప్రధానమం త్రి హాజరుకావాలని, ఆయనే స్వయంగా పరిస్థితులను వివరించాలని రాజ్యసభలో ప్రతిప క్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చే శారు. గతనెల 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా మే ఆరవతేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత భారత వాయుసేన పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసింది. ''ప్రధానమంత్రి గురువారంనాడు జరిగే అఖిలపక్ష సమావేశానికి హజరవుతారని మేం అంచనావేస్తున్నాం,, ఆయన ఏప్రిల్ 24న జరిగిన స మావేశానికి కూడా హాజరుకాలేదు, ఈసారైనా వస్తారని అంచనావేస్తున్నాం, రేపు ఆయన రావాలి'' అని జైరామ్ రమేశ్ కోరారు. మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ కూడా గురువారం అఖిలపక్ష సమావేశానికి హాజరవుతున్నారని చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 11న బొటానికల్ గార్డెన్‌లో 'బర్డ్ వాక్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 11న బొటానికల్ గార్డెన్స్‌లో 'బర్డ్ వాక్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు అందరూ ఆహ్వానితులేనని, పాల్గొనే వారు పక్షుల జాతులను గుర్తించడం, పక్షులు ఏరకమైన వాతావరణంలో మరియు ఏ రకమైన వృక్షాలలో గూళ్ళు కడతాయి అనేది తెలుసుకోవచ్చు, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి, పక్షులు ఎలా కదులుతాయి, ఎగురుతాయి, మరియు వాటి సామాజిక ప్రవర్తనలు ఎలా ఉంటాయో మా యొక్క పక్షి నిపుణులు, నేచురలిస్ట్‌లు వచ్చిన వారికి పక్షులను చూపిస్తూ క్షుణ్ణంగా వివరిస్తారని రంజిత్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 98852 98980, 73823 07476 నెంబర్‌లను సంప్రదించాలని వారు కోరారు.

# సమ్మె ఉద్యోగుల హక్కు

ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలో సిఎంను కలుస్తాం
రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందే బిఆర్ఎస్
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సమ్మె అనేది ఉద్యోగుల హక్కు అని, పాలకులు వారి సమస్యలను పట్టించుకోనప్పుడు వాటిని సాధించుకునేందుకు అదే ఒక సాధనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు ఉద్యోగులు ఆవేదనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సహజమని, అలాంటి సమయాల్లో వారితో చర్చించేందుకు పాలకులు ఎప్పుడూ సానుకూలంగా ఉండాలే తప్ప ఆవేశానికి, ఆక్రోశానికి గురికావడం సమస్యలను మరింత జఠిలం చేస్తుందన్నారు. ఉద్యోగ సంఘాల ప్రకటనపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేశం, ఆవేదనతో ఓ ప్రకటన చేయడం తప్పు కాకపోయినప్పటికీ, ఈ సమస్యకు కారణమైన వారు ఎవరో ప్రజలకు ఓర్పుతో అర్థమయ్యే విధంగా చెప్పాలని సూచించారు. ఇందుకు ముందుగా ఉద్యోగ సంఘాలతో సిఎం చర్చలు జరపాలని, దీంతో సగం సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికే అప్పులే కాకుండా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి దాదాపు రూ.70 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వీటిని ఉద్యోగ సంఘాల నేతలకు సమస్యలను వివరించడంతో పాటు ఆర్థికయేతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన అంశాలను ఒకేసారి కాకపోయినా విడతల వారీగా చెల్లించడం ద్వారా వారికి న్యాయం చేయాలని ఆయన అన్నారు.

**ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలో సిఎంను కలుస్తాం**

టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు ఈనెల 7వ తేదీ నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చల్లో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని, సిఎంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని, దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. మంత్రితో జరిగిన చర్చల్లో ప్రధానంగా ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణతో పాటు వారికి రావాల్సిన బకాయిలకు సంబంధించిన అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. యూనియన్లను నిర్వహించుకునే హక్కు బ్రిటీష్ కాలం నుంచే ఉందని, కానీ గత సిఎం కెసిఆర్‌ఓ నియంతలా వ్యవహరిస్తూ యూనియన్లను రద్దుచేయడమే కాకుండా కార్మిక హక్కులను కాలరాస్తూ ఆర్‌టిసిని ఈ దుస్థితికి తీసుకువచ్చారన్నారు. అయితే కాంగ్రెస్ ఆర్‌టిసి కార్మికులతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందే బిఆర్ఎస్**

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న సమస్యలన్నిటికీ కారణం గత బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాని తన తప్పులను దాచుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలని, లేకపోతే ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యే ప్రమాదం ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే కాంగ్రెస్ పాలన కొంత ఫర్వాలేదని తెలిపారు.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు ఒక సలహా కమిటీని వేయాలి**

రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకునేందుకు ఆర్థికవేత్తలు, మేధావులతో ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, సన్న వరి ధాన్యం పండించిన రైతులకు బోనస్, రైతు భరోసా లాంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం అభినందనీయమని, కాంగ్రెస్ ఇచ్చిన మిగితా హామీలను పూర్తిగా అమలు చేయాల్సిందేనని, ఆర్థిక లోటు పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేయకుండా ఇందులో అతి ప్రాధాన్యత గల పథకాలపై లోతుగా విశ్లేషించి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 10 బస్తాల సిమెంట్ ఇచ్చిందనో, లేక రూ.15 వేల ఆర్థిక సహాయం అందించిందనో కుంటి సాకులతో ప్రస్తుత లబ్ధిదారుల జాబితా నుంచి వారిని తప్పిస్తున్నారని, దీని వల్ల దళితులు, ఆదివాసీలే అధికంగా నష్టపోతున్నారని, ఇది సరైందికాదన్నారు. గతంలో పూర్తిస్థాయిలో లబ్ధిపొందిన వారిని మినహాయించి అరకొర సహాయం పొందిన వారికి ప్రస్తుత జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

**కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి**

ఈ దేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని, తక్షణమే దీనిని నిలిపివేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మావోయిస్టు చర్చలకు వస్తామంటే చర్చలకు ఒప్పుకునేదిలేదని, లొంగిపోవాల్సిందేనని ఒక కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామిక దేశమని, వారు శాశ్వతంగా మంత్రులుగా ఉండరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే తప్పకుండా ఖండిస్తామని, అయితే దేశ పౌరులైన వారికి దేశంలోని అన్ని చట్టాలు వర్తిస్తాయని, వాటి ప్రకారం వారిని శిక్షించాలే తప్ప ఎన్‌కౌంటర్లు చేయడం తగదన్నారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని ఎన్‌కౌంటర్ చేయడం దుర్మార్గమన్నారు. ఇంకా ఎంత మందిని చంపితే కేంద్ర పాలకుల రక్త దాహం తీరుతుందని, ఈ ఘటనల వల్ల వారు సంతోషంగా ఉంటారా ప్రశ్నించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## నేడు 'తీవ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన', ర్యాలీ

ప్రజాపక్షం / హైదరాబాద్ : భారత సైనిక బలగాలకు సంఘీభావంగా, అండగా ఉన్నామని సందేశం ఇవ్వడానికి తెలంగాణ ప్రజల తరపున గురువారం సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'తీవ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన'గా ఈ ర్యాలీ కొనసాగుతుందని ప్రకటించింది. దేశ భద్రతా బలగాలు 'ఆపరేషన్ సింధూర్' చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో జరిగిన ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను ముఖ్యమంత్రి సమీక్షించి ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలకు, పార్టీలకు సంబంధించిన వివాదాలకు తావులేదని సిఎం అన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి వివిధ విభాగాలకు స్పష్టంగా పలు ఆదేశాలిచ్చారు. మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, అత్యవసర సర్వీసులు అందించే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలన్నారు. ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలని, విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవల విభాగాలన్నీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సిఎం చెప్పారు. పరిస్థితిని ఆసరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తప్పుడు సమాచారం వ్యాప్తి జరగకుండా ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని, ఫేక్ న్యూస్‌ను, పుకార్లు వ్యాప్తిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

## పేదల కలలను నెరవేర్చడమే...
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తాం
అప్పుల బాధతో ఉన్నప్పటికీ సంక్షేమ ఫలాలు అమలు
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/వాజేడు : రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేదవాడి కలలను నిజం చేయడానికి ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా, వాజేడు మండలం గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ, నాగారం నుండి పాయబట్ల వరకు 40 లక్షలుతో బి.టి రోడ్డు నిర్మాణ పనులు, 150 లక్షల రూపాయల అంచనా విలువతో వాజేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చర్లపల్లి నుండి ముత్తారం వరకు 30లక్షలతో బి.టి. రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, 14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనమును రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరిష్, ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొంగాల గ్రామం 57 మందికి, నాగారం గ్రామం 64 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 8 లక్షల 19వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని వివరించారు.

**ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భద్రాచలం శాసన సభ్యుడు తెల్లం వెంకట్రావు**

భద్రాచలం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు అన్నారు. ఐటిడిఎ పరిధిలోని గ్రామాల నిరుపేద ప్రజలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తన నియోజకవర్గం పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలలోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల నిరుపేద ప్రజలు ఉన్నారని, వారందరికీ దశలవారీగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తిచేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నదని అన్నారు. వాజేడు మండలంలోని మండలంలోని గ్రామంలో 106 ఇళ్లు మంజూరు కాగా 62 ఇండ్లు గ్రౌండ్ లెవెల్‌లో ఉన్నాయని, 15 ఇండ్లు గ్రౌండ్ ఇండ్లు నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు చెల్లించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమములలో జిల్లా ఎస్పీ శబరిష్, ఎఎస్‌పి శివం ఉపాధ్యాయ, డిఎఫ్ఒ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్, మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ విజయ, బిసిఒ సర్దార్ సింగ్, ఎంపి ఒ.శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు మాజీ జడ్పిటిసి తల్లడి పుష్పలత, మాజీ ఎంపిపి శ్యామలశారద పాల్గొన్నారు.




## భారత సైన్యానికి ఎఐవైఎఫ్ సెల్యూట్

ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని హర్షిస్తూ
ట్యాంక్‌బండ్ యుద్ధ ట్యాంక్ వద్ద మిఠాయిల పంపిణీ

ప్రజాపక్షం /హైదరాబాద్ : పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యానికి అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) సెల్యూట్ చేసింది. దేశ ప్రజలంతా భారత సాయుధ దళాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, భారత పౌరులంతా ఐక్యమత్యంగా ఉన్నామనే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సాయుధ దళాలు విజయవంతాన్ని హర్షిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న యుద్ధ ట్యాంక్ ముందు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర లు మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ, కశ్మీర్లలో ఉన్న ఉగ్రవాద మౌలిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడాన్ని ఎఐవైఎఫ్ స్వాగతిస్తుందన్నారు. ఇటీవల పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడుల్లో 25 మంది భారతీయ పౌరులు, ఒక నేపాలీ జాతీయుడు ప్రాణాలను కోల్పోయారని, ఈ చర్యకు ప్రతిచర్యగా భారత సాయుధ దళాలు ధీటైన జవాబు ఇచ్చారని ప్రశంసించారు . ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్, హేమంత్, శ్రీనివాస్, రమేష్,రమ్య, కీర్తన, ఫాతిమా,రాము తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఆర్మీ, పోలీసు, ఇతర అత్యవసర విభాగాలకు చెందిన ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మనడానికి కెటిఆర్‌కు ఉన్న అర్హత ఏమిటి?

మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్రంపై కక్షగట్టి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సిఎం రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మనడానికి మాజీ మంత్రి కెటిఆర్‌కు ఏమి అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశ్యంతో బిజెపి, బిఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణకు బిజెపి ఏంచేసిందో కేంద్ర మంత్రి బండిసంజయ్ సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో 8మంది ఎంపిలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న బిజెపి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్లు పరిపాలనలో తెలంగాణలో ఒక్క కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించిన పాపాన పోలేదన్నారు. ప్రతిపక్ష బిజెపి, బిఆర్ఎస్ నేతలు ఉద్యోగులను రెచ్చగొట్టి సమ్మెకు ఉసిగొల్పుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం దివాలా తీయడంలో కెసిఆర్, కెటిఆర్‌తో పాటూ మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపి ఈటల రాజేందర్ కూడా ఓ భాగస్వామి అన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No.02/SE(H)/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 06.05.2025

**పని పేరు:** మరమ్మతు పనులు (01) పని. **అంచనా విలువ :** రూ.98.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *ప్రారంభ తేది:* 07.05.2025న సా.4.00గం.ల నుండి, *బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 14.05.2025న మ.03.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఒ/ఒ సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), జిహెచ్ఎంసి, 2వ అంతస్తు, మున్సిపల్ బిల్డింగ్, హరిహర కళా భవన్, సికింద్రాబాద్ - 500003. ఏవైనా సందేహాలకు, సంప్రదించండి : శ్రీ ఆర్.శ్రవణ్ కుమార్, డిప్యూటీ ఇఇ (హెచ్), జిహెచ్ఎంసి. సెల్ నెం. 9000115395, ఇ-మెయిల్ ఐడి: se12bhkhousing@gmail.com; మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 1474-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIT No: 06/25-26/EE/PAtoEE/D3/DB/SBD/710 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 06.05.2025

**పని పేరు:** హైదరాబాద్, హైకోర్టు ఆవరణలో బ్లాక్-బి నందు మొదటి అంతస్తులో మొదటి అంతస్తులో కోర్టు మాస్టర్లు / అదనపు కార్యదర్శి కోసం చాంబర్ నెం. 19 కి ఆనుకుని ఉన్న చిన్న గదిని అందించడం., ఇసివి: రూ.45,180/-, **డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 06.05.2025న సా.04.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 09.05.2025న సా.04.30గం.ల వరకు, **బిడ్ ప్రారంభ తేదీ:** 09.05.2025న సా.04.45గం.ల నుండి, **ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) పేరు మరియు చిరునామా:** శ్రీ ఎ.వి. విశ్వకుమార్, బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. మరిన్ని వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.eprocurement.gov.in తెలంగాణలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 1507-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025

**నగర పాలక సంస్థ కార్యాలయము : మంచిర్యాల, జిల్లా: మంచిర్యాల**

ఫైలు నెం.109/ఎ1/2025-26 వేలము కొరకు ప్రకటన - 3 తేది: 06.05.2025

మంచిర్యాల పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మంచిర్యాల నగర పాలక సంస్థ యొక్క మేకల మండి (మంచిర్యాల), మేకలమండి (నస్పూర్), ఫై బజార్, స్లాటర్ హౌజ్, మటన్ మార్కెట్, కూరగాయల మార్కెట్ లోని ఫ్లాటు ఫారములు గల వాటికి సం. 2025-26 అనగా 01.06.2025 నుండి 31.03.2026 వరకు (10 నెలలకు మాత్రమే) మరియు IDSMT SHOPS: 03,05,11,12,13, (17 -Reserve for ST), 18, 20, 21, 22, 23, (28-Reserved for SC), 30, First Floor 1158.25 చ.గ ఏరియా 12000 చ. ఫీట్లు మరియు Market Arena Shops (A Type Shop No. 6,7,9,10) ( IB Type Shop No 9,10,11), (D-Type Shop No.04, 06, 08, 09, 10,11, 13 and (Reserved for SC Shop No. D-07) (SR-Type Shop No 10 and Reserved for SC Shop No. 06) కిరాయికి ఇచ్చుటకు తేది: 16.05.2025 రోజున మున్సిపల్ ఆఫీసులో బహిరంగ వేలము వేయుటకు నిర్ణయించనైనది. వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు తేది: 15.05.2025 సా. 5:00 గంటల లోపు ధరావత్తు మొత్తము కమీషనర్ మంచిర్యాల కార్పోరేషన్ గారి పేరున చెల్లించి సాల్వెన్సీ సర్టిఫికేట్ జతపరిచి ఈ కార్యాలయములో అందచేయవలెను మరియు ఎవరు అయితే ఎక్కువ పాట పాడినవారు అట్టి మొత్తము వేలము రూపాయలు చెల్లించి దానిపై 18 % సర్వీస్ టాక్స్ (షాపులకు మాత్రమే) (G.S.T) అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ క్రింద తెలిపిన నిబంధనలు పాటించవలెను.

| క్ర. సం. | వేలము యొక్క స్వభావము | వేలము వేయు సమయము | ధరావత్తు | సాల్వెన్సీ సర్టిఫికేట్ |
|---|---|---|---|---|
| 1) | మేకలమండి (మంచిర్యాల) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే 2025 లోపు చెల్లించవలెను) | ఉ.10.30 గం., | రూ.2,50,000/- | - |
| 2) | మేకలమండి (నస్పూర్) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | ఉ.11.15 గం., | రూ.2,50,000/- | - |
| 3) | ఫై బజారు (మార్కెట్ లోపల గల ప్లాటు ఫారములు మినహాయించి) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | ఉ.11.45 గం., | రూ.1,50,000/- | 5,00,000 |
| 4) | మటన్ మార్కెట్ (28 ప్లాటు ఫారములు) (సంజీవయ్య కాలని) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | మ.12.00 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 5) | IDSMT Shops (Near Municipal Office) (Shop No. 03,05,11,12,13,(17-Reserved for ST), 18, 20,21,22,23, (28-Reserved for SC), 30 First Floor 1158.25 చ.గ ఏరియా (Open Auction on Rent basis) | మ.12.30 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 6) | Market Area A Type Shops (Shop No. 6,7,9,10) (Open Auction on Rent basis) | మ.03.00 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 7) | Market Area B Type Shops (Shop No.9,10,11) (Open Auction on Rent basis) | మ.03.30 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 8) | Market Area D-type (Shop No. 04,06,08,09,10,11,13) (Open Auction on Rent basis) | సా.04.00 గం., | రూ.1,00,000/- | 1,00,000/- |
| | (Reserve for SC Shop No.07 ) | సా.05.00 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 9) | NearWater Tank Area SR Type Shops (Shop No. 10) (Open Auction on Rent basis) (Reserve for SC Shop No.06) | సా.05.15 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 10) | కూరగాయల మార్కెట్ లోపల ప్లాటు ఫారములు (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే-2025 లోపు చెల్లించవలెను) | సా.05.30 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 11) | స్లాటర్ హౌజ్ (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | సా.05.45 గం., | రూ.50,000/- | 2,00,000/- |

సం/- కమీషనర్
నగర పాలక సంస్థ, మంచిర్యాల.

**నోట్:** వేలము యొక్క నియమ నిబంధనల కొరకు మరియు అప్లికేషన్ ఫాం కొరకు ఆఫీసు పని వేళలలో సంప్రదించగలరు.

DIPR R.O. No. : 1472-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025


## పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల

సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన ఫీల్డ్ అసిస్టెంట్స్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది సంఘాలు ప్రతినిధులతో త్వరలో సమావేశ నిర్వహించి, సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క హామీనిచ్చారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలకు రూ. 62 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు బుధవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సిఎం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లి జీతాలు విడుదల చేయించిన సీతక్కను సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారిని వివిధ కేటగిరీలుగా విభజించడం వల్ల తము నష్టపోతున్నామని, అందరినీ ఒకే కేటగిరిగా పరిగణించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మంత్రిని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్నట్లుగా తెలంగాణలో కూడా అందరిని ఒకే కేటగిరిగా పరిగణించాలని కోరారు.

అలాగే జీతాల్లో కోత విధించేందుకు తెచ్చిన 4779 సర్క్యులర్‌ను రద్ద చేయాలన్నారు. తక్షణం స్పందించిన మంత్రి సీతక్క సంబంధిత అధికారులకు ఆంధ్రప్రదేశ్ విధానాన్ని అధ్యయనం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. జీతాల్లో ఎలాంటి కోతలు లేకుండా, వారితో చేయించుకున్న పనికి వేతనం దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేని పాలనపరమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారుకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల రాష్ట్ర కార్యవర్గం బొలుగురి రవి, చల్లా వెంకటేశ్వర్లు, సిద్దిరాజు, ఆంజనేయులు, గోల్కొండ సురేషు, లక్ష్మి కాంత్, నరేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.




## 13 న చార్మినార్ వద్ద మిస్ వరల్డ్ పోటీదారుల 'హెరిటేజ్ వాక్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : మిస్ వరల్డ్ 2025 పోటీలను విజయవంతంగా జరిగే విధంగా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పర్యాటకశాఖ సంచాలకులు జెడ్ హనుమంతు కొండిబా, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13 న మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ పాత బస్తిని సందర్శించి చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, లాడ్ బజారు సందర్శన, చౌమహల్ల సందర్శించనున్నారని తెలిపారు. ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్ ఓల్ సిటీలోని చార్మినార్, లాడ్ బజారు, చౌమహల్లా ప్యాలెస్‌ను పర్యాటక శాఖ డైరెక్టర్ జెడ్.హనుమంత్ కొండిబా, సౌత్ జోన్ డిసిపి స్నేహమెహ్రా, ఇతర శాఖల అధికారులతో కలసి చేపట్టబోయే ఏర్పాట్లపై అన్ని ప్రాంతాలను సందర్శించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ హైదరాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, పర్యాటక శాఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంట్రాక్టు రెసిడెన్సియల్ టీచర్స్(సిఆర్‌టి) సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి సీతక్క అన్నారు. సిఆర్‌టి సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ఆమె సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. 21 రోజుల సమ్మె వేతనం, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30వేలు మంజూరు చేయించిన మంత్రి సీతక్కకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క వారికి హామీనిచ్చారు. అణగారిన వర్గాల పట్ల ప్రభుత్వం ప్రేమతో ఉందని మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వానికి ప్రేమ ఉందని, అందుకే మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించేందుకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అటు ఉద్యోగులు, ఇటు ప్రజల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు ఏ లోటు లేకుండా చూసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. పట్టువిడుపులు ఉండాలని, తెగేదాకా లాగవద్దు అన్నారు. మంత్రులు ఉద్యోగులు వేర్వేరు కాదని, ఇద్దరు సమన్వయంతో పనికిస్తేనే సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కొంత ఆలస్యమైనా ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సిఆర్‌టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలు పరిష్కారమైనా, ఇక్కడ బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనలో కృషి చేసిన ఎస్‌టి సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డిలను మంత్రి సీతక్క సన్మానించారు.

ప్రజాపక్షం
గురువారం, మే 08

# సరైన సమయంలో సరైన చర్య

జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు టూరిస్టులపై ఒడిగట్టిన ముష్కరదాడికి ప్రతీకారంగా భారత సైనిక దళాలు బుధవారం తొలి ఘడియల్లో (రాత్రి గం.1.05 నుంచి 1.30వరకు) పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 టెర్రరిస్టు మౌలిక వసతులపై జరిపిన మిస్సైల్ దాడులు సరైన సమయంలో తీసుకున్న సరైన సైనిక చర్య. టెర్రరిస్టు లు టూరిస్టుల తలలకు గురిపెట్టి వారి కుటుంబ సభ్యుల సమక్షంలోనే హత్యచేసిన కిరాతక చర్య అత్యంత హేయమైందిగా భద్రతామండలి సహా ప్రపంచ దేశాలన్నీ ఖండించాయి. ఆ హత్యోదంతంలో 25మంది భారతీయులు, 1నేపాలీ మృతి చెందటం భారత ప్రజలకు తీవ్రమైన కలత కలిగించింది. ప్రతీకారం తప్పదని ప్రతి హృదయం బాధతో ఘోషించింది. ప్రభుత్వం ప్రతీకారేచ్ఛతో రగిలిపోయినా సీమాంతర టెర్రరిజాన్ని పెంచి పోషించటంలో పాకిస్థాన్ పాత్రను ప్రధానమైన ప్రపంచ దేశాలకు వివరించి, టెర్రరిజంపై పోరాటానికి వారి మద్దతు సమీకరించేందుకు దౌత్యమార్గాల్లో గట్టి కృషి చేసింది. టెర్రరిజంపై పోరాటంలో భారత్‌కు సంఘీభావం తెలియజేసిన దేశాలు, ఈ ఉద్రిక్తత భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధంగా మారకుండా రెండు దేశాలు సంయమనం పాటించాలని సలహా ఇచ్చాయి. ప్రధాని నరేంద్రమోదీ ఏప్రిల్ 29న సైనిక దళాల అధిపతులతో జరిపిన సమావేశంలో, పహల్గాం టెర్రర్ దాడికి ప్రతిస్పందన తీరు, దాడికి ఎంచుకోవలసిన లక్ష్యాలు, సమయం నిర్ణయించే పూర్తి కార్యనిర్వాహక స్వేచ్ఛను రక్షణ దళాలకు అప్పగించారు. అవసరమైతే ఏ క్షణంలోనైనా పాకిస్థాన్‌ను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలను ముఖ్యంగా వాయుసేన, నావికా దళాలను సర్వసన్నద్ధం చేసిన రక్షణ దళాల ఉన్నతాధికారులు పాకిస్థాన్ భూభాగంలోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైష్–ఎ–మొహమ్మద్, లస్కర్–ఎ–తోయిబా ఉగ్రవాద శిక్షణా కేంద్రాలు తొమ్మిదింటిపై గురిపెట్టి కచ్చితమైన లక్ష్యాలను విజయవంతంగా ధ్వంసం చేశారు. మన యుద్ధ విమానాలు మన గగనతలం నుండే మిస్సైలీలు ప్రయోగించటం, పాకిస్థాన్ సైనిక, పౌర ప్రాంతాలకు ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణహాని లేకుండా ఈ దాడి నిర్వహించటం మన సైనిక పాటవ నైపుణ్యానికి దర్పణం పట్టింది. ఈ దాడుల్లో వందలసంఖ్యలోనే టెర్రరిస్టులు, వారి మద్దతుదారులు మరణించి ఉంటారు. కనీసం 26మంది మరణించారని 46మంది గాయపడ్డారని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. కాగా 10మంది తమ తమ కుటుంబ సభ్యులు, నలుగురు అనుయాయులు చనిపోయారని జైష్ ఎ మొహమ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సైనిక మెరుపుదాడికి 'ఆపరేషన్ సిందూర్' అని ప్రతీకాత్మకంగా నామకరణం చేశారు. పహల్గాంలో టెర్రరిస్టు ముష్కరులు కబళించిన భారత మహిళల నుదుటి బొట్టుకు ప్రతీకగా ఈ పేరు పెట్టారు. తాజా చర్య ద్వారా భారత్ తనకున్న "ప్రతిస్పందన హక్కును, మరిన్ని సీమాంతర ఉగ్రవాద దాడులను ముందుగా దెబ్బతీసే, నిరోధించే హక్కును" వినియోగించుకుందని విదేశాంగ కార్యదర్శి విక్రం మిశ్రీ బుధవారం ఢిల్లీలో పత్రికాగోష్టిలో చెప్పారు. మిశ్రీతోపాటు ఇరువురు మహిళా ఆర్మీ ఆఫీసర్స్ భారత్‌లో సీమాంతర ఉగ్రవాదులు పాల్పడిన పలు టెర్రరిస్టు దాడులతో – 2001 పార్లమెంటుపై దాడి, 2008 ముంబయిపై దాడి, 2019 పుల్వామా ఆత్మాహుతి బాంబుదాడి వగైరా – చిత్రించిన వీడియోను ప్రదర్శించారు. 2008 నవంబర్ 26న ముంబయిపై టెర్రరిస్టు దాడిలో మృతుల సంఖ్య కన్నా పహల్గాంలో మృతుల సంఖ్య ఎక్కువ.

ప్రతిపక్షాలు గత అఖిలపక్ష సమావేశంలోనే భారత ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా సంపూర్ణ మద్దతు, భారత సైన్యానికి అండదండలు తెలియజేశారు. కేంద్రప్రభుత్వం ఈ రోజు (గురువారం) ఉదయం మరోసారి అఖిలపక్ష సమావేశం పిలిచింది.

పాకిస్థాన్ అనవసర ప్రేలాపనలతో ఆవేశపడకుండా మిగిలివున్న టెర్రరిస్టు స్థావరాల ధ్వంసానికి, తమ భూభాగాన్ని టెర్రరిస్టు కార్యకలాపాలకు వినియోగించటాన్ని అనుమతించబోమని లోగడ ఇచ్చిన హామీ అమలుకు దృఢమైన చర్యలు తీసుకున్నప్పుడే భారత్‌తో ఉద్రిక్తతలు సడలుతాయి. ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యల పరిష్కార సాధ్యం. లేక సైనిక దుస్సాహసానికి ఒడిగడితే మరోసారి గుణపాఠం చెప్పటానికి భారత్ సైన్యం సదా సన్నద్ధంగా ఉంటుంది. లోగడ నిర్వహించిన సర్జికల్ స్ట్రయిక్, తాజా ఆపరేషన్ సిందూర్ నుంచి పాకిస్థాన్ గుణపాఠాలు తీసుకుంటే ఇరుదేశాల మధ్య, భారత ఉపఖండంలో శాంతి, సామరస్యం సాధ్యం.

# ఆదర్శవంతమైన వియత్నాం అద్భుత అభివృద్ధి



కె.రామకృష్ణ
సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

వియత్నాం పేరు వినగానే, ఒక గొప్ప పోరాట చరిత్ర మన కళ్లముందు మెదులుతుంది. ఎన్నో యుద్ధాలు అనుభవించిన, ఎంతో సహనాన్ని, త్యాగాన్ని నిలబెట్టుకున్న దేశం వియత్నాం మాత్రమే. ఇటీవలే హోచిమిన్ సిటీలో జరిగిన వియత్నాం పునరేకీకరణ 50వ వార్షికోత్సవ కార్యక్రమానికి వియత్నాం ప్రభుత్వ ఆహ్వానంపై హాజరై వచ్చాను. అక్కడి అనుభవాలు, చరిత్ర, ప్రజల చైతన్యం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్‌ను మన భారతీయ సంప్రదాయం ప్రకారం సత్కరించే అవకాశం కలిగింది. వియత్నాం ఆగ్నేయ ఆసియాలోని ఒక దేశం. 2016 జనాభా లెక్కల ప్రకారం ఈ దేశ జనాభా సుమారు 9 కోట్ల 46 లక్షలు. జనసంఖ్యలో ప్రపంచంలో 15వ స్థానంలో, ఆసియాలో 9వ స్థానంలో ఉంది. 1976లో ఉత్తర, దక్షిణ వియత్నాంలు కలిసిపోయినప్పటి నుంచి హనోయ్ నగరం రాజధాని గా ఉంది. హోచిమిన్ నగరం అత్యధిక జనాభా గల నగరం. యుద్ధంతో సర్వం కోల్పోయి తాగేందుకు మంచినీరు లేని వియత్నాం...ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. నేటి వియత్నాంను చూస్తుంటే అక్కడ యుద్ధం జరిగిందా? అనే సందేహం కలుగుతోంది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్, చికాగో తదితర నగరాలకు దీటుగా వియత్నాం రాజధాని హోచిమిన్ నగరం అభివృద్ధి చెందింది. అమెరికా సామ్రాజ్యవాదులపై సుదీర్ఘకాలం పోరాడిన అద్భుతమైన విప్లవగాథ వియత్నాంది. అమెరికాతో యుద్ధం ముగిసి... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం ఏకీకరణ జరిగి 1925 ఏప్రిల్ 30వ తేదీకి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఉత్సాహపూరిత వాతావరణంలో వేడుకలు జరిగాయి. చారిత్రక హోచిమిన్ నగరం ఎరుపెక్కింది. నగర వీధులన్నీ జనంతో కోలాహలంగా మారాయి. జాతీయ పతాకాలతో ప్రజలు వేడుక ల్లో పాల్గొని, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వియత్నాం విప్లవ యోధుడు హోచిమిన్ చిత్రప టం, వియత్నాం చిహ్నం 'ల్యాక్ బర్డ్'తో సైన్యం కదం తొక్కారు. హోచిమిన్ నగర వీధుల్లో పరేడ్ ముందుకు సాగగా, వేలాదిమంది ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా శాంతిపై దృష్టితో ముందుకెళుతున్నట్లు నాయకులు సందేశమిచ్చారు. ఒకప్పుడు సైగాన్‌గా పేరున్న హో చిమిన్ నగర వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి.

యుద్ధానికి ముగింపు పలికిన చోటు 'ఇండిపెండెన్స్ ప్యాలెస్' వద్ద యుద్ధ విమానాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలలో వివిధ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. భారతదేశం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి మాత్రమే అధికారికంగా ఆహ్వానం అందింది. సిపిఐ ప్రతినిధిగా నేను హాజరుకావడం నాకు ఎంతో గర్వకారణం. ఈ వేడుకల్లో శాంతి, ఐక్యత, జాతీయ అభివృద్ధి అంశాలు ప్రధానంగా ప్రతిధ్వనించాయి. ప్రతినిధులలో విదేశీ సైనిక బృందాలు, యుద్ధంలో పాల్గొన్న యోధులు ఉన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన 30ఏళ్ల పోరాటం ముగింపునకు, వలసవాదం అంతానికి ప్రతీకగా ఏప్రిల్ 30వ తేదీ చరిత్రలో నిలిచిందన్నారు. భావి తరానికి మెరుగైన ప్రపంచాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు టూ లామ్ వెల్లడించారు. వియత్నాంతో సరితూగగల పోరాటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదని చెప్పవచ్చు. ఆ





దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకం. విద్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో వియ త్నాం ఎంతో విశిష్టత సాధించింది. ప్రపంచంలో సంపద గల, పేద, పెద్ద దేశాలున్నప్పటికీ వియత్నాం అంతటి అసమాన త్యాగంచేసిన దేశం మరొకటి లేదు. అమెరికా వినియోగించిన రసాయనిక ఆయుధాల ఫొటోలతో కూడిన వార్ మ్యూజియం అమెరికా నాటి దుశ్చర్యలను కళ్లకు కట్టినట్టు చూపింది.

**వలసల నుంచి విజయవంతమైన ప్రజా పాలన దిశగా:** వియత్నాం చరిత్ర అనేది వలస పాలనలపై తిరుగుబాటు, స్వాతంత్ర్య ఉద్యమాల విజయం, ప్రజా కేంద్రిత పాలన వికాసాన్ని చూపిస్తుంది. ఫ్రెంచ్ వలస పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత కొరియా, అమెరికాలతో మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన యుద్ధాలను వియత్నాం ఎదుర్కొంది. అమెరికాతో జరిగిన యుద్ధంలో 30 లక్షల మంది చనిపోయారు. 20 లక్షల మంది గాయపడ్డారు. 3 లక్షల మంది కనిపించకుండా పోయారు. అధునాతన యుద్ధ సామాగ్రి వున్న అమెరికాతో తలపడి 59 వేలమంది అమెరికన్ సైనికులను హతమార్చింది. ఇది వారి పోరాట శక్తి కి నిదర్శనం. ప్రపంచ యుద్ధంలో అమెరికా 50 లక్షల టన్నులు, కొరియా యుద్ధంలో 26 లక్షల టన్నుల బాంబులు వినియోగించగా... ఒక్క వియత్నాం యుద్ధంలో ఏకంగా కోటి 43 లక్షల టన్నుల బాంబులను అమెరికా ఉపయోగించాల్సి వచ్చింది. 17 ఏళ్ల 2 నెలలపాటు వియత్నాం వీరోచితంగా పోరాడి అమెరికా సామ్రాజ్యవాదుల మెడలు వచ్చింది. ఈ యుద్ధం కోసం 676 బిలియన్ డాలర్లను అమెరికా ఖర్చుచేసింది.

**టన్నెల్స్:** హోచిమిన్ సిటీలోని కుచ్ జిల్లాలో సుమారు 250 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భూగర్భ టన్నెల్స్ మానవ శక్తి ఎంత దృఢంగా ఉండగలదో చూపిస్తున్నాయి. వీటిని గెరిల్లా యుద్ధ కేంద్రాలుగా, ఆయుధ నిల్వ కేంద్రాలుగా, ఆసుపత్రులుగా, వంట గదులుగా, రాజకీయ సమావేశం గది లాగా యుద్ధకాలంలో ఉపయోగించేవారు. 1940లో మొదట ఫ్రెంచ్ వలస పాలనకు ప్రతిఘటనగా తవ్విన టన్నెల్స్, అమెరికాతో యుద్ధంలో మరింతగా పెంచి ఉపయోగించారు.

**రసాయనాల పీడ :** యుద్ధంలో అమెరికా 'ఏజెంట్ ఆరంజి' లాంటి రసాయనాలు వాడి వియత్నాంను గెలవాలనుకుంది. అయినా వియత్నాం వీరులు వాటిని ఎదుర్కొన్నారు. వీటివల్ల 3 మిలియన్ల మంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. కేన్సర్, జనన లోపాలు, శారీరక వైకల్యాలు యుద్ధం ముగిసిన తర్వాత పుట్టిన తరాలపైన కూడా ప్రభావం చూపించాయి.

**"డోయ్ మోయ్"తో పునర్నిర్మాణం:** 1975 యుద్ధం తర్వాత వియత్నాం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు 1986లో ప్రారంభించిన "డోయ్ మోయ్" ఆర్థిక సంస్కరణల ద్వారా, వియత్నాం కేంద్ర ప్రణాళిక విధానాల నుంచి మార్కెట్ ఆధారిత విధానాలవైపు సాగింది. అయితే, ప్రజల అవసరాలే కేంద్రబిందువుగా కొనసాగాయి. ఫలితంగా పేదరికం 70శాతం నుంచి 1.9శాతానికి తగ్గింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కొత్త పుంతలు తొక్కి విజయవంతం కాగలిగింది. విదేశీ పెట్టుబడులకు అవకాశాలు ఇచ్చినప్పటికీ ప్రజల ప్రయోజనాలే కేంద్రంగా ఉంటున్నాయి. 1990 తర్వాత వియత్నాం జిడిపి 6శాతానికి పైగా పెరుగుతూనే ఉంది. 2024లో వియత్నాం జిడిపి 476.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది, ఇది 2023లోని 5.05శాతం వృద్ధితో పోలిస్తే 7.09శాతం వద్ధిని సూచిస్తోంది. ఎగుమతులు 14.3శాతం పెరిగి 405.53 బిలియన్ డాలర్లకు చేరాయి, దేశ ఆర్థిక వృద్ధికి ఇది ముఖ్య కారణం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 9.4శాతం పెరిగి 25.35 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసింది. ఇదంతా కమ్యూనిస్టు పాలనలో వియత్నాం సాధించిన అభివృద్ధి.

వియత్నాంలో సైన్యానికి, యువతకు, మహిళలకు ప్రాధ్యాన్యత ఇస్తున్నట్లు కనబడింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సౌత్, నార్త్ వియత్నాంల ఏకీకరణ 50వ వార్షికోత్సవంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్, ఆర్మీ మేజర్ జనరల్ చాన్ నాక్ థు తో పాటు యువత తరఫున ఒక యువతి మాట్లాడడం చూస్తే ఆ దేశంలో యువతకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అర్థమవుతోంది. వియత్నాంలో కమ్యూనిస్టుపార్టీ తప్ప వేరే పార్టీ లేదు. వియత్నాం ప్రభుత్వ విధానాలు కమ్యూనిస్టులే కాకుండా కమ్యూనిస్టేతరులనూ అకట్టుకుంటున్నాయి. వియత్నాం విజయం సైనికమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సిన అంశాలు. పారదర్శకతతో కూడిన కమ్యూనిజం ఎలా ప్రజల మద్దతుతో విజయవంతమవుతుందో అన్న దానికి వియత్నాం ఉదాహరణ. అంతిమంగా చెప్పాల్సిందేమంటే విజయం అనేది సాధన కాదు, అది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే. ఈ ఉత్సవాలకు స్పెయిన్ నుంచి వచ్చిన మహిళా ప్రతినిధి నా పక్కనే కూర్చుని వున్నప్పుడు "ఇక్కడ ప్రతిపక్షం లేకుండా ప్రజల అసంతృప్తి వంటివి ఉండవా?" అన్న చర్చ వచ్చింది. దానికి ఆమె సమాధానమిస్తూ, "ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేసి వారికి అవసరమైనవి సమకూర్చగలిగితే వారిలో అసంతృప్తికి చోటుండదు. బహుళ పార్టీ వ్యవస్థతో వాళ్లకు పనీ లేదు" అని పేర్కొన్నారు. ఇది వియత్నాం విజయ రహస్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం.

# సంకల్పబలమే జయం...



కొండేటి ప్రకాష్
7981781086

సమాజంలో నీవు జీవించాలంటే దేహి అని పైసలు అడుక్కుని బ్రతకాలని స్వంతవాళ్లే చెప్పినప్పటికీ నేను నా మనస్సాక్షిని చంపుకొని సాటి మానవుల దగ్గర దీనంగా యాచించి బ్రతకలేనంటూ పట్టుదలతో కష్టపడి పనిచేసి ఎవరి మీద ఆధార పడకుండా జీవిస్తున్న వ్యక్తి జీవితం ప్రస్తుత పరిస్థితుల్లో మనందరికీ మంచి ప్రేరణనిస్తుంది.

తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లా భీమదేవర పల్లి మండలంలోని మాణిక్య పూర్ అనే మారుమూల గ్రామానికి చెందిన చింతం రాజయ్య నిరుపేద కుటుంబంలో జన్మించాడు. అతనికి నాలుగు సంవత్సరాల ప్రాయంలో రెండు కళ్ల నిండా కురుపులు రావడం ద్వారా వాటిని నయం చేయించడం కోసం వారి తండ్రి దగ్గరలో ఉన్న నాటు వైద్యుణ్ణి వద్దకు తీసుకెళ్లారు. ఆ కురుపులకు చికిత్సలో భాగంగా వైద్యుడు కాకర చెట్టు ఆకు పసరు రెండు కళ్లలో పోయడం జరిగింది. ఫలితంగా చింతం రాజయ్య కళ్లలో కురుపులు నయం కాలేదు కానీ రెండుకళ్లు కాయలు కాసి కంటిచూపు పూర్తిగా పోయింది.

రాజయ్యపడే బాధ తట్టుకోలేక అతని పెద్ద అన్న మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని శివారెడ్డి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ వైద్యులకు చూపించాడు. డాక్టర్ శివారెడ్డి అధునాతన యంత్రాలపైన కళ్లకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఆ కంటి పరీక్షలలో వచ్చిన రిపోర్ట్‌ల ఆధారంగా రాజయ్యకు ఇక మీదట కంటి చూపు రాదని అతని కంటికి సంబంధించిన సున్నితమైన అన్ని నరాలు తెగిపోయాయని చెప్పడం జరిగింది. ఒకవేళ కన్ను తీసి వేరు కన్ను పెట్టిన కూడా కంటి నరాలు పనిచేయవని కంటి వైద్యుడు చెప్పారు.

ఇక రాజయ్యకు శాశ్వతంగా చూపు రాదని అతడు అంధుడిగా జీవించాల్సిందేనని కంటి వైద్యుడు శివారెడ్డి చెప్పిన మాట లు విన్న రాజయ్య పెద్దన్న ఒక్కసారిగా విభ్రాంతి చెందినా డు. తమ్ముడు రాజయ్య భవిష్యత్ యాది చేసుకుని దుఃఖప్రాప్తుడై రాజయ్యను తీసుకొని హైదరాబాద్ నుండి బయలుదేరి ఇంటికి చేరుకున్నారు. ఇక తమ్మునికి చూపు రాదన్న చేదు వార్తను వాళ్ళ తండ్రికి రాజయ్య పెద్ద అన్న చెప్పిండు. అప్పుడప్పుడే రాజయ్య వయస్సు ఆరేళ్లు నిండి ఏడోయేడు ప్రారంభమైనది. దిన దినము గడుస్తున్న కొలది ఎదుగుతున్న కొడుకును పోషించే స్థోమతలేని తండ్రి రాజయ్యతో కొడుకా ఏదైనా రైల్వే స్టేషన్ లేదా బస్టాండ్ చూసుకోమని, అక్కడికెళ్లి ప్రతిరోజు అడుక్కుని బ్రతకాలని రాజయ్యకు చెప్పిండు.





తండ్రి నోట అడుక్కుని బ్రతకాలని చెప్పిన మాట విన్నప్పు డే రాజయ్య భవిష్యత్ శ్మశానంలో కాలుతున్న దేహం అయిం ది. తన కడుపున పుట్టిన నన్ను చాలా గారాబంగా పెంచిన తండ్రి ఇలా చెప్పడం జీర్ణించుకోలేకపోయిన రాజయ్య ఎలాగైనా నేను మానవీయ విలువలు కలిగి జీవించాలని గట్టి ప్రయత్నం చేశాడు. తమ ఇంటి దగ్గర ఉన్న మోటార్ మెకానిక్ దగ్గరకు వెళ్ళిన రాజయ్య తనకు ఏదైనా పని ఉంటే చెప్పమని వేడుకున్నాడు. రాజయ్యకు కళ్ళు లేవని తెలుసుకున్న ఆ మోటార్ మెకానిక్ కళ్ళు లేని వారు ఏ పని చేయాలన్న కుదరదని చెప్పాడు. ఆ మోటార్ మెకానిక్ చెప్పిన మాటకు కృంగిపోకుండా రాజయ్య నాకు మీరు ఏదైనా పని చెప్పండి నేను చేస్తానని చెప్పడంతో ఆ మోటా ర్ మెకానిక్ రాజయ్యకు మోటార్ మెకానిక్ పని నేర్పించాడు.

సుమారు పదిహేనేళ్లు వచ్చేవరకు రాజయ్య ఆ ఊరిలో ఒక మోతాదు మోటార్ మెకానిక్‌గా గుర్తింపు పొందినాడు. ఇదే తరహాలో సాగుతున్న జీవితంలో సంజీవరెడ్డి అనే వ్యక్తి మిత్రుడుగా పరిచయం అయ్యాడు. ఆ సంజీవరెడ్డికి కూడా మోటార్ మెకానిక్‌గా మంచి గుర్తింపు ఉన్నది. రాజయ్యకు సంజీవరెడ్డి ఇంకా కాస్త ఎక్కువ మోటార్ మెకానిక్ పనులు అప్పగిస్తాడు.

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా రాజయ్య మాణిక్యపూర్‌లో వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల మోటార్ మెకానిక్ పనులు చేస్తున్నాడు. రాజయ్య మోటార్ మెకానిక్ పనులు చేసుకుంటూ రోజుకు మూడు వందల నుండి ఐదు వందల రూపాయల వరకు సంపాదిస్తూ ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు కళ్ళు కోల్పోయిన రాజయ్యకు పని నిమిత్తం బావుల దగ్గరికి వెళ్ళే క్రమంలో తోవ తప్పిపోతే గ్రామ ప్రజలు సహాయం చేస్తారు. ఇంత గొప్ప సంకల్పం కలిగిన రాజయ్యకు మాణిక్య పూర్ ఊరు ప్రజలందరూ తోడుగా నిలబడ్డారు. మానవ జాతికే ఆదర్శవంతుడుగా నిలిచిన చింతం రాజయ్య జీవితం మనందరికీ ఉత్తేజప్రాయం.

# దిశ కోల్పోయిన దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ



డా. ముచ్చుకోట సురేష్ బాబు

సుస్థిర అభివృద్ధి, మహిళా సాధికారత, సాధికారత వారసత్వం కోసం నలభై వసంతాల కిందట బాసట వేసిన దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఇప్పుడు అపనమ్మకంతో మునిగిపోయింది. నాలుగు దశాబ్దాలకు పైగా, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ తెలంగాణలోని జహీరాబాద్ లో అట్టడుగు స్థాయి సమాజ పరివర్తనకు మార్గదర్శిగా నిలిచింది. దళిత మహిళలను శక్తివంతం చేయడానికి మిల్లెట్ వ్యవసాయాన్ని పునరుద్ధరించడం, బంజరు భూములను తిరిగి పొందడం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం ఒక ఉద్యమంగా ప్రారంభమైంది. ఇప్పుడు నమ్మక ద్రోహానికి, అపనమ్మకాన్ని కేర్ ఆఫ్ అడ్రస్ గా మారింది. డిడిఎస్‌ను నిర్మించిన మహిళలే ఇప్పుడు తమ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు. మా పొదుపు సొమ్ము ఎక్కడ ఉంది? మన భూములను ఎవరు అమ్మారు? ఆర్థిక స్వాలంబన, సాధికారత, మన కాళ్లపై మనం నిలబడదాం వంటి గొప్ప మాటలు చెప్పినవారు చివరికి మమ్మల్ని చీకటి ప్రపంచంలో వదిలేశారు అంటున్నారు.

దివంగత పి.వి. సతీష్ నాయకత్వంలో, డిడిఎస్ స్థిరమైన వ్యవసాయం, విత్తన సార్వభౌమాధికారం, మహిళల నేతృత్వంలోని సంఘాల (స్వయం సహాయక బృందాలు) వినూత్న నమూనాకు అంతర్జాతీయ గుర్తిం పు పొందింది. జర్మనీకి చెందిన బ్రోట్ ఫర్ డై వెల్ట్, కెనడాకు చెందిన ఇంటర్ పరేస్ వంటి ప్రపంచ దాతలు నిధులు సమకూర్చిన డెవలప్మెంట్ సొసైటీ దళిత సాధికారత, మహిళా స్వాలంబన, ఆహార భద్రత, ఆహార న్యాయం అనే వాటికి పర్యాయ పదంగా మారింది. అయినప్పటికీ, నేడు, ఆ వారసత్వం పరిశీలనలో ఉంది. పొదుపులు లేక పోవడం, అనధికారిక భూమి అమ్మకాలు, ఆర్థిక అస్పష్టత వంటి ఆరోపణలు ఒకప్పుడు ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న మహిళలను నమ్మకద్రోహం చేసి నిట్ట నిలువునా ముంచేశారు. 'మేము డిడిఎస్‌ని నమ్మి వారానికి ₹1 ఆదా చేసాము. ఇప్పుడు, నా పేరు వారి రికార్డులలో కూడా లేదని హోతి గ్రామంకు చెందిన రంగమ్మ (60) వాపోతున్నారు.

గతంలో మేము గౌరవం కోసం పోరాడాము, కానీ ఇప్పుడు మా బకాయిల కోసం పోరాడుతున్నాము అని దన్నవరం గ్రామస్తురాలు నాగమ్మ ఎంతో నిరాశతో చెబుతోంది. దళితుల కోసం ఉద్దేశించిన భూమి బయట వ్యక్తులకు అమ్మబడింది, అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు బ్రోకర్ల పాలయిందని మాజీ డిడిఎస్ ఉద్యోగి జగన్నాథ్ రెడ్డి తెలిపారు. దక్కన్ డెవలప్మెంట్ సొసైటీలో ప్రశ్నలు ఎప్పుడూ అనుమతించబడలేదని పనిచేసిన సొసైటీ సభ్యులు తెలిపారు. సొసైటీ అధినేత సతీష్ దివంగతులైన తరువాత కీలక ఆరోపణలు వెల్లువెత్తాయి. పొదుపులు లేకపోవడం, రుణాలు, జీవనోపాధి కోసం ఉద్దేశించిన దశాబ్దాల నాటి డిపాజిట్లు తిరిగి ఇవ్వబడలేదని మహిళలు క్లెయిమ్ చేస్తున్నారు. కుప్పానగర్, మన్నూర్ ఇతర గ్రామాల్లో ఎకరాల సంఘం భూమిని సభ్యుల అనుమతి లేకుండా విక్రయించారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ధరలకు అమ్మేశారు. ఒకప్పుడు 28 అంతర్జాతీయ ఏజెన్సీల మద్దతుతో విరాజిల్లింది, ఇప్పుడు కేవలం నలుగురు దాతలపై మాత్రమే ఆధారపడుతుంది. బ్రోట్ ఫర్ డై వెల్ట్ వంటి ప్రధాన మద్దతుదారులు 2022 నాటికి నిధులను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరి 2025లో వేలాది మంది మహిళలు, డిడిఎస్ పూర్వ సంఘ సభ్యులు, సానుభూతిపరుల పస్తాపూర్ గుండా ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శనగా నినదిస్తూ డిడిఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పేద అట్టడుగు వర్గాలకు ద్రోహం చేసిన డిడిఎస్ వల్ల ఉపయోగం ఏమిటిని పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. పొదుపులు ధృవీకరించి తిరిగి ఇస్తున్నట్లు డిడిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వేలుగురి పేర్కొన్నప్పటికీ, పొదుపు సంఘాలు మహిళా సంఘాలలో నమ్మకం లేదు. 30 గ్రామాల్లో నోటీసులు జారీ చేయబడ్డాయి, కానీ డబ్బు ఎక్కడ?' అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ విజయాలు కాదనలేనివి. జహీరాబాద్ గ్రామాల్లో కుల అడ్డంకులను బద్దలు కొట్టింది. మిల్లెట్ వ్యవసాయం ఆహార సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించింది. అలాగే ఇళ్ళు, విత్తన బ్యాంకు లు ప్రత్యామ్నాయ పౌర సరఫరా వ్యవస్థను నిర్మించిం ది. అయినప్పటికీ, దాని క్షీణత ఒక బాధాకరమైన సత్యాన్ని నొక్కి చెబుతుంది, పారదర్శకత క్షీణించినప్పుడు అత్యంత ప్రసిద్ధి చెందిన అట్టడుగు ఉద్యమాలు కూడా కూలిపోతాయి.

సతీష్ వెళ్ళిపోయి విశ్వాసం విచ్ఛిన్నం కావడంతో, డిడిఎస్ అస్తిత్వ ప్రశ్నను ఎదుర్కొంటుంది. అది తన నైతిక అధికారాన్ని తిరిగి పొందగలదా, లేదా అనేది ప్రశ్నార్థకం. ప్రస్తుతానికి, జహీరాబాద్ మహిళలు మాత్రం సానుభూతి కోసం ఎదురుచూడడం లేదు, జవాబుదారీతనం కోసం వేచి ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంస్థలు తక్షణమే జోక్యం చేసుకుని మహిళలకు న్యాయం చేయాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని సంస్థ వ్యవస్థాపక సభ్యులు కొమండూరి సంతాన గోపాల్, పౌర ప్రజా సంఘాలు కోరుతున్నాయి.


# గాడిదలకూ ఒక రోజుందోచ్!

అడ్డగాడిదలా పెరిగావ్, గాడిద చాకిరీ చేయిస్తున్నారు అంటూ పలు సందర్భాల్లో గాడిదతో పోలుస్తూ తిడుతుంటారు. ఏం?గాడిదలంటే అంత అలుసా? గాడిదలకు ప్రాణం లేదా? వాటికి మనస్సు లేదనుకుంటున్నారా? అందుకే గాడిదల దుస్థితిని తెలియపరచటానికి, గాడిదకు సరైన ఆరోగ్యం, చికిత్సపై అవగాహన కల్పించడానికి మే8న ప్రపంచ గాడిదల దినోత్సవంగా పాటిస్తున్నారు.

గాడిద అనేది గుర్రం లాంటి ఒక జంతువు. ఇవి కూడా గుర్రం కుటుంబానికి చెందినవిగానే చెప్తారు. అయితే గాడిదకు ఎక్కువ గౌరవం గానీ, ప్రాముఖ్యతను గానీ ఇవ్వరు. వాస్తవానికి గాడిద ఎంతో కష్టజీవి. మనుషులు ఎన్నో రకాలుగా ఈ జంతువును వాడుకుంటారు. కానీ, కొన్ని సందర్భాల్లో మనుషుల్ని గాడిదతో పోలుస్తూ తిడతారు. తెలుగులో 'అడ్డ గాడిదలా తిరుగుతున్నావ్', 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడగొట్టిందట', 'గాడిద గుడ్డేం కాదు' అనేవి చాలా పాపులర్ తిట్లు. అలాగే 'వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకొన్నాడట' అని కూడా తెలుగు సంభాషణల్లో విరివిగా ఉపయోగిస్తారు. గాడిదలు గుర్రం కంటే చాలా శక్తివంతమైనవి. అందుకే వీటిని బరువులు మోయడానికి ఉపయోగిస్తారు. గతంలో చాకలివారు తాము ఉతికిన బట్టలను గాడిదలతో మోయించేవారు. కొన్నిచోట్ల వ్యవసాయ పనులకు, కూలి పనులకు కూడా గాడిదలను ఉపయోగిస్తారు. మేకలు, గొర్రెల మందలో వాటికి రక్షణగా గాడిదను ఉంచుతారు. ఇలా మనుషులకు ఎంతో సహాయకారిగా ఉండే ఈ జీవిని వాడుకొని వదిలేస్తారు గానీ వీటి ఆరోగ్యాన్ని పట్టించుకునేవారు లేరు.

గాడిదలు మొదటిసారిగా సుమారు 3000 BC నుండి మానవులు పెంచుకుంటున్నారు. ఇంచుమించు ఇదే కాలం నుండి గుర్రాల పెంపకం మొదలైనది. తరువాత ఇవి ప్రపంచమంతా వ్యాపించాయి. పెంచుకొనే గాడిదలు విస్తరించగా, అడవి గాడిదలు నెమ్మదిగా అంతరించిపోతున్నాయి. ఇవి తమ ఆత్మరక్షణ కోసం ఎక్కువగా వెనుక కాళ్ళను వాడతాయి. గాడిదలు చాలా బలమైనవి, తెలివైనవి. గాడిదలకు అపురూపమైన జ్ఞాపకశక్తి ఉంది. ఇవి తిరిగిన ప్రాంతాలను, ఇతర గాడిదలను సుమారు 25 సంవత్సరాల వరకు గుర్తుపెట్టుకోగలవు.

గాడిదలు కొన్నిసార్లు మొండిగా ప్రవర్తిస్తాయి. అయితే ఇందుకు ఒక కారణం కూడా ఉంది. ఎప్పుడైతే అది ప్రమాదం అని పసిగడుతుందో దాని స్వీయరక్షణ కోసం ఎటూ కదలకుండా అలాగే నిల్చుండిపోతుంది. అప్పుడు ఎవరు ఎంత లాగినా, బెదరగొట్టినా గాడిద అది ఉన్నస్థానం నుంచి అస్సలు కదలదు గాక కదలదు. మగ గాడిద, ఆడ గుర్రం మధ్య సంకరం ద్వారా పుట్టిన జంతువు కంచర గాడిదలు. అవి బలానికి,



ఓర్పుకు, తెలివితేటలకు బాగా ప్రసిద్ధి చెందాయి. ఇది చాలా మొండి జంతువు. ఎంతటి కష్టాన్నైనా మొండిగా సహిస్తుంది. అధిక బరువులను ఓపిగ్గా మోస్తూ ఎక్కువ దూరాలు ప్రయాణించగలదు. మగ గుర్రం, ఆడ గాడిద యొక్క హైబ్రిడ్‌ను హిన్నీ అంటారు. గాడిదలు మరియు గుర్రాల ద్వారా ఉత్పత్తి చేయబడిన సంతానం (హైబ్రిడ్ సంతానం) రెండూ సంతానం లేనివి, శుభ్రమైనవి, వాటి స్వంత సంతానం కలిగి ఉండవు. గాడిదలో ఉన్న మరో ప్రత్యేకమైన అంశం దాని అరుపు. ఎలాంటి అవరోధాలులేని ఒక ఎడారి లాంటి ప్రాంతంలో ఏదైనా ఒక గాడిద అరిస్తే సుమారు 96 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గాడిద ఆ పిలుపును వింటుంది. అంత గొప్ప గొంతు దానిది. గాడిద గుర్రం లాగా అనవసరంగా బెదరదు, ఆశ్చర్యపోదు. గాడిద తదేకంగా గమనిస్తుంది. దాని ఆలోచన మేరకే నడుచుకుంటుంది. ఎవరైనా గాడిదకు ట్రైనింగ్ ఇవ్వాలంటే అతడి ద్వారా తనకు రక్షణ ఉంటుంది అని అది నమ్మినపుడే అతడి మాట వింటుంది. గంగిగోవు పాలు గరిటెడు చాలు, కడవనైనేమి ఖరము పాలు అని పద్యం ఉంది. కానీ ప్రపంచంలోనే గాడిద పాలు ఎంతో ఖరీదైనవి. ఇండియాలోనే గాడిదపాలు లీటరుకు రూ. 10వేలకు చొప్పున అమ్ముడయిన సందర్భాలు ఉన్నాయి. అంటే కడవ పాలుంటే లక్షధికారి కావొచ్చు. కొన్నిచోట్ల గాడిద పాలను ఆయుర్వేద ఔషధాలలో వినియోగిస్తా రు. గాడిద సంఘజీవి. దీని శాస్త్రీయనామం ఈక్విస్ అసినస్. గాడిదలు 27 నుండి 40 సంవత్సరాలకు పైగా జీవించగలవు. గర్భధారణకాలం 11–14 నెలలు. ఇది గాడిద ఘనకీర్తి. కాబట్టి ఏ జీవిని చిన్నచూపు చూడొద్దు. ప్రకృతిలో ప్రతి జీవికి సమాన హక్కులు, స్వేచ్ఛగా జీవించే హక్కులు ఉంటాయి అని చెప్పటం ఈ రోజుకు ఉన్న ముఖ్య ఉద్దేశ్యం.

*(మే 8 ప్రపంచ గాడిదల దినోత్సవం)*

సుధాకర్.ఏ.వి, 9000674747



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 200 విమానాల రద్దు

### 18 విమానాశ్రయాలు తాత్కాలిక మూసివేత

**న్యూఢిల్లీ / ముంబై :** 'ఆపరేషన్ సిందు' జరిగిన నేపథ్యంలో బుధవారం ఉదయం దేశంలో శ్రీనగర్ సహా 18 విమానాశ్రమాలను తాత్కాలికంగా మూసివేయగా, 200 విమాన సర్వీసులను రద్దు చేశారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, అకాశ ఎయిర్, పలు విదేశీ విమాన సంస్థలు తమ విమానాలను రద్దు చేశాయి. దేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. వాటిలో శ్రీనగర్, లేహ్, సిమ్లా, ధర్మశాల, జమ్మూ, అమృత్‌సర్, పఠాన్‌కోట్, చండీగఢ్, జోధ్‌పూర్, జైసల్మేర్, జామనగర్‌లు విమానాశ్రయాలు ఉన్నాయి.






## సినిమా ఇంకా ఉంది

### ఆర్మీ మాజీ చీఫ్‌ల వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడటంపై భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే స్పందించారు. ఉగ్ర స్థావరాలపై దాడిని ఉద్దేశిస్తూ 'సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మాజీ చీఫ్‌ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ శంకర్ రాయ్ చౌదరి స్పందిస్తూ ఉగ్రస్థావరాలపై భారత బలగాలు చేసిన దాడిని అద్భుతమైన ప్రణాళికతో కూడిన గొప్ప ఆపరేషన్‌గా ప్రశంసించారు. ఈ దాడులను భారత్ ఆపకూడదని, కొనసాగించాలని సూచించా రు. ఇది యుద్ధం లాంటి పరిస్థితి కాదని, ఇప్పటికే రెండు దేశాల మధ్య అప్రకటిత యుద్ధం కొనసాగుతోందని అన్నారు. దా డుల సమయంలో మాజీ ఆర్మీ చీఫ్‌ల నుంచి ఇలాంటి స్పందన రావడం గమనార్హం.

## విభిన్నం... 'ఆపరేషన్ సిందూర్'




**న్యూఢిల్లీ:** భారత్ గతంలో జరిపిన మెరుపు దాడుల కంటే తాజాగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' పూర్తిగా భిన్నమైనది. 2016లో ఉరి ఉదంతం తరువాత నిర్వహించిన మెరుపుదాడులు, 2019లో బాలాకోట్ దాడులు సహా గతంలో ఎన్నడూ ఇటువంటి దాడులు చేపట్టలేదు. సాంకేతికపరంగా ఈ ఆపరేషన్ అత్యంత బలమైంది.. ఖర్చుతో కూడుకున్నది. అంతేకాకుండా ఉగ్రవాదం విషయంలో గతంలో అనుసరించిన వైఖరి పూర్తిగా మారిపోయిందనే బలమైన సంకేతం పాక్‌కు వెళ్లింది. 'భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లు, వాటి హ్యాండిలర్లకు తీవ్ర హెచ్చరికలు వెళ్లినట్లు అయింది. దీంతోపాటు అవసరమైతే భారత్ ముందస్తుగా దాడి చేయగలదని, పాక్‌లోని ఏ లక్ష్యం తమకు దూరం కాదని స్పష్టంచేసింది. ఉగ్రదాడులకు ప్రతిస్పందించడమంటే కేవలం శక్తిని చూపడం మాత్రమే కాదని, టెర్రరిస్టుల కార్యకలాపాలు, ఇతర వనరుల పునాదులు పెకలించేస్తామని ఈ దాడులతో పేర్కొంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించే 24 ఆయుధాలను భారత్ వినియోగించింది. వీటిల్లో క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లు ఉన్నాయి.

## సరిహద్దు సిఎంలతో అమిత్ షా అత్యవసర వీడియో కాన్ఫరెన్స్

**న్యూఢిల్లీ :** ఉగ్రశిబిరాల ధ్వంసం నేపథ్యంలో పాకిస్తాన్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు, డిజిపిలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు, సిఎస్, డిజిపిలు, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ హాజరయ్యారు. సెలవుల్లో ఉన్న సిబ్బందిని వెంటనే వెనక్కి పిలిపించాలని కేంద్ర సాయుధ పోలీస్ బలగాలకు అమిత్‌షా ఇప్పటికే సూచించారు. దేశ ఆంతరంగిక భద్రత పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించి, ఉన్నత భద్రత అధికారులు అత్యంత అప్రమత్తతతో ఉండాలని, గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. పహల్గామ్‌లోని అమాయక ప్రజల దారుణ హత్యలకు స్పందనగానే భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని హోం మంత్రి తెలిపారు. భారతదేశం, దేశ ప్రజలపై జరిగే ఎలాంటి దాడిపైన అయినా గట్టి జవాబు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం కంకణబద్ధురాలై ఉందని, ఉగ్రవాదాన్ని వేళ్ళ నుంచి పెకలించి వేసేందుకు నిబద్ధతో ఉన్నామని అమిత్ షా అన్నారు.

## లష్కరే నుంచి జైషే మహ్మద్ వరకు...

# 'ఉగ్ర' శిబిరాల వివరాలు ఇవే



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడితో భారత్‌కు ఓపిక, సహనం నశించాయి. ముష్కరులు అమాయకుల ప్రాణాలు తీయడమే కాకుండా... మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను నేలమట్టం చేసింది. జైషే మహ్మద్, లష్కరే తోయిబా, ఉగ్రవాదుల భారీ సొరంగాలను ధ్వంసం చేసింది. సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో గల బహవల్పూర్‌లోని మర్కజ్ సుబాన్ జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్ క్వార్టర్‌గా ఉంది. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, ప్లానింగ్ వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా వినియోగిస్తాడు. జైషే నెంబర్2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు.

### లష్కరే కార్యాలయం ఉగ్ర యూనివర్సిటీ

మురిద్కేలోని మర్కాజ్ తోయిబా లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000లో అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు విరాళం ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే ఇంటెలిజెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీకి ఇక్కడ ఇళ్లు ఉన్నాయి.

తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టర్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిదీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖాలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా గ్లైడింగ్‌లో శిక్షణ ఇచ్చారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు. కాగా, హిజ్బుల్ కీలక కేంద్రం సియల్‌కోట్‌లోని మెహ్మూనా జోయా క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం ఇక్కడ 2025 మంది ఉంటారు. బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం 40 మంది ఇక్కడ ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్‌రాజౌరిరియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలు పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం.

కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం జైషే ఆయుధాగారం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి నాయకుడు. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిదీన్‌లో పనిచేశాడు. 2016న గ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణమని సమాచారం. ఉగ్రవాదులకు పర్వత యుద్ధతంత్రంలో శిక్షణ ఇస్తారు. ఇది కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దఢత్వంపై శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు. లష్కరే శిక్షణ కేంద్రం ముజఫరాబాద్‌లోని షవాయ్ నాలా. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హుజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి. పెద్దఎత్తున లష్కరే కేడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు.




### పాక్ ఎస్ఎస్‌జి కమాండోలతో శిక్షణ

ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన... ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీ కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యం 50100 మంది ఉగ్రవాదులు ఉంటారని తెలుస్తోంది.



## అందరినీ ఆకర్షించిన సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్



న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పిఒకెలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారత్ విజయవంతంగా దాడులు నిర్వహించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ బ్రీఫింగ్ ఇచ్చింది. భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు దాడుల వివరాలు వెల్లడించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇంత క్లిష్టమైన ఆపరేషన్ గురించి దేశ ప్రజలకు వెల్లడించిన వారిద్దరే.. కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.

### ఎవరీ కర్నల్ సోఫియా ఖురేషి..?

గుజరాత్‌కు చెందిన సోఫియా... బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు పీస్‌కీపర్‌గా అపార అనుభవం ఉంది. ఐరాసకు చెందిన పీస్‌మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వర్తించారు. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. అది మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి. అన్ని దేశాలు ఉన్నప్పటికీ.. ఒక్క భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించడం గమనార్హం. అప్పుడు బలగాలు శాంతి పరిరక్షక కార్యకలాపాలు, మందుపాతర తొలగింపుపై దృష్టిసారించాయి. 1990ల్లో సోఫియా సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన అనుభవజ్ఞురాలైన ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రశంసించారు.

### వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చిన్నప్పుడే పైలట్ కావాలని కలలు కన్నారు. చదువుకునే రోజుల్లో ఎన్‌సిసిలో చేరారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసిన ఆమె.. తన కలకు తగ్గట్టుగా భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 2019,డిసెంబర్ 18న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబం నుంచి భారత భద్రతా బలగాల్లో చేరిన తొలి వ్యక్తి ఆమే కావడం విశేషం. జమ్ముకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాలుతో కూడిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. పలు రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు. బుధవారం జరిగిన మిలిటరీ బ్రీఫింగ్‌లో కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. దాడి ఎంతా పక్కాగా చేసిందో.. ఈ బ్రీఫింగ్ విషయంలోనూ అంతే పక్కాగా వ్యవహరించింది. ఇందులో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి.. కశ్మీరీ పండిట్. ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా చూడటమే కాకుండా కలిసికట్టుగా చేసిన కృషిగా కేంద్రం చూపాలనుకున్నట్లు వెల్లడవుతోంది. మహిళలు నాయకత్వం వహిస్తారు.. ప్రతీకారం తీర్చుకుంటారని వెల్లడి చేయాలనుకుందని తెలుస్తోంది. పలువురు పర్యాటకులను వారి భార్యల ముందు చంపినదానికి కౌంటర్‌గా ఈ ఇద్దరు మహిళలను ముందు వరుసలో నిలబెట్టారని పలువురు అభివర్ణిస్తున్నారు.




## ఇంతటితో ఆపొద్దు..


### ఆపరేషన్ సిందూర్‌పై ఉగ్రదాడిలో మరణించిన నేవీ ఆఫీసర్ భార్య హిమాన్షి నర్వాల్



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా బుధవారం తెల్లవారుజామున భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై పహల్గామ్‌ఉగ్రదాడి మృతుడు, నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్ స్పందించారు. ఉగ్రవాదుల ఏరివేత చర్యను ఇంతటితో ఆపొద్దని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులను తుదముట్టించడంలో ఆరంభం మాత్రమే కావాలని వ్యాఖ్యానించారు. నా భర్త రక్షణ బలగాల్లో పనిచేసేవాడు, శాంతిని కాపాడాలని, అమాయకుల జీవితాలకు రక్షణ కల్పించాలని భావించేవాడు. దేశంలో విధ్వంసం, ఉగ్రవాదం అంతం కావాలని కోరుకునే వాడు. ఇవాళ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన భారత సైనికులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అయితే నా అభ్యర్థన ఏమంటే ఉగ్రవాదులపై పోరాటాన్ని ఇంతటితో ఆపొద్దు. ఆపరేషన్ సిందూర్ దేశంలో ఉగ్రవాదాన్ని తదముట్టించడానికి ఆరంభం మాత్రమే కావాలి.' అని హిమాన్షి వ్యాఖ్యానించారు. ఉగ్రదాడికి కొద్ది రోజుల ముందే ఏప్రిల్ 16న వినయ్ నర్వాల్, హిమాన్షి నర్వాల్‌ల వివాహం జరిగింది. ఏప్రిల్ 19న రిసెప్షన్ నిర్వహించారు. ఏప్రిల్ 21న హనీమూన్ కోసం పహల్గాంకు వెళ్లారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో వినయ్ నర్వాల్ మృతిచెందాడు. తన భర్తను పేరు అడిగి మరీ కాల్చిచంపారని హిమాన్షి నర్వాల్ చెప్పారు. కాగా పహల్గాం ఉగ్రదాడిలో వినయ్ నర్వాల్‌తో పాటు మరో 25 మంది మరణించారు. వారిలో ఒక నేపాలీ ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో 'భారతదేశం దూకుడుగా ఉంది'

### ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ప్రశంస




న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్'ను ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ప్రశంసించారు. ఉగ్రవాద దాడి తర్వాత ఏ దేశం కూడా మౌన ప్రేక్షకుడిగా ఉండకూడదని, ఆపరేషన్ సిందూర్‌తో 'భారతదేశం దూకుడుగా ఉంది' అనే సందేశం వ్యాపించినట్లయిందన్నారు. ఈ మేరకు పవార్ బుధవారం సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. ఆపరేషన్ గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడానని, పరీక్షా సమయాల్లో ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చానని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకుంటూ, బుధవారం తెల్లవారుజామున భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు చేశాయి. వాటిలో జైషే మొహమ్మద్ బలమైన బహవల్పూర్, మురిద్కేలోని లష్కరే తోయిబా స్థావరం ఉన్నాయి. 'గత నెలలో జమ్ముకశ్మీర్‌లో ఏమి జరిగిందో అని దేశ ప్రజలలో ఆందోళన నెలకొంది. ఉగ్రవాదుల చేతిలో అమాయకులు మరణించారు. అటువంటి పరిస్థితిలో, ఏ దేశం కూడా కేవలం ప్రేక్షకుడిగా ఉండకూడదు' అని మాజీ రక్షణ మంత్రి పవార్ పుణెలో విలేకరులతో అన్నారు. ఈ ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందించేటప్పుడు జాగ్రత్తగా చర్యలు తీసుకోవడం అవసరం. ఈ దాడులన్నీ పాకిస్తాన్ మద్దతు ఉన్న పిఒకెలోని ఉగ్రవాద శిబిరాలపై జరిగాయి అని పవార్ అన్నారు. ఈ శిబిరాల్లో మందుగుండు సామగ్రి, ఆయుధాలను కూడా నిల్వ చేశాయన్నారు. పాకిస్తాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచడానికి సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి ఇటీవలి నిర్ణయాలను సమర్థిస్తూ, పహల్గామ్‌లో జరిగిన దాడి తర్వాత ఏ దేశం మౌనంగా ఉండకూడదని, ప్రధానమంత్రి, సాయుధ దళాలు తీసుకున్న చర్యలు సమర్థనీయం, సముచితమైనవన్నారు. పహల్గామ్ దాడిలో చాలా మంది మహిళలు తమ భర్తలను కోల్పోయినందున 'ఆపరేషన్ సిందూర్' అనేది సముచితమైన పేరు పెట్టారని ప్రశంసించారు. పహల్గామ్ దాడి తర్వాత దేశంలోని కొంత మంది కశ్మీరీ ప్రజలపై అనుమానంతో ఉన్నారని, అయితే కశ్మీరీలు స్వయంగా దేశానికి మద్దతుగా నిలిచి ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారని కూడా ఆయన పేర్కొన్నారు.

## 2040 నాటికి చంద్రుడిపై భారతీయ వ్యోమగ్యామి

### ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృఢవిశ్వాసం

### గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్-2025లో ప్రధాని వీడియో సందేశం

**న్యూఢిల్లీ :** అంతరిక్షంలో భారత్ అద్భుత విజయాలను సాధిస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయ వ్యోమగామి అడుగుపెడతాడన్న దృఢవిశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం నూతన విశ్వాసంతో ముందుకు సాగుతోందన్నారు. దాని వ్యోమగాముల పాదముద్రలు చంద్రుడిపై ఉంటాయని, అంగారక గ్రహం, శుక్రగ్రహం కూడా దేశ రాడార్ అన్వేషణ మిషన్లలో ఉన్నాయని ప్రధాని తెలిపారు. ఆయన బుధవారం ఇక్కడ జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ (జిఎల్ఇఎక్స్2025)కు ముందస్తు వీడియో రికార్డ్ ద్వారా పంపించిన తన సందేశంలో ఈ విషయాలను నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశం గురించి చెబుతూ అన్వేషనణతో పాటు సాధికారత సాధన లక్ష్యంగా పురోగమిస్తున్నదన్నారు. 2035నాటికి భారత అంతరిక్ష స్టేషన్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా 2040నాటికి భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టడానికి ప్రణాళికల జాబితాను రూపొందించామని చెప్పారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం ఇతరులతో పోటీపడేందుకు పరుగెత్తడం కోసం కాదు. అది ఉన్నత స్థానానికి, మరింత ఉన్నత స్థానానికి కలిసికట్టుగా చేరుకోవాలన్నదే లక్ష్యం. మానవత్వంతో కూడిన మంచి రికార్డు కోసం మేము ఉమ్మడి లక్ష్యాన్ని పంచుకుంటాం' అని ప్రధానమంత్రి మోదీ మంగళవారం రికార్డు చేసిన తన సందేశంలో స్పష్టం చేశారు. భారత్ మంగళ్‌యాన్, చంద్రయాన్ లాంటి ప్రయోగాలను విజయవంతంగానిర్వహించిందని తెలియజేశారు. చంద్రుడిపై నీటి జాడ ఉన్నదని చంద్రయాన్ ద్వారా గుర్తించామన్నారు. దక్షిణాసియా కోసం జి20 ఉపగ్రహాన్ని ప్రయోగించామని గుర్తుచేశారు. భారతీయ వ్యోమగామి త్వరలోనే రోదసీలో పర్యటిస్తాడని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం గురించి ఆయన మాట్లాడుతూ 1963లో ఒక చిన్న రాకెట్ ప్రయోగంతో భారత్ అంతరిక్ష ప్రయాణం ప్రారంభమైందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద అడుగుపెట్టిన తొలిదేశంగా భారత్ అవతరించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. 'మన అంతరిక్ష ప్రయాణం అద్భుతంగా ఉంది. మన రాకెట్లు అత్యంత శక్తితో కూడిన భారాన్ని మోస్తాయి. అవి 1.4 బిలియన్ల మంది భారతీయుల కలలను మోస్తాయి.భారతదేశం ఎన్నో మైలురాళ్లను అధిగమించి విజయాలను సొంతం చేసుకుంది. మానవ స్ఫూర్తి గురుత్వాకర్షణను ధిక్కరించగలదని అవి రుజువుచేశాయి' అని మోదీ చెప్పారు.



## నల్లగొండ సిపిఐ పట్టణ కార్యదర్శిగా సైదిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ సిపిఐ పట్టణ నూతనకార్యదర్శిగా కర్రి సైదిరెడ్డి (కె ఎస్ రెడ్డి) సహాయ కార్యదర్శులుగా వి లెనిన్, గాదెపాక రమేష్ లతో పాటు 8 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ పట్టణ 15వ మహాసభలో నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతం కోసం నూతనంగా ఎన్నికైన కమిటీ కష్టపడి పని చేయాలన్నారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రజలను జాగృతి చేసి ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకపోయి వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులుగా బి నర్సింహ్మా, ఎస్ కె మధార్, ముండ్ల ముత్యాలు, సింగపంగా యందయ్య, లక్ష్మయ్య, దోటి అక్కలయ్య, కోమటిరెడ్డి పద్మ్మారెడ్డి, రెవెల్లి యాదయ్య, పుట్టల సుజాత, జె విజయ్,ఎం కౌసల్య, చింత ధనలక్ష్మి ఎన్ ఆర్ సి రాజు, గుండె రవిలను ఎన్నుకున్నారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి

### చిట్యాల మండల సిపిఐ కార్యదర్శి ఎండి అక్బర్

**ప్రజాపక్షం/చిట్యాల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండల సిపిఐ కార్యదర్శి ఎండి అక్బర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ పట్టణ కౌన్సిల్ సమావేశం దేశగాని బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలపైన నియంత్రణ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్ వ్యాపారస్థులు విచ్చలవిడిగా ధరలు పెంచుతూ ప్రజల పైన అధిక రేట్లు మోపడం జరుగుతుందన్నారు. ఆరుగాలం శ్రమించి రైతాంగం మార్కెట్‌లోకి ధాన్యం తరలిస్తే వాటి కొనుగోలులో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని అక్బర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ్మా, బాల్‌రెడ్డి, కె రామలింగయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్ల సింగారం గ్రామంలో పాలేరు వాగుపై 3.48 కోట్ల వ్యయంతో నిర్మించే చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు రైతులకు వ్యవసాయానికి కావాల్సిన నీరు అందుతుందని, దాంతో రైతుల పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. ఏఐసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా తీసుకున్న జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా పాల్గొని మాట్లాడారు. గాంధీ అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్ర్యం తేవడం జరిగిందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, తౌనకునూరి సైదులు, పసుల అశోక్, బంటు బద్రి, గుగులోతు కృష్ణ పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో 31 మంది ఎఎస్ఐలకు కౌన్సిలింగ్ బదిలీ

### ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్‌పి నర్సింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల నందు పనిచేస్తూ మూడు సంవత్సరాలు సర్వీసును పూర్తి చేసుకున్న 31 మంది ఎఎస్ఐ లకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నర్సింహా మాట్లాడుతూ కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చాం, అనుభవాన్ని ఉపయోగించి పోలీస్ సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పనిచేస్తూ సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన అనుభవం ఉన్నదని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి కానిస్టేబుల్ స్థాయి నుండి ఎఎస్ఐ స్థాయి వరకు ప్రమోషన్లు పొందారని, పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌కు, జూనియర్స్‌కు, తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే ఆసాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణరావు, సిబ్బంది ఉన్నారు.

## రైస్ మిల్లుల వద్ద దిగుమతులను వేగంగా చేయాలి : సబ్‌కలెక్టర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైస్ మిల్లుల వద్దకు వచ్చే ధాన్యం లారీల నుంచి ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ సూచించారు. బుధవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్లతో ఐకేపీ సెంటర్ల నుంచి వస్తున్న ధాన్యం దిగుమతులపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఐకేపీ సెంటర్ల నుంచి వస్తున్న ధాన్యం లారీలను మిల్ పాయింట్ల వద్ద దిగుమతులు చేసుకోవడంలో ఆలస్యం కావడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోతున్నాయని వర్షాలు వచ్చినట్లయితే ధాన్యం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను దిగుమతులు చేసుకోవాలన్నారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందు తూ పాఠ్య పాఠ్యేతర అంశాలను నేర్చుకునే అవకాశం సమ్మర్ క్యాంప్‌ల ద్వారా లభిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల్‌లో హైదరాబాద్ లెర్న్ ఓ రామ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వం సమ్మర్ క్యాంప్‌ని బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేమాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులను ఎంతో సంతోషకరంగా ఎన్నో రకాల అంశాలతో వారి నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ క్యాంపు ఉపయోగపడుతుందని తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్ మాట్లాడుతూ గద్వాల్ జిల్లా విద్యార్థులకు మొట్టమొదటిసారిగా రోబోటిక్స్, ఏఐ టెక్నాలజీ వంటి ప్రతిష్టాత్మకమైన ప్రోగ్రామ్స్ ని అందించి వారిని కంప్యూటర్ రంగంలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు బాబు నాయుడు, బీచుపల్లి, ప్రదీప్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపల్స్ రత్నం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# తాలు, తరుగు తీయకుండానే...

### ధాన్యం మిల్లులకు తరలించడంపై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జికి షోకాజ్ నోటీస్

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** తాలు, తరుగు తీయకుండానే ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తుండటం పట్ల ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ కి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె శాలిగౌరారం మండలం, రామగిరి శివారు లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు పంపించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను తనిఖీ చేయగా ఆ బస్తాలలో తాలు, తరుగు ఉండడంపై సెంటర్ నిర్వాహకులపై అగ్ర వ్యక్తం చేశారు. తాలు, తరుగు తీయకుండా పంపిస్తే మిల్లుల వద్ద ధాన్యం తిరస్కరించడం జరుగుతుందని, అలా ఎందుకు పంపిస్తున్నారని సెంటర్ ఇన్చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే గాక షో కాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించినందుకు గాను అవసరమైతే వచ్చే సంవత్సరం కేందర్ం బాధ్యతలను వేరొకరికి అప్పగిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, సరైన తేమ శాతం ఉండి, తాలూ ,తరుగు లేకుండా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అంతేకాక ఈ ధాన్యం కొనుగోలు కేందర్ం చెరువుకు సమీపంలో ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, వచ్చే సంవత్సరం కొనుగోలు కేంద్రాన్ని మార్చాలని చెప్పారు.పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్, తహసిల్దార్ యాదగిరి, తదితరులు ఉన్నారు.

### రైతులు ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని లారీలలో మిల్లులకు తరలించే సమయంలో రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం మండలం పరిధిలోని శాపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖి చేశారు. ఈసందర్భంగా కేంద్రం వద్ద రైతుల నుండి ఎవరైన డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిచిపోకుండా తక్షణమే కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. రికార్డు లు సరిగ్గాలేనందున కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, ఆర్డిఓ అశోక్‌రెడ్డి, తహాశీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు మండల అదికారులు పాల్గోన్నారు.



## కార్మిక హక్కులను కాలరాస్తున్నారు

### కేంద్రంపై ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ ధ్వజం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో కోదండరాంరెడ్డి పెద్దన్న భవనంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ అనేక చట్టాలను మారుస్తూ లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల శ్రమను దోచి పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని కార్మికుల హక్కులను కాపాడుకోవాలని దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొనాలని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దు కోసం అనేక పోరాటాలు నిర్వహించి రైతు చట్టాలను వ్యతిరేకంగా పోరాడిన స్పూర్తితో కార్మిక వ్యతిరేక లేబర్ కోడులకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కమిటీ సభ్యులు మంచాల మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చేరాల లింగయ్య అధ్యక్షతన ఏ ఐ టి యు సి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సిపిఐ మండల కార్యదర్శి గోడల్ల భూషణ్, గీత పనివారాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు యాదయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చేరాల లింగయ్య, సిఐటిసి నాయకులు వడ్డే పల్లి యాదగిరి, రజినీకాంత్, ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కొండమడుగు సత్తయ్య పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపిపై వ్యతిరేకంగా పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో దేగ వీరయ్య, బాణాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల మూడవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసగించారు. కేంద్రంలోని మోడి ప్రభుత్వం కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తున్నాడని అన్నారు. వ్యవసాయ, కార్మిక విధానాలను అనుసరిస్తూ కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం అసన్నమైందన్నారు. నాటి నుండి నేటి వరకు పేదల పక్షాన పోరాడిదే కేవలం ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, నూకల శ్రీను, వాకా పుల్లారెడ్డి, బాణోతు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# సమన్వయంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** అధికారులందరు సమన్వయంతో చేసుకుంటూ జిల్లాలో ఉన్న బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టర్ చాంబర్ నందు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలిమినేషన్, ఏరాడిక్షన్ ఆఫ్ చైల్డ్ అండ్ అడాలసెంట్ లేబర్ జిల్లా టాస్కోఫోర్స్ కమిటికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనులలో పెట్టుకుంటే యాజమానులపై కేసుతో పాటు జరిమాన వేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే 15 రోజులలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి టాస్కోఫోర్స్ కమిటిలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, ప్యాక్టరీలలో, దుకాణాలలో ఉన్న బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించి వారికి హస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ పనులకి తీసుకెళ్లకుండా వ్యవసాయశాఖ సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇటుక బట్టీలు, ప్యాక్టరీ చట్టం ప్రకారం కార్మికశాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కార్మికులు ఎంతమంది ఉన్నారు. వారి ప్రాంతం వయస్సులతో సంబంధించిన వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకపోతే తనిఖీలు చేపట్టాలని, బొగ్గు బట్టీలపై అటవీశాఖ అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు. సంచార జాతులకి సంబంధించిన వారి పిల్లలను ఇటుక బట్టిలకి వారు చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల నుండి రేషన్ ఇప్పించాలని, 518 సంవత్సరాల లోపు వేల్పేర్ హస్టల్‌లో చేర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ అరుణ, జిల్లా ప్రొటక్షన్ ఆఫీసర్ రవికుమార్, డిఆర్‌డివో పిడి అప్పారావు, డిపివో యాదయ్య, డిడబ్ల్యూఓ నర్సింహరావు, చైల్డ్ వెల్పేర్ కమిటి చైర్మన్ రమణరావు, డిఎంహెచ్‌వో కోటచలం, ఇండ్రస్టిస్ జిఎం సీతరాంనాయక్, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, మోప్మా పిడి రేణుక, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అకాల వర్షం...తడిసి ముద్దైన ధాన్యం

**ముషంపల్లి రైతులు కన్నీరు మున్నీరు**





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మండలంలోని ముషంపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఐకెపి కేందర్ంలో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దై వరద నీరుకు ధాన్యమంత కొట్టుకుపోయింది. ఆరుగాలం రైతు శ్రమించి వ్యవసాయం సాగు చేసి వరి ధాన్యం పండిస్తే అకాల వర్షంతో పంట అంతా నష్టపోయి రైతులు జోరున విలపిస్తున్నారు. రైతు పండించిన పంటను ఐకెపి కేంద్రాలకు తరలిస్తే అక్కడ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో నెలల తరబడి ధాన్యం రాశులు అక్కడే ఉండడంతో అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయి వరదలో కొట్టుకుపోతుంటే రైతులు అల్లాడిపోతున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జాప్యం చేయడంతో రోజులు తరబడి ధాన్యం రాశులు నిల్వ ఉండడంతో అకాల వర్షాలకు తడిసి ముద్దాయితున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరారు.

## బునాదిగాని కాల్వ పనులు పూర్తైన వెంటనే సాగునీరు

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్:** బునాదిగాని కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని భోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మక్తరం తారం గ్రామం ఎర్రగుంట వద్ద కాల్వ పనులను ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారులతో కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన వెంటనే కాల్వ మరమ్మత్తులు వెడల్పు కోసం రూ. 500 కోట్ల రూపాయలను వెంటనే మంజూరు చేశారన్నారు. కాల్వ ద్వారా నీరు రాక కొంతమంది రైతులు ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుతో నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలిపించిన అనంతరం బుధవారం రైతులు ఉన్నత అధికారులతో కాల్వ పనులను పరిశీలించారు. నాలుగున్నర కిలో మీటర్లు కాల్వ వెడల్పు లేక పోవడం వల్ల అడ్డగూడూర్ ధర్మారం వరకు సాగునీరు అందకపోవడం చూడలేక రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తో నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాల్వ పనులు పూర్తయిన వెంటనే సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, ఆర్డీవో కృష్ణరెడ్డి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ లాండ్ ఎక్వసేషన్ జగన్నాధరావు, ఇరిగేషన్ యస్సి వెంకటేశ్వర్లు, ఈఈ పోచమల్లు డీఈ లావణ్య, తహసిల్దార్ భగత్, సింగల్ విండో వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి నాయకులు గోలి పింగళి రెడ్డి సంధి బసవయ్య, బద్దం వాదేవ్ రెడ్డి, కిలేందర్, నాయకులు పాల్గొన్నారు.



## తూకంలో తేడా రావొద్దు

### జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



**ప్రజాపక్షం/చివ్వెంల:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తుకాల్లో ఏమాత్రం తేడా రావద్దని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు కోనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదేశించారు. బుధవారం చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపాడు1, వాల్యాతండా, అక్కలదేవిగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లలో తాలు, చెత్త చేదారం లేకుండా ధాన్యాన్ని శుభ్రపర్చి అమ్మకానికి కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వట్టిఖమ్మంపాడు నుండి 16584 క్వింటాళ్లు, వాల్యాతండా నుండి 17505 క్వింటాళ్లు, అక్కలదేవిగూడెం నుండి 5574 క్వింటాళ్లు కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. వాల్యాతండా కొనుగోలు కేంద్రంలో కాంటా వేస్తున్న ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు ఏమైన సమస్యలున్నాయా అడిగి తెలుసుకున్నారు. పిపి వెంకన్న, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు శీరిష, మల్లేశ్వరి, శైలజ, ప్రియాంక, గంగమ్మ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుదాం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య



**ప్రజాపక్షం/చండూరు:** ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేస్తూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలపేలక్ష్యంగా ముందకుసాగాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో జరిగిన సిపిఐ శాఖ మహాసభకు వారు ముఖ్య అతిధిగా హాజరైయారు. గ్రామంలోని భగత్ సింగ్ బిసి కాలనీలో పార్టీ అరుణ పతాకాన్ని మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో రామలింగయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ కష్ట జీవుల కోసం ,వ్యవసాయ కూలీల కోసం ,కార్మిక వర్గం కోసం అనునిత్యం పోరాటాలు చేసే ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించి భూమి లేని నిరుపేదలకు భూములు పంచిన ఘనత భారతకమ్యూనిస్టుపార్టీదేనని అన్నారు. సిపిఐని గ్రామంలో బలోపేతం చేసుకుంటూ త్వరలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి గెలుపే లక్ష్యంగా పనిచేయవలసిన అవసరం ఉందని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సిపిఐ బలోపేతం కోసం కృషి చేయాలని పార్టీ శ్రేణులకు చూచించారు. మే 12న దోనిపాముల గ్రామంలో జరుగు మండల 15వ మహాసభకు పార్టీశ్రేణులు అధ్యతిక సంఖ్యలో తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా పల్లె నర్సింహ్మా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైయారు. గ్రామ శాఖ సహాయ కార్యదర్శి కొండ్రెడ్డి సాయి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశం , కర్నాటి వెంకటేశం , సిహెచ్ ఊషయ్య, ఇరిగి సంజీవ,శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య , బిక్షమయ్య , గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శంకరయ్య , ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ , మాదగోని శ్రీశైలం , నాయకులు జక్కలి పరమేష్ , బోయపల్లి శివలింగయ్య,పల్లె మల్లేశం , శ్రీను, వెంకటేశం , రమేష్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్



ప్రజాపక్షం/గంగాధర : మండలంలోని పోలీసులు బుధవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా రామడుగు మండలం మోతె వాగు నుంచి ఇసుక నింపుకుని కురిక్యాల గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇంచార్జి ఎస్సై స్వాతి తెలిపారు. అనుమతి పత్రాలు చూపించాలని అడగగా వారి వద్ద ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో ట్రాక్టర్ సీజ్ చేసి అక్రమ ఇసుక రవాణాతో సంబంధం ఉన్న నలుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వాతి తెలిపారు.

## బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్



ప్రజాపక్షం/చందుర్తి : మండలంలోని జోగాపూర్ గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో బుధవారం పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు, తోట ఆగయ్య, రాఘవరెడ్డి పలువురు స్వామి వారి ఆశీస్సులు పొందారు. వారి వెంట స్థానిక నాయకులు, కుర్మ సంఘ నాయకులు ఉన్నారు.

## వేములవాడలో 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడతాం

రోడ్డు సర్వే పనుల పరిశీలన

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడలో 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడతామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వేములవాడ పట్టణంలోని మూలవాగు నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ, భూసేకరణ విషయమై కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం వేములవాడ పట్టణంలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేస్తుండగా పనులు పరిశీలించామని, గజానికి ధర ఎంతో ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేనందున గజానికి ధర ఎంతో ప్రకటించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు డిజైన్, నిర్మాణ గడువు తదితర అంశాలపై ఎలాంటి ప్రకటన చేయబడలేదని వివిధ మీడియాల్లో వచ్చింది సరికాదని ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అక్రమ కేసులను ఎత్తివేయాలి

వేం.నరేందర్‌రెడ్డికి రాజన్న వినతి



ప్రజాపక్షం/జగిత్యాల : గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఆర్టీసి కార్మికులపై, ఉద్యమ కారులపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా పెట్టిన కేసులను మన ప్రభుత్వం ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం.నరేందర్‌రెడ్డికి జగిత్యాల ఉద్యమకారుడు మహంకాళి రాజన్న విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో స్వయంగా ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసి సమస్యల పట్ల కార్మికులు 2019లో చేసిన సమ్మె కాలంలో పోలీసులు అన్యాయంగా అక్రమ కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. జగిత్యాలలో మూడు కేసుల ద్వారా 43 మంది, ఇలా రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో అనేక మంది తప్పుడు కేసులతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ఇలాంటి అన్ని అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బాధిత కార్మికులను, ఉద్యమకారులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు రైతు కొల్లూరు రాజయ్య తెలిపారు. బుధవారం గేదె పశుగ్రాసం మేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. చనిపోయిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఆయిల్‌పామ్ తోట, వడ్ల కుప్పలు దగ్ధం



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామపంచాయితీలోని మానేరు శివారులో ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఆ లేక ఇతర కారణమో తెలియదు గానీ సూమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగింది. వివరాల్లో కెళ్తే పారుపల్లి శివారులో మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరెగడంతో చుట్టు ప్రక్కల ఉన్న రైతులు వచ్చే సరికి మంటలు చాలా దూరం విస్తరించడంతో మంటలను అదుపు చేయడం కష్టంగా మారింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన రాపెల్లి సురేందర్ ఐదు ఎకరాల ఆయిల్‌పాం తోట, దీనికి సంబంధించి డ్రిప్, మోటర్, వైరు, పైపులు పూర్తిగా కాలిపోయాయని మూడు లక్షల నష్టం వాటిల్లినందున రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనితో చల్ల సది మూడు ఎకరాలు, వేల్పుల రవి ఎకరం, అనుము లక్ష్మన్ ఎకరం మగ వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. పశుగ్రాసం కూడా కాలిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమైయ్యారు.ఈ సంఘటనలో సుమారు నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని రైతులు వాపోయారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రభుత్వ పథకాల అమలులో కీలకం

జగిత్యాల జిల్లా వ్యవసాయ ఇన్‌చార్జి అధికారి భాస్కర్



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయినటువంటి ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని జగిత్యాల జిల్లా వ్యవసాయ ఇంచార్జి అధికారి భాస్కర్ బుధవారం రోజున ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ ఇంచార్జి అధికారి మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖకు అందించాలని, ఈ క్రమంలో తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నెంబరు ఆధార్ కార్డుకు జత చేసినటువంటి మొబైల్ ఫోన్ నెంబరు అందజేయాల్సి ఉంటుంది. ఈ మొబైల్ నెంబర్‌కు మూడు ఓటిపిలు రావడం జరుగుతుంది. ఈ వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి అందించినట్లయితే 11 అంకెలతో కూడినటువంటి రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం చేపట్టేటువంటి వివిధ సంక్షేమ పథకాల్లో అమలులో పారదర్శకంగా ఉండడానికి ఈ విశిష్ట సంఖ్య ఎంతో కీలకం కానుందని అన్నారు. కావున రైతులు తప్పనిసరిగా ఈ రైతు విశిష్ట సంఖ్యను పొందడానికి పైన పేర్కొన్నటువంటి వివరాలు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులకు ఎఈఓలకు అందజేయాలని తెలిపారు.

# రాష్ట్ర ప్రజల అభ్యున్నతే లక్ష్యం



ప్రజాపక్షం/కొహెడ : తెలంగాణ రాష్ట్ర ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కొహెడ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలైన కొనసాగిస్తున్నామని, చెక్కులు ఎక్కడ ఆలస్యం జరగడం లేదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఒక్క ఏడాదిలోనే ఒక్కో నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని, ప్రతి సంవత్సరం 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని, రెండు నెలల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు ప్రక్రియ జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లాలో 47 వేల మంది కొత్త వ్యక్తులకు రేషన్ బియ్యం ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం వస్తున్నాయన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ టూరిస్టులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆపరేషన్ సిందూర్ భారత ప్రభుత్వం చేపట్టింది. భారత ప్రభుత్వం ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడి ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై గట్టి చప్పట్లతో అభినందనలు తెలుపుతూ, రాజకీయాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో పాటు అన్ని పార్టీల నాయకులు ఈ చర్యను సమర్థిస్తున్నాయని, ప్రజలందరూ ఉగ్రవాదుల చర్యలకు బుద్ధి చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం హుస్నాబాద్‌లోని ప్రజలు సంబరాలు జరుపుకొని సైనికులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

### ఆర్టీసీబస్సులో ప్రయాణించిన మంత్రిపొన్నం



ప్రజాపక్షం/కొండపాక : దుద్దెడ టోల్‌గేట్ నుండి సిద్దిపేట కలెక్టరేట్ వరకు కరీంనగర్ డిపో ఆర్టీసీ బస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణికులతో మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో అందుతున్న ఉచిత ప్రయాణంపై ఆరా తీశారు. ఆర్టీసీకి ప్రతి నెల ప్రభుత్వం 330 కోట్లు చెల్లిస్తుందని తెలిపారు. ఆర్టీసీ కొత్త బస్సులు కొనుగోలు చేశామని దేశానికి తెలంగాణ ఆర్టీసీ రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కాండక్టర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలు మంత్రితో మాట్లాడుతూ తమకు బస్సులో ఉచిత ప్రయాణం వల్ల చాలా డబ్బులు ఆదా అవుతున్నాయని రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళాలన్న ఉచితంగా ప్రయాణం చేస్తున్నామని మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి



కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/ముత్తారం : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమ శాతం రాగానే కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. ముత్తారం మండలంలోని ముత్తారం, మచ్చుపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాను ఆయన బుధవారం మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ సంచారకులు అంజనితో కలిసి సందర్శించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమ శాతం వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రికార్డు చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం సత్వరమే మిల్లులోకి తరలించేందుకు అవసరమైన మేర వాహనాల సంఖ్య పెంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. అలాగే మండల ప్రత్యేక అధికారి,వ్యవసాయ సంచాలకులు అంజని మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు తమ ఫార్మ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష,ఏపిఎం పద్మ, ఏఈవోలు మనిషా, హారిక, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి

ఎమ్మెల్యే విజయరమణ రావు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రోజున ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై అనంతరం మాట్లాడుతూ భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి కృషి చేయాలనీ తెలిపారు. అలాగే గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేక మంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సన్నవడ్లకు రూ.1234 కోట్లు బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.59.62 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగిలో కూడా సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామని పెద్దపల్లి పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా బోనస్ ఇస్తామన్నారు. సీఎం చొరవతో సీడ్ కంపెనీల యాజమాన్యాలు రైతులు చెప్పినట్లు నడుచుకునే స్థాయికి వచ్చారని, గతంలో కంటే క్వింటాల్ సీడ్ ధాన్యానికి రూ.2 వేల నుండి 5 వేలవరకు ఎక్కువ ధర సీడ్ యాజమాన్యాలు చెల్లిస్తున్నారని అన్నారు.రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వనిధి అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో,రైతు సోదరులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. భూభారతి పైలట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్, రాయికల్ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సదస్సులకు కలెక్టర్ హాజరయ్యారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేదిత జాబితాల్లో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్ బిలో చేర్చిన భూముల సమస్యలు, భూ సేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సైదాపూర్ మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. భూ సంబంధిత సమస్యలున్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను పరిశీలిస్తూ అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. ఈ సదస్సులలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు కనకయ్య, శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణాన్ని ఆపండి



రాజన్నపేటలో ఉద్రిక్తత, అడ్డుకున్న బిజేపి శ్రేణులు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాజన్నపేట గ్రామంలో చర్చి నిర్మాణం జరుపుతుండగా బిజేపి శ్రేణులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామ ప్రజలందరి తీర్మాణం లేకుండా, పూర్తి అనుమతులు లేకుండా, అసంపూర్తిగా జరిగిన అధికారుల విచారణతో నిర్మాణ పనులు చేపట్టారని ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవటంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారులు చేప్పిన వివరాల ప్రకారం జిఓ 35 ప్రకారం 2024 లో అనుమతులు వచ్చాయని, తదుపరి గ్రామస్తులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుతో నిర్మాణం పనులు నిలిపివేసారని తెలిపారు. అనంతరం కొద్ది రోజుల తర్వాత గ్రామ బాడీ మీటింగ్ ఏర్పాటు చేసి కొంత మంది గ్రామ బాడి వ్యక్తులతో తీర్మాణం చేసి పనులు ప్రారంభించారని, ఈ ప్రక్రియ సరైన పద్దతిలో జరగలేదని గ్రామస్తులు, బిజెపి అభ్యర్థులు చర్చి నిర్మాణం చేస్తున్న వ్యక్తులను అడ్డుకున్నారు. ఈ విషయంపై ఎంపీవోను జోగం రాజును వివరణ కోరగా గత అధికారులు ఇచ్చిన అనుమతులు పూర్తి స్థాయిలో లేవని, అట్టి స్థలం వ్యవసాయభూమికి సంబంధించింది అని, చట్ట వ్యతిరేకంగా అనుమతులు పొందారని అభియోగాలు ఉండటంతో, తాను కూడా చర్చి నిర్మాణంకు సంబంధించి పూర్తి విచారణ చేపిస్తానని మీడియా ప్రతినిధితో మాట్లాడారు.

## ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చిర్ర సతీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నార్ల త్రిష (21) అనే యువతి మంగళవారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డు గల ఇనుప రాడుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి నార్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలి




ప్రజాపక్షం/ధర్మపురి : వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ ఏ. రాజిరెడ్డి, ఏడిఈ టి. సింధూర్ శర్మ విద్యుత్ సిబ్బందికి సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా ధర్మపురి సబ్ డివిజన్ పరిధిలోని ధర్మపురి, నేరేళ్ల, వెల్గటూర్, రాజారాంపల్లిలో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు బుధవారం ధర్మపురి పట్టణంలో భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈ రాజిరెడ్డి, ఏడిఈ సింధూర్ శర్మ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అర్థ ఎలక్ట్రోడ్స్‌ను తప్పనిసరిగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రవి, రాజశేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అమ్మవారి దయతో జ్ఞానోదయం కలగాలి



మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : కెసిఆర్ ప్రభుత్వంలో మూడు పువ్వులు, ఆరు కాయల్లాగ అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నాం... కాని నేటి ప్రభుత్వానికి కళ్లు తెరిచేలా చేయాలని, జ్ఞానోదయం కావాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎల్లమ్మతల్లిని ప్రార్థించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలోని ఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రాంపూర్, చిన్నకోడూర్ మండలం మాచాపూర్ గ్రామాలలో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో స్వాముల భిక్ష కోసం మొట్టమొదటి అన్నదాన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలోనే ప్రజలను ఆగం ఆగం చేసిందని, దేవుని దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి దయతో వచ్చే సంవత్సరం మంచిగా కాలం కావాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. రాంపూర్ గ్రామంలో నిర్మించే హనుమాన్ దేవాలయంకు 10లక్షలు గత ప్రభుత్వంలో మంజూరు చేశానని,నావ్యక్తిగతంగా ఒక లక్ష ఇచ్చానని, ఆలయ అభివృద్ధి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని వైశ్యభవనంలో శ్రీవాసవి కన్యాక పరమేశ్వరి జయంతి వేడుల్లో పాల్గొని, వాసవి మాత ఫోటోలను ఆవిష్కరించి రెండువేల వైశ్య కుటుంబాలను అమ్మవారి ఫోలోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి, శ్యాంసుందర్, బాస్కర్‌గౌడ్, బాలరంగం, రాజాగౌడ్ మాజీ ప్రజాప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ అయాజ్‌కు యూత్ కాంగ్రెస్ సన్మానం




ప్రజాపక్షం/జమ్మికుంట : ఇటీవల జమ్మికుంట మున్సిపాలిటీ ఆస్తి పన్నుల వసూళ్లలో తెలంగాణలోనే మొదటి స్థానంలో నిలిచినందుకు గాను అందుకు కృషి చేసిన జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ అయాజ్‌ను యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పింగళి చైతన్య రమేష్, దొడ్డి సంధ్య నవీన్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. జమ్మికుంటను రాష్ట్రస్థాయిలో నిలిపినందుకు మూడు కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సెక్రటరీ మహమ్మద్ సజ్జత్ అలీ, అసెంబ్లీ ఉపాధ్యక్షురాలు గోస్కుల నాగమణి, ప్రధాన కార్యదర్శి అజయ్, కార్యదర్శులు గొడుగు మానస, రోమాల రాజకుమార్, పాతకాల రమేష్, మండల అధ్యక్షుడు బొడిగె శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు వినయ్, శ్యామ్, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, మహేష్ తదితరులున్నారు.

## సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల బలోపేతానికి చర్యలు

**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాలలోని జిల్లా పరిశ్రమల కేంద్రాలలో ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని, తద్వారా మార్కెట్ యాక్సిస్, క్రెడిట్ లభ్యత, పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన వారి నుంచి ఒక మేనేజర్, ఒక అసిస్టెంట్ మేనేజర్‌లను ప్రతి జిల్లాకు నియమించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మేనేజ్మెంట్/కామర్స్, ఇంజనీరింగ్ నేపథ్యంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు ప్రాధాన్యత ఉంటుందని, అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌లో, జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎస్25లో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

## ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా పరిశ్రమల కేంద్రం కేంద్ర ప్రభుత్వ పథకం కింద జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపర్చేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల కోసం అంతర్జాలంలో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు ఈడీసీ మేనేజర్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను కేటాయించటం జరిగిందని తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయటానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరటం జరుగుతుందని ఆయన తెలిపారు.. దరఖాస్తు చేసుకునేందుకు 10 చివరి తేదిగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను, 9640909831 ను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోపు పేర్కొన్న వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్ సూచించారు.

## నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/బాన్సువాడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను నిజమైన పేదవారికి లబ్ది చేకూర్చడానికి ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు నిష్పక్షపాతంగా లబ్దిదారుల ఎంపిక చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలో బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్ మండల ఇందిరమ్మ కమిటి సభ్యులకు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా నిష్పక్షపాతంగా లబ్దిదారులను ఎంపిక చేసే బాధ్యత ఇందిరమ్మ కమిటీ సభ్యులదేనన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, పిడి విజయపాల్ రెడ్డి, డిఎల్‌పివో సత్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ శ్రీలత, మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపిడివో ముజాహిద్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, గురువినయ్, పిట్ల శ్రీధర్, రెంజర్ల సాయిలు, అమీర్ చావుస్, పాశం రవిందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలు చదువులకు నిలయాలు : ఎమ్మెల్యే పాల్వాయి



**ప్రజా పక్షం /కాగజ్ నగర్:** కాగజ్ నగర్ పట్టణంలోని సర్సిల్క్‌లోని ఎంఎల్‌ఏ నివాసంలో బుధవారం బాబాపూర్, కల్వాడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అనూష, లోకేష్ పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ రోజుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడి చదువుకు దూరమవుతున్నారని, వాటికి ప్రభావితం కాకుండా ఉన్నతమైనస్థాయిలో నిలిచి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమాదేవి, ఆశ్రమ పాఠశాల అధికారులు ఉద్ధవ్, శకుంతల, ఖమర్ హుస్సేన్, చిరంజీవి, శ్రీనివాస్, గోపి, భారతి, రవీందర్, ఉపాధ్యాయులు ప్రీతి, అశోక్, సోమయ్య, కన్నయ్య, నాందేవ్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు సత్వరం అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. బుధవారం బైంసా లోని ఐకేపీ కార్యాలయంలో పట్టణం,మండలానికి చెందిన 116 మంది ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్,చెక్కులను పంపిణి చేసిన సందర్భంగా అయన మాట్లాడారు.గతం కంటే భిన్నంగా ధరఖాస్తు చేసుకున్న స్వల్ప కాలం లోనే లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరుగుతుందన్నారు.కేవలం 118 మంది లబ్ధిదారులకు చెందిన దరఖాస్తులు మాత్రమే పెండింగ్ లో ఉన్నాయన్నారు.లక్ష రూపాయల తో పాటు కాంగ్రెస్ సర్కార్ తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఈ విషయం పై అసెంబ్లీ లో మాట్లాడతానన్నారు.కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ అశోక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,మాజీ ఎం.పి.పి అబ్దుల్ రజాక్,నాయకులు సోలంకి భీమ్‌రావ్,పట్టణ,మండల బిజెపి అధ్యక్షులు రావుల రాము,సిరం సుష్మరెడ్డి,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుపోతుల మల్లేష్,నాయకులు పండిత్‌రావ్,రావుల పోశెట్టి గాలి రాజు,పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్ వడ్నప్ శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే,మాజీ సర్పంచ్ అప్పాల రాకేష్,తదితరులు ఉన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ నస్పూర్ :** వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడా కిట్లు పంపిణీ చేయడం జరిగిందని, క్రీడాకారులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖాధికారి కీర్తి రాజ్ వీరుతో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు అందించిన క్రీడా కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా సెంటర్ బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్, ఫుట్‌బాల్, వాలీబాల్, కరాటే శిక్షకులు వనిత, పున్నం చందు, రవి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే





**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని పెంచికల్ పేట మండలం దరోగపల్లి గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెంచికల్ పేట మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేయడం జరిగిందని, ఈనెల 20వరకు మండలంలోని 19 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజల నుండి భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అనంతరం మండలంలోని చెడ్వాయి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును సందర్శించారు. గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, కవిత, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు త్వరగా తరలించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లాలోని పెంచికల్ పేట్ మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు వినోద్ స్వామి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్, ఐకెపి సిబ్బంది, గ్రామ సమాఖ్య సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**కాగజ్ నగర్ రూరల్ :** జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. కాగజ్ నగర్ మండల పరిషత్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయిన ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇఇ సిద్ధిఖి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహిళ, బాలికల భద్రతకు భరోసా

సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** మహిళల, బాలికల భద్రత భరోసా లక్ష్యమని జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ అన్నారు. బుధవారం భరోసా ఆవిర్భావ దినోత్సవాన్ని సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రంలో నిర్వహించారు. వేడుకలకు హాజరై ఎస్‌పి మాట్లాడుతూ పోక్సో, అత్యాచార కేసులలో భాదితులకు భరోసా నిచ్చేందుకు తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా ఉమెన్ సేఫ్టీ వింగ్ డైరెక్టర్ ఆద్వర్యంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పోక్సో , అత్యాచార కేసులలో బాధిత మహిళలు బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటూ మన భరోసా సేవలు దేశానికి ఆదర్శం అని ఎస్పీ అభిప్రాయపడ్డారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల సేవలను ఒకే గొడుగు క్రింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి వెంట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐ పూలబాయ్ , భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ప్రభుత్వం కట్టించే ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసే విషయంలో స్థానిక వనరులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వీడియో సమావేశ హాల్‌లో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడం పై జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం హౌసింగ్, మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవిన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు 1లక్ష 74 వేల క్యూబిక్ మీటర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అవసరం ఉంటుందని, స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరాకు గ్రౌండ్ వాటర్, రెవెన్యూ మైన్స్ శాఖల సమన్వయం ద్వారా జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. ఇసుక రీచ్ లు జిల్లాలో లేనందున స్థానిక వనరుల స్ట్రీమ్స్ నుండి గుర్తించి లబ్ధిదారుని ఇంటి దగ్గరే ఇసుక సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంజీరా నది ఇసుక గురించి ఇరిగేషన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరా చేసే విషయంలో తహసీల్దార్లు ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఎన్ని క్యూబిక్ మీటర్లు అవసరం ఉంటుందో దాని వరకే అనుమతి మంజూరు చేయాలన్నారు. ఇసుక లోడింగ్ అన్ లోడింగ్ రవాణా చార్జీలు విషయంలో ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. వర్షాకాలం రాకముందే ఇందిరమ్మ ఇండ్లు వాల్స్ వరకు పూర్తి అవ్వాలని చెప్పారు. నూతన గ్రామపంచాయతీలు సెగ్రిగేషన్ షేడ్స్ న్యూ గ్రామపంచాయతీ బిల్డింగ్స్ భూమిని గుర్తించే విషయంలో తహసీల్దార్లు ప్రణాళిక బద్ధంగా చర్య లు చేపట్టాలన్నారు. సెక్రికేషన్ షేడ్స్ గుర్తించేటప్పుడు నిబంధనలు పాటిస్తూ దారి తప్పనిసరిగా ఉండాలని 05,06 గుంటల భూమి అవసరం ఉంటుందన్నారు. జూన్ 2 నుండి జిల్లాలో ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహణపై కలెక్టర్ పలు సూచనలు సలహాలను అందించారు. కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, హౌసింగ్ పిడి మాణిక్యం, ఆర్‌డిఒ లు, మెదక్ రమాదేవి, తూఫ్రాన్ జై చంద్రా రెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ జువాలజిస్ట్ మధు కుమార్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సంబంధిత తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# కొనుగోలు ప్రక్రియలో అలసత్వం వహించొద్దు





నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/కుంటాల :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అలసత్వం వహించొద్దని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కుంటాల మండల అందకూర్ గ్రామంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో టెంట్, తాగునీరు తదితర వసతులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.. కొనుగోలు ప్రక్రియలో అలసత్వం కారణంగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి తరలించాలన్నారు. తేమ శాతం నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. తగినన్ని గన్ని సంచులు, టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెలుపాలని కలెక్టర్ రైతులను కోరారు. తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్‌డిఒ కోమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

**కుంటాల :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. అనంతరం సమీపంలోని జొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, రెవెన్యూ ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేస్తాం

**నిర్మల్ ప్రతినిధి :** ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు మండలాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని కబ్జా చేసిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆరు నెలలుగా జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్వహిస్తున్న ఆక్రమణల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఈ భూములు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జిల్లాలో ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగిస్తామని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టు కృషి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సిపి సాయిచైతన్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** క్లోరోపామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. మత్తు పదార్థాల రవాణాపై నిరంతరం నిఘాను కొనసాగించాలని, ఎలాంటి సమాచారం తెలిసినా పరస్పరం సహకరించుకుంటూ వీటి నిరోధానికి పకడ్బంధీ కార్యాచరణతో ముందుకెళ్లాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం రవాణా తదితర అంశాలపై సమావేశం సుధీర్ఘంగా చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సిపి సాయిచైతన్య అధికారులకు పలు సూచనలు చేశారు. యువత ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా అన్ని విద్యాసంస్థలలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని మాదకద్రవ్యాల నిరోధక కమిటీలు క్రియాశీలక పాత్ర పోసించేలా చూడాలన్నారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పాన్ షాపులు, ఇతర దుకాణాలలో సిగరెట్లు, గుట్కాలు, నికోటిన్ కలిగిన పదార్థాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సూచించారు. మూతపడిన పరిశ్రమలలో బాయిలర్లను వినియోగిస్తూ అల్ప్రాజోలం తయారుచేసే అవకాశాలున్నందున అలాంటి ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పోలీసు, ఎక్సైజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని హితవు పలికారు. గతనెలలో జిల్లాలో ఐదు కిలోల వరకు గంజాయి నిల్వలను 1.5 కిలోల అల్ప్రాజోలంను పట్టుకోవటం జరిగిందని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డిఐఇఒ రవికుమార్, వ్యవసాయ విద్య, అటవీ రవాణా వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

## అక్షరాస్యత లక్ష్యం పూర్తికి కార్యాచరణ

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాల వారిగా నిరక్షరాస్యుల వివరాలను సేకరించి, వారందరికీ కనీస విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం బాసర మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల సహాయంతో నిరక్షరాస్యులను గుర్తించి వారికి విద్య నేర్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఇఒ పి.రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, డిఆర్‌డిఒ విజయలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి తిరుపతి రావు, మెప్మా పిడి సుభాష్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, లింబాద్రి, ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యం

ఎంపిలు సురేష్ షట్కర్, రఘునందన్‌రావు



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లా సమగ్ర అభివృద్ధి తమ లక్ష్యమని ఎంపిలు సురేష్ షట్కర్, ఎంపి రఘునందన్‌రావు తెలిపారు. ఎంపి సురేష్ షట్కర్ అధ్యక్షతన బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశానికి సహ అధ్యక్షుడిగా మెదక్ ఎంపి రఘునందన్‌రావు, ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమావేశంలో సమీక్షించారు. గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, విద్య, ఆరోగ్య రంగాల్లో జరుగుతున్న పనులపై చర్చ జరిగింది. అధికారులు సమర్పించిన వివరాల ఆధారంగా సమస్యాత్మక అంశాలు గుర్తించి వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి సురేష్ షట్కర్, ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 165 నేషనల్ హైవే పనులు వెంటనే పూర్తి చేసేలా నేషనల్ హైవే ఆథారిటీస్ అధికారులు కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లు, చర్యలు తీసుకోవాలని, వచ్చే సమావేశానికి నేషనల్ హైవే అధికారులు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పటాన్చెరు జహిరాబాద్ నేషనల్ హైవేలో మల్కాపూర్ వద్ద నాందేడ్, ఆకోలా, రహదారిలో సుల్తాన్ పూర్ వద్ద అసంపూర్తిగా ఉన్న పనుల పూర్తికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో విద్య వైద్య గృహ ఆరోగ్య శాఖల అధికారులను జిల్లాలో జరుగుతున్న ఆయా శాఖల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చెరువులు, కుంటలలో మత్స్యశాఖ ద్వారా చేపల పెంపకానికి అవసరమైన చేప పిల్లల్ని జిల్లాలోని ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రోడ్లు భవనాల నిర్మాణం ఆలస్యానికి కారణాలు అడిగారు. టిజి ఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకే చేరాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పిడిడిఆర్‌డిఎ జ్యోతి, దిశ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్ కళారంగం

ప్రపంచ ప్రసిద్ధి జానపద కళారూపాల జాబితాను పరిశీలిస్తే ప్రతి ఒక్కటి ఆయా దేశాల సంస్కృతి ప్రత్యేకతను ప్రతిబింబిస్తుంది. చైనాలో లయన్ డాన్స్, డ్రాగన్ డాన్స్ ఫేమస్. జపాన్ అనగానే బోన్ ఒడోరి గుర్తుకొస్తుంది. ఇండోనేసియాలో బరాంగ్ డాన్స్,కేచక్ డాన్స్, స్పెయిన్‌లో ఫ్లమెంకో, రష్యాలో కొసాక్ డాన్స్, ఐర్లాండ్‌లో



## ప్రపంచ ప్రఖ్యాత జానపద నృత్యాలు

ఐరిష్ స్టెప్ డాన్స్, గ్రీస్‌లో సిర్టాకి, నైజీరియాలో, బాటా డాన్స్, దక్షిణ ఆఫ్రికాలో గమ్ బూట్ డాన్స్, ఘనాలో కప్లా డాన్స్, బ్రెజిల్‌లో, సంబా, అమెరికాలో స్క్వేర్ డాన్స్, టాప్ డాన్స్, న్యూజిలాండ్‌లో హాకా (మాఒరి ప్రజల యుద్ధ నృత్యం), ఆస్ట్రేలియాలో అబారిజినల్ డ్రీమ్‌టైమ్ డాన్స్ ప్రఖ్యాతమైనవి. ఇక భారత దేశంలో ముఖ్యమైన జానపద నృత్యాల విషయానికి వస్తే, దేశంలోని పలు ప్రాంతాలు అనేక ప్రాంతీయ జానపద నృత్యాలకు నెలవు. వాటిలో కొన్ని ప్రసిద్ధమైనవి. భంగ్రా అనేది పంజాబ్ రాష్ట్రానికి చెందిన నృత్యం. ఇది సంతోషాన్ని, వేడుకలను ప్రతిబింబిస్తుంది. గర్బా , దాండియా రాస్ గుజరాత్ రాష్ట్రానికి చెందినవి. గర్బా మట్టి కుండలను పట్టుకుని చేస్తారు. దాండియా రాస్ కర్రలతో జరిపే నృత్యం. గమ్మత్ జానపద నృత్యం గోవాలో ప్రసిద్ధమైనది. మహారాష్ట్రానికి చెందిన లావణి జానపద నృత్యం వేగంగా పాడే పాటలతో అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. తెలంగాణా ప్రాంతానికి చెందిన జానపద నృత్య రూపం బతుకమ్మ ఆట. గోమ్మటేశ్వర నృత్యం కర్ణాటకలో ప్రసిద్ధి చెందినది. కొలాటం దక్షిణ భారత దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రజల మధ్య ప్రాచుర్యం పొందిన కర్రల ప్రదర్శన. పులికళి కేరళ రాష్ట్రానికి చెందిన, పులి వేషధారణతో చేసే వినోదాత్మక నృత్యం. తెయ్యం కూడా కేరళలో ఆరాధనా ధర్మంతో కూడిన జానపద నృత్యం. భూమి నృత్యం మధ్యప్రదేశ్‌లో గోండ్ తెగల నృత్యం. చౌ నృత్యం పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగే మాస్క్ ధరించి చేసే యుద్ధ నృత్యం. బిద్ధి నృత్యం అసోంలో జరిపే ఒక ప్రత్యేక జానపద నృత్యం. రౌఫ్ అనేది కాశ్మీర్‌లోని మహిళలు చేసే ఉత్సవ నృత్యం. దుమ్హాల్ జమ్మూకశ్మీర్ ప్రాంతానికి చెందిన పురుషులు చేసే యుద్ధ నృత్యం. పొయక్కల్ కుదిరై తమిళనాడులో కాళ్లకు గుడ్డ గొర్రె పాదాలతో గుఱ్ఱపు ఆకారాన్ని ధరించి చేసే నృత్యరూపక విన్యాసం.



## ఉత్తమ కెరీర్‌కు 'ఫైన్ ఆర్ట్స్'

ప్రవృత్తినే వృత్తిగా ఎంచుకుంటే, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఎన్నో కళారూపాలు, సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఏర్చికూర్చి, 'ఫైన్ ఆర్ట్స్' పేరిట విద్యార్థులకు శిక్షణనిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఉత్తమ కెరీర్ కోరుకునే వారికి 'ఫైన్ ఆర్ట్స్' ఓ చక్కటి అవకాశాన్ని కల్పిస్తుంది. 'ఫైన్ ఆర్ట్స్' అంటే నైపుణ్యంతో కూడిన సృజనాత్మక కళలు. ఇవి మానవ భావోద్వేగాలను, సౌందర్యాన్ని, సృజనశక్తిని వ్యక్తపరిచే కళలు. 'ఫైన్ ఆర్ట్స్'లో ప్రధానంగా ఆరు విభాగాలు ఉంటాయి:ఫైన్ ఆర్ట్స్ విభాగాలు ఉంటాయి. వాటిలో మొదటిది చిత్రకళ (Painting). ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్స్, అక్రాలిక్, అక్రిలిక్ వంటి విధానాల్లో చిత్రాలు వేయవచ్చు. కాగా, శిల్పకళ (Sculpture) అనేది రాతి, లోహం, మట్టి మొదలైన పదార్థాలతో విగ్రహాలు, శిల్పాలు తయారు చేసే విధానం. సంగీతం (Music) గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. శబ్దాల ద్వారా భావాలను వ్యక్తపరిచే కళ. దీనిలో శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, ఆధునిక సంగీతం మొదలైన విభాగాలు ఉంటాయి. సంగీతంలోనూ కెరీర్ అద్భుతంగా ఉంటుంది. ఓకల్ (గాత్రం), ఇన్‌స్ట్రుమెంట్ (వాయిద్యం) ప్రక్రియలు అందుబాటులో ఉంటాయి. శరీరచలనాల ద్వారా భావవ్యక్తీకరణను




నాట్యంగా పేర్కొన్నారు. భారత్‌నాట్యం, కూచిపూడి, కథక్ మొదలైన శాస్త్రీయ నృత్యరీతులు ఎన్నో ఉన్నాయి. నాట్య కళాకారులకు డిమాండ్ ఎక్కువ. నాటకకళ (Drama / Theatre) ఇటీవల కాలంలో మళ్లీ పుంజుకుంటున్నది. సుమారు మూడునాలుగు దశాబ్దాలుగా కళావిహీనమైన నాటక రంగం కొత్త చిగురులు వేయడం ఆనందకరం. కథ నాయక పాత్రల్లో నటిస్తూ భావాలను, సంఘటనలను ప్రదర్శించే కళ. మిగతా వాటితో పోలిస్తే ఎంతో ఉత్తమమైనది పేర్కొంటారు. సినిమా రంగం ఏ స్థాయిలో విస్తరించిందో అందరికీ తెలిసిందే. చిత్రీకరణ, స్క్రీన్‌ప్లే, నటన, దర్శకత్వం మొదలైన అంశాలతో కూడిన సమగ్ర కళను సినీ కళగా పేర్కొన్నారు. మొత్తం మీద 'ఫైన్ ఆర్ట్స్' భావప్రకటనకు ప్రాధాన్యమిస్తాయి. అంతర్లీన అభిరుచులకు అనుగుణంగా కళా విధానాలను అభివృద్ధి చేస్తాయి. సృజనాత్మకతకు వేదికగా నిలుస్తాయి. భావోద్వేగాల చలనానికి మార్గంగా ఉపయోగపడతాయి. వీటి వల్ల కెరీర్ స్థిరపడడమేకాదు... మానసిక ఆహ్లాదం, సాంస్కృతిక పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సందేశాల వ్యాప్తి వంటి ఉపయోగాలు కూడా ఉన్నాయి.

## అనితర సాధ్యం.. డాలీ విలక్షణత్వం!



సాల్వడార్ డాలి... పొడవాటి మీసాలతో విచిత్రంగా కనిపించే విలక్షణ చిత్రకారుడు. 1904, మే 11న స్పెయిన్‌లోని కాటలోనియా రాష్ట్రం ఫిగరస్‌లో జన్మించిన డాలీ జీవితం, కళా శైలి చాలా ప్రత్యేకమైనవి. సుమారు శతాబ్దకాలం క్రితమే చిత్రలేఖనంలో అధివాస్తవిక ధోరణులతో సంచలనం సృష్టించాడు. బాల్యంలోనే అతనిలో అసాధారణమైన ఊహాశక్తి కనిపించింది. అనూహ్యమైన భావోద్వేగాలను అభివృద్ధి చేసుకున్నాడు. మాడ్రిడ్‌లోని సన్ఫెర్నాండో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో విద్యాభ్యాసం చేశాడు. కళాశాలలోనే అతని విలక్షణత్వం' స్పష్టమైంది. అహంకారిగా, మొండివాడిగా, విచిత్రమైన అభిప్రాయాలతో కూడిన వ్యక్తిగా ముద్రపడ్డాడు. అతని జీవితంలో కీలకమైన వ్యక్తి గాలా. ప్రముఖ ఫ్రెంచ్ కవి పాల్ ఎల్యులార్డ్‌ను వివాహం చేసుకున్న గాలాను డాలి ప్రేమించాడు. ఆరంభంలో డాలికి ఆమె వ్యక్తిగత కార్యదర్శిగా మారింది. అనంతరం వారిద్దరూ వివాహం చేసుకున్నారు. గాలా ప్రభావం డాలిపై ఎక్కువగా ఉందని అతనిని తెలిసిన వారు చెప్తారు. మొత్తం మీద విలక్షణమైన డ్రస్సింగ్ స్టైల్, తనదైన మీసం... ప్రవర్తన ద్వారా కూడా కళను జీవితం చేసినవాడు. సర్రియలిజం లేదా అధివాస్తవికత అతని చిత్రాల్లో కనిపిస్తుంది. కలలు, అపచేతన మేధస్సు ప్రపంచాన్ని కళగా మలిచిన డాలి శైలి చాలా కొత్తగా ఉంటుంది. సర్రియలిజాన్ని అత్యంత చక్కగా, శాస్త్రీయంగా ఉపయోగించి అనేక చిత్రాలు సృష్టించాడు. అసాధ్యమైన దృశ్యాలు ఎన్నో అతని బొమ్మల్లో కనిపిస్తాయి. కాలుగల కప్పలు, మృదువైన గడియారాలు వంటి చిత్రణ అతనికి ప్రత్యేక గుర్తింపు సంపాదించిపెట్టింది. హైపర్‌రియలిస్టిక్ స్టైల్‌తో, కలలు నిజమైనట్లు చూపించేవాడు. అపారమైన ప్రామాణికతతో గీసిన అసాధారణ దృశ్య స్వప్నాలు అతని ఆలోచనా శక్తికి, కొత్త పోకడలకు అద్దం పడతాయి. అర్థరహిత అనుభూతులను కళగా మార్చడం డాలి ప్రత్యేకత. 'ది పెర్సిస్టెన్స్ ఆఫ్ మెమరీ' (1931), 'మెల్టింగ్ క్లాక్స్' వంటి చిత్రాలు కాలానికి సంబంధించిన మన భావనల నాశనాన్ని సూచిస్తాయి. కలల ప్రపంచాన్ని తీక్షణమైన ప్రతిబింబంగా చూపించడంలో డాలి అత్యంత ప్రతిభావంతుడు. 'ది ఎలిఫెంట్స్' (1948) అనే చిత్రం అప్పుడేకాదు.. ఇప్పటికీ విచిత్రంగా కనిపిస్తుంది. లోతైన అర్థాలను గమనిచాలని సూచిస్తుంది. అందులో అతను చిత్రించిన పొడవైన కాళ్లతో ఏనుగులను పెరుగుతున్న భారీ, అసహజమైన స్థిరత్వానికి సంకేతంగా భావించవచ్చు. అదే విధంగా 'స్వాన్స్ రిఫ్లెక్టింగ్ ఎలిఫెంట్స్' (1937) జలవనరుల ప్రతిబింబంలో హంసలు ఏనుగుల్లా మారడాన్ని చూపుతాడు. అపచేతన భావనలు ఎలా మెలిపోతాయో ఈ చిత్రం వివరిస్తుంది. 'మెటామార్ఫోసిస్ ఆఫ్ నార్సిసిస్' (1937) చిత్రం నార్సిసిస్ పురాణాన్ని ఆధునిక, మానసిక దృష్టితో తిరిగి మలిచిన కృతి. సర్రియలిజాన్ని డాలి ప్రజాపరం చేశాడు. అపారమైన ప్రజాదరణతో, అధివాస్తవికతను ముఖ్య కళా ఉద్యమంగా మార్చాడు. అల్ఫ్రెడ్ హిచ్‌కాక్ చిత్రం 'స్పెల్‌బౌండ్' (1945)లో కలల సన్నివేశాలను డాలీ రూపొందించాడు. వాల్ట్ డిస్నీతో 'డెస్టినో' అనే ఎక్స్‌పెరిమెంటల్ యానిమేషన్ పండించాడు. పెయింటింగ్, శిల్పం, ఫ్యాషన్, సినిమా రంగాలతోపాటు రచయితగా కూడా డాలి ఎన్నో నూతన ప్రయోగాలు చేశాడు.




**వ్యక్తిత్వమే కళగా:** సజీవ ప్రదర్శనలతో, అతను తన జీవితాన్ని కూడా కళారూపంలో తీర్చిదిద్దుకున్నాడు.



**సంపూర్ణ విశ్లేషణ:** అపార ఊహాశక్తి... అత్యంత ప్రతిభాపూరిత సాంకేతిక నైపుణ్యం... కలల లోని అస్పష్ట భావాలను స్పష్టంగా చూపే విశిష్ట దృష్టి డాలి ప్రత్యేకతలు. అతను చూపించిన కలలు అనేవి భయపడించేలా ఉండేవి కాదు... ఆశ్చర్యపరచేవి. మానవ అపచేతన మేధస్సు ఎంత గొప్పదో తెలియజేసేవి. 'I don't do drugs. I am drugs' (నేను మత్తు మందులు తీసుకోను. నేనే ఒక మత్తును) అనడం డాలి వంటి అసాధారణ ప్రతిభావంతుడిగా చెల్లింది. అతను కలల, భ్రమల, భయాల, ఆశ్చర్యాల ప్రపంచాన్ని అత్యంత అద్భుతమైన చిత్రాల్లో పట్టుకున్న గొప్ప కళాకారుడు డాలి 1982 జూన్ 10న తుదిశ్వాస విడిచాడు. భౌతికంగా దూరమైనప్పటికీ, తన విలక్షణమైన చిత్రాల ద్వారా నిత్యం మనల్ని పలకరిస్తునే ఉంటాడు.

# దేశంలో యుద్ధ వాతావరణం

● తీరు మార్చుకోని మోదీ ● హామీలపై ప్రజల్లో సన్నగిల్లుతున్న విశ్వాసం ● సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం:** పహల్గాం దాడి తర్వాత దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని తుద ముట్టించాల్సిందేనని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం బెజవాడ రవి అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మోదీ ఆలోచనలో ఎటువంటి మార్పు లేదని ప్రజల గురించి కాకుండా సంపన్న వర్గాల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకు సంబంధించి పని దినాలు తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్తతను మత ఉన్మాదులు అవకాశంగా తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రభుత్వం పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుందని హేమంతరావు తెలిపారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం లక్ష్యం దిశగా పని చేయలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ పూర్తయినట్లు తెలుస్తుందని హేమంతరావు అన్నారు. రైతు భరోసా నాలుగు ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో వేశామని చెబుతున్నప్పటికీ



అది కూడా అమలు కాలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన తెలిపారు. కోతలు విధించడంతో పాటు కొనుగోళ్లలో లోపాలు ఉన్నాయని ఆయన తెలిపారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయని భవిష్యత్తులో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హేమంతరావు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పని దినాలను తగ్గించిందని సగానికి పని దినాలు తగ్గించడం వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రైతు బీమా, పంటల బీమా విషయంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పంటల బీమా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఇతరత్రా కారణాలతో పంటలు నష్టపోవడం జరుగుతుందని బీమా వర్తించక రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని హేమంతరావు తెలిపారు. శత వసంతాల సిపిఐ ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని ఈ మహాసభకు 20 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ముగింపు సభకు ముందు మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ మహాసభలు జరగనున్నాయని నిర్ణీత తేదీల్లో ఖమ్మంజిల్లాలోని అన్ని మండల మహాసభలను పూర్తి చేయాలని హేమంతరావు స్పష్టం చేశారు. కార్యక్రమాల నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టగా మహాసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీర్ సమస్య పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం

● ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు సిపిఐ సంపూర్ణ మద్దతు ● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి ● 27, 28 తేదీలలో జిల్లా మహాసభలు : మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారతదేశంలో బిజెపి రాజకీయ విధానాలు వేరైనప్పటికీ సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చేయడం కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే చర్యలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి వెల్లడించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న వెంకటస్వామి మాట్లాడారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, నాడు భారత దేశం నుంచి పాకిస్తాన్ విడిపోయిన సందర్భంలో జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తి కలిగి ఉండేదన్నారు. జమ్ముకశ్మీర్ సమస్య పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు జమ్ముకశ్మీర్‌లో ఇటీవల ప్రవేశించి పహల్గాంలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపి చంపడం దుర్మార్గపు చర్య అని, ఆ ఘటన అనంతరం దేశంలో అంతరంగిక భద్రత సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఉగ్రవాదుల దాడులను నిలువరించడానికి కేంద్ర ప్రభుత్వం భారత సైన్యం సింధూర పేరుతో నిర్వహించే ఆపరేషన్ సిపిఐ స్వాగతిస్తుందన్నారు. చత్తీస్ఘఢ్, తెలంగాణ బార్డర్‌లో మావోయిస్టులు , ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలని కోరారు. కేంద్ర భద్రతా బలగాలు కర్రెగుట్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి అమాయక ఆదివాసీలను, మావోయిస్టులను విచ్చలవిడిగా చంపడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మావోయిస్టులు చర్చలకు సిద్ధమని మూడుసార్లు లేఖలు పంపినా కేంద్రం పెడచెవిన పెడుతోందన్నారు. చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం అయితే అంతరంగిక భద్రత సమస్య ఉండదని, ఇది నిరంతరం కొనసాగాలని దురుద్దేశ్యంతో కేంద్రం చర్చలకు పిలువకపోవడం సరి కాదన్నారు. మావోయిస్టులు సైతం వ్యక్తిగత హింసకు తావు లేకుండా ఎవరినీ చంపకుండా జనజీవన స్రవంతిలో కలిసి ప్రజల కోసం పనిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను కలుపుకుని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తుందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను వెనక్కు పంపించి శాంతి చర్చలు జరిపి ప్రజా సమస్యలను చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిపిఐ దేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అడుగిడిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిసెంబర్ వరకు వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. సిపిఐ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుంచి



జాతీయ స్థాయి వరకు మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే 75 శాతం గ్రామశాఖ, ఏడు మండలాల మహాసభలు జరిగాయని తెలిపారు. మిగిలిన 9 మండలాలు, గ్రామశాఖ మహాసభలు పూర్తి చేసుకుని ఈ నెల 27, 28 తేదీలలో సిపిఐ జిల్లా మహాభస కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని , ముఖ్య అతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కిన్నెర మల్లవ్వ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, సిపిఐ నగర నాయకులు కొట్టె అంజలి, మాడిశెట్టి అరవింద్, నగునూరి రమేష్ తదితరులున్నారు.

## వలస ఆదివాసీలకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

గిరిజనుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** రెండు దశాబ్దాలకు పైగా పెనగడప అటవీ ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. చుంచుపల్లి మండలం, పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలోని పాలవాగు, జగ్గారం, మర్రిగూడెం, గడ్డిగుట్ట ఆదివాసీ గ్రామాల ప్రజల సమావేశం బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా వలస ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి దశాబ్దాల క్రితం గిరిజన ఆదివాసీలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, వీరికి రెవిన్యూ శాఖా ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారిచేయండంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆదివాసీ గ్రామాల్లో వారికి కావాల్సిన త్రాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలతో పాటు వైద్య సదుపాయం అందుబాటులోకి తెచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు నీడాల సుధాకర్, కట్టా ఉదయ్, మన్నే వీరభద్రరావు, లక్ష్మణరావు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రజెండా రాజ్యం రావడం ఖాయం

● భవిష్యత్ కమ్యూనిస్టులదే ● పెట్టుబడిదారీ విధానం పతనం తప్పదు ● సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దేశ భవిష్యత్ కమ్యూనిస్టులపై ఆధారపడి ఉందని, రానున్న రోజుల్లో ఎర్రజెండాకు పూర్వ వైభవం రావడం ఖాయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో వెలిదండ, రంగాపురం గ్రామాల సిపిఐ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారి విధానం పతనం ఖాయమని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, అధికారంలో ఉన్న పెద్దలకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలోని మతోన్మాద శక్తులు బిజెపి, దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండటం వల్ల మైనార్టీ మతాలపై రోజు రోజుకు తీవ్రమైన దాడులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదన్నారు. అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని, విద్య, ఉద్యోగ నియమాకాలను పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెండు లక్షలపై ఉన్న రుణం తీసుకున్న వారికి కూడా రెండు లక్షలు మాఫీ చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అంతకు ముందు పెద్ద ఎత్తున గ్రామంలో ర్యాలీ నిర్వహించి పార్టీ దిమ్మెలపై జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోటు పూర్ణచందర్‌రావు, కడియాల అప్పయ్య, ఎడ్ల అంజిరెడ్డి, మామిడి శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



## 15 నుండి ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు ఈనెల 15నుండి18వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి లో నిర్వహించడం జరుగుతుంద ని, ఈ సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. వరంగల్‌లోని శివనగర్ సిపిఐ ఆఫీస్ ఎదురుగా ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్లను ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో చరిత్రక, ఆధ్యాత్మిక, లౌకిక కేంద్రంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతిలో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి 1000 మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజెపి ఎన్‌డిఎ కేం ద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలు, రాజకీయాలు, నియంతృత్వ కార్పొరేట్ విధానాలు, విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం, సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలు తదితర అంశాలు, కార్పొరేట్ కబంధహస్తాల్లో నలుగుతున్న చట్టసభలు, రాజకీయాలు, మీడియా విలువలు, రక్షణ కోసం చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. మే 15 తేదీన మహాసభ ప్రారంభ రోజు వేలాది మంది యువతి, యువకులచే భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుగుదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతు లాంటి అమరవీరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని 1934లో ఏర్పాటైన రాష్ట్ర యువజన సమాఖ్య స్వతంత్ర అనంతరం 1959 మే 3వ తేదీన అఖిల భారత యువజన సమైక్యగా ఎఐవైఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి సుధీర్, హాసీనా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



ప్రజాపక్షం/జనగామప్రతినిధి: మంగళవారం కురిసిన అకాల వర్షం నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలుగ కుం డా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తహసీల్దార్‌లను అప్రమత్తం చేశారు. ముందు అకాల వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలలో ఉన్న ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలన్న కలెక్టర్ ఆదే శాల మేరకు తేమశాతం వచ్చిన వరి ధాన్యాన్ని తూకం జరిపి నిర్ణీత రైస్ మిల్లులకు తరలించేలా తహసీల్దార్లు దగ్గ రుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారన్నారు.

## న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి



ప్రజాపక్షం/వెంకటాపూరం: వెంకటాపురం మండల కేంద్రంలో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించ డానికి వచ్చిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి కలిసి భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం కేంద్రంగా ఒక న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఆదిమ జాతి తెగలు వెనుక బడి ఉన్నారని, చట్టాలు జీవో లు పూర్తి స్థాయిలో అమలు కావాలంటే వారికి ప్రత్యేకంగా న్యాయ కళాశా ల ఏర్పాటుతోవారి జీవన విధానానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. భద్రాచలంకి కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేసి ఆది వాసి జీవన విధానానికి తోడ్పడేలా చూడాలని కోరినట్లు తెలిపారు. ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ, వెంకటాపురం మండల నాయకులు పర్శిక అనిల్,పూనెం అర్జున్ తదితరులు ఉన్నారు.

## మూడు లే అవుట్‌లకు అనుమతులు

### జిల్లా కలెక్టర్ సత్యశారద



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: జిడబ్ల్యుఎంసి పరిధిలోని మూడు లే అవుట్‌లకు అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లాలో లేఅ వుట్ అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన లేఅవుట్ కమిటీ సమావేశం బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. వరంగల్ జిల్లా జిడబ్ల్యు ఎంసి పరిధిలో మూడు లే అవుట్ అనుమతుల కోసం ప్రతిపాదన రాగా వాటిని కమిటీ నిబంధనలననుసరించి పరిశీలించి, సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశం లో జిడబ్ల్యుఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిటిసిపి జ్యోతి, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, రోడ్ల భవనాల శాఖ, ఇరిగేషన్‌శాఖ, ల్యాండ్స్‌సర్వే విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి : జనగామ కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఎస్ఎస్‌సీ 2025 ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, పాఠశాలల హెచ్‌ఎంలకు విజయోస్తు సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పది ఫలితాలలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మూడవ స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. జిల్లాలోని 129 పాఠశాలలు వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను అగ్రభాగాన నిలబెట్టారన్నారు.ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు 23 మందికి సైకిల్స్, 129 పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో డిఇఒ భోజన్న, బిసి సంక్షేమాధికారి రవీందర్, ఎస్సీ సంక్షేమాధికారి విక్రమ్,డిఐఇఒ జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడి

### సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. సతీష్ చంద్ర



ప్రజాపక్షం/హసన్‌పర్తి : పంట మార్పిడితో సాగులో అధిక దిగుబడి సాధించవచ్చు అని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. సతీష్ చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలోబుధవారం రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. సతీష్ చంద్ర మాట్లాడుతూ పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని తక్కువ నీరు అవసరమయ్యే సాగు పద్ధ తులను ఎంచుకొని అధిక రసాయనిక ఎరువులను పురుగు మందులను వాడడం ద్వారా నేల ఆరోగ్యం పాడవుతుందని అన్నారు. ముఖ్యంగా వంగడాల ఎంపిక వేసవిలో చేపట్టవలసిన పనులను విత్తనాల ఎంపికలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యానవన అధికారి సుస్మిత మాట్లాడుతూ ఉద్యాన పంటలలో ఇస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. పశు వైద్యాధికారి డాక్టర్ మాళవిక, మండల వ్యవసాయ అధికారి ఏ. అనురాధ తదితరులు పలు విష యాలను సూచించారు. ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బి.కల్పన, శైలజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజీవ్ గాంధీ రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో కోతలు వద్దు

### జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ధాన్యం కొనుగోళ్లలో కోతలకు పాల్పడొద్దని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో డిసిపి రాజమహేంద్ర నాయక్‌తో కలిసి జెసి రోహి త్‌సింగ్ ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై రైస్‌మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మాట్లాడుతూ ఎక్కడైనా ధాన్యం కొనుగోళ్లలో తరుగు, తదితర అవక తవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీసీఎస్‌వో సరస్వతి, డిఎం సీఎస్ హతీరాం, ఆర్‌డిఒ శ్రీనివాస్‌గౌడ్, రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల మేలు కోసమే ‘భూభారతి’

### దేశానికే రోల్ మోడల్ ఈ చట్టం


### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : రైతు సమస్యలను పరిష్కరించి వారికి మేలు చేయడం కోసమే భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం తెచ్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూ భారతి పైలట్ మండలమైన రేగొండ మండలంలోని రేగొండ, భాగిర్తిపేట గ్రామాలల్లో (బుధవారం) తహసీల్దార్లు శ్వేతా, సత్యనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సుల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. లోపభూయి ష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్‌నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారన్నారు. ప్రజలకు ఆధార్ కార్డు ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తులను పరిశీ లించి వచ్చే నెల జూన్ 2 న పట్టా పాస్ పుస్తకాలను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా, ఈ నెల10 న భూపాలపల్లి నియోజకవర్గం లోని రేగొండ మండలంలో ఒక గ్రామంలో జరిగే భూ భారతి అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులుపాల్గొన్నారు.

## టెర్రరిస్టులకు బుద్ధి చెప్పిన ఆర్మీకి సెల్యూట్

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: టెర్రరిస్టులకు బుద్ధి చెప్పేందుకు ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతీకార దాడులు విజయవంతంగా నిర్వహించిన భారత్ ఆర్మీకి భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు సెల్యూట్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పహల్గాంలో అమా యకులైన పర్యాటకులపై టెర్రరిస్టులు దాడి చేసి 26 మందిని తమ కుటుం బసభ్యుల ముందే కిరాతకంగా విచక్షణా రహితంగా కాల్చి చంపడానికి ప్రతీకారంగా భారత్ ఎయిర్ ఫోర్స్, బార్డర్ లైన్‌కు వంద కిలోమీటర్ల లోపు ఉన్న ఉగ్రవాద క్యాంపులే టార్గెట్‌గా పాక్ లోని 4, పిఒకే లోని 5 ఉగ్రవాదుల స్థావరాలపై బుధవారం అర్ధరాత్రి మెరుపు దాడి చేసి టెర్రరిస్ట్ అడ్డాలను, మౌళిక సదుపాయాలను సైతం ధ్వంసం చేసి, దుండగులను హతమార్చి తగిన బుద్ధిచెప్పడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ టెర్రరిస్టుల పెంచి పోషించే దుష్ట బుద్ధిని విడనాడాలని లేనిచో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దేశానికి ఇంకా ప్రమాదం పొంచి ఉన్నందున బార్డర్ ప్రాంతాలలోని ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటాం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ప్రజాపక్షం/పరకాల: కాంగ్రెస్ నిర్మాణంతోపాటు కార్యకర్తలను కాపాడుకుంటామని, త్వరలోనే గ్రామ మండల బ్లాక్ అధ్యక్షులను పూర్తిస్థాయిలో నియమిస్తామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన నిర్వహించిన పరకాల నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమా వేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, టిపిసిసి అబ్జర్వర్లు మస్కుద్ అహ్మద్ అమీర్ అలీ ఖాన్, టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మాటి సాం బయ్య, ఎఐసిసి ఎస్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, టిపిసిసి ప్రధాన కార్య దర్శి కూచన రవళి పాల్గొన్నారు. రేవూరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి బలంగా తీసుకవెళ్ళాలని భావిస్తోంద న్నారు. సం స్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీకి డోకా ఉండదని భావిస్తున్న పార్టీ పెద్దలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. 20 నాటికి డీసీసీ అధ్యక్షులను, మే నెలాఖరు వరకు గ్రామ, మండల, బ్లా క్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేసేందుకు జిల్లాకు ఇద్దరు పిసిసి పరిశీలకులుగా వ చ్చారన్నారు. 2017 నుంచి పార్టీ మారని వారికే అవకాశంకల్పించాలని అధిష్టానం సూచించారని, గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తయిన తర్వాత ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, ఇతరత్రా అంశాల గురించి విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

## కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

### తెలుగును కాపాడుకుందాం

### చర్చాగోష్టిలో పలువురు కవులు, రచయితలు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : శ్రీ రాజ రాజ నరేంద్రాంధ్ర భాషానిలయంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో తెలుగు భాషను సంరక్షించే దిశగా చర్చాగోష్టిని కవులు, రచయితలు, తెలుగు భాషాభి మానులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, విమర్శకులు, విశ్రాంత ప్రధానాచార్యులు అచార్య బన్న అయిలయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్యలో రెండవ ఐచ్ఛికంగా సంస్కృతాన్ని తీసుకోవాలని బోర్డు జారీ చేసిన ఉత్తర్వు తెలుగు భాషను ఇంటర్మీడియట్ విద్యలో లేకు ండా చేసే కుట్రగా భావిం చాలన్నారు. తెలుగు భాషా స్థానంలో తెలుగేతర భాషలను ప్రవేశ పెట్టి తెలుగు భాషా వికాసాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలలో తెలుగు మాట్లాడేవారు చాలా మంది ఉన్నారని, దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారని గుర్తు చేస్తూ ఇటువంటి భాషను పాలకులు నిర్లక్ష్యం చేయడం విచారకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ మాతృ భాష మృత భాష కాకూడదని అది అమృత భాష అని, దీనిని కాపాడుకోవలిసిన బాధ్యత అందరిదని అన్నారు.ప్రజా పాలనకు సంబంధించిన సంక్షేమపథకాలు ప్రజలలోకి చేరవేసే వాహిక సరళమైన సాహిత్యం, పాటల రూపంగా తెలుగులోనే ప్రజలవద్దకు చేరుతుందని, అట్లాంటి తెలుగు భాషను కాదని సంస్కృత భాషను ప్రవేశపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కవులు, రచతలు, తెలుగు భాషాభిమానులతో చర్చాగోష్టి నిర్వహించి పలు ప్రతిపాదనలను ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమంలో గిరిజామనోహర్ బాబు, నాగిళ్ళ రామశాస్త్రీ, బిల్ల మహేందర్, పి. చందు, విఆర్ విద్యార్థి,దహగం సాంబమూర్తి, డా. మంథని శంకర్. డా.లగడపాటి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## కమ్యూనిస్టు జెండా కష్టజీవుల అండ

### సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: నేడు దేశంలో కష్టజీవుల రక్షణకు ఎర్రజెండా ఉందని అటువంటి ఎర్రజెండాను విస్తరించాలని ఎర్రజెండా ప్రజలకు భరోసా ఇస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం నర్మెట మండల మహాసభలో గజ్జల్లి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన మహాసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పాతూరి సుగుణమ్మ హాజరయ్యారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్య ఏర్పడిన చిచ్చును ఆర్పాలంటే కమ్యూనిస్టుల ఎర్రజెండాతో సాధ్యమవుతుందన్నారు. అనంతరం 15 మందితో నర్మెట మండల కమిటీని ఏకగ్రీవ ంగా ఎన్నుకోవడం జరిగింది. నర్మెట మండల కార్యదర్శిగా పాతూరి ప్రశాంత్‌రెడ్డిని రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోగా, సహాయ కార్యదర్శిగా మాలోతు సీతారాంని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి: జిల్లాలో ఐకెపి, పిఎసిఎస్ ల ద్వారా చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమ కొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఐకెపి, పిఎసిఎస్ ల ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై పౌర సరఫరాలు, డీఆర్డీఏ, సహకార, వ్యవసాయ, మార్కెటి ంగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరిపోను గన్నీ బ్యాగులు, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఏవైనా ఉన్నాయా, ఎక్కడైనా ధాన్యం తడిసిందా, టార్పాలిన్లు సరిపోను ఉన్నాయా, ధాన్యం అమ్మిన రైతులకు సకా లంలో పేమెంట్ జరుగుతుందా అని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ధాన్యం తరలింపులో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లారెవెన్యూ అధికారి గణేష్, జిల్లా గ్రామీణ అభి వృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, డీపీఎం పాల్గొన్నారు.

### పెస్టిసైడ్స్ డీలర్లు మునపటి లాగానే ముందుకు సాగాలి

### పెస్టిసైడ్స్ డీలర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాపక్షం/హనుమకొండ: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల అ మ్మకాలలోవరంగల్ జిల్లాకు మంచి పేరు ఉందని, ఇదే విధానంలో విత్తన, ఎరువులు, పెస్టిసైడ్స్ డీలర్లు ముందుకు సాగాలని హను మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీడ్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ డీలర్స్, వివిధ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాణ్యమైన విత్తనాలు, ఎరువుల విక్రయాలు చే యాలని, నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనా లు, ఎరువులు విక్రయించినట్లయితే చట్ట ప్రకారం డీలర్లపై తీసుకునే కఠిన చర్యలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విత్తన, ఎరువుల డీలర్లు దుకాణదారులకు వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఒక్క రైతు కూడా నష్టం రావొద్దని, సీజన్‌లో ఎక్కడ కూడా విత్తన ఎరువులు పు రుగు మందులకు కొరత, ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని డీలర్లకు తెలియజేశారు. పలువురు డీలర్లకు ఇపాస్ మిషన్లను కలెక్టర్ చేతుల మీ దుగా అందజేశారు.సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, సతీష్ బాబు, అధికారులు, సీడ్,పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్లు, వివిధ కం పెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశించిన స్థాయిలో పుష్కర పనులు ఏవీ?

### దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావు అసంతృప్తి



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం: సరస్వతీ పుష్కరాలు సమీపిస్తున్న పుష్కర పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పనులు సకాలంలో పూర్తి చేయకపోతే కఠిన చర్యలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని దేవాదాయ, ధర్మాధాయి శాఖ కమిషనర్ వెంకట్రావు అధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ప్రతి రోజు మూడు షిఫ్టులలో 24 గంటలు పుష్కర పనులు జరగాలని ఆయన ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విఐపి ఘాట్,గోదావరి ఘాట్, టెంట్ సిటీ, గోదావరి హారతి ప్రాంతం, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు ప్రాంతం, పుష్కర స్నానాల ప్రాంతం, 100 గదుల సత్రం, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లను ఆయన క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాలు ప్రారంభం కావడానికి ఇంకా వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నాయని, ఏర్పాట్ల విషయంలో రేపు, మాపు అనే పదం రాకుండా ప్రతి రోజును చాలా ముఖ్యంగా భావించి పనులకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సరస్వతి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఈ ప్రాధాన్యతను గుర్తించి పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పుష్కరాల ఏర్పాటు పనులను అడిగి తెలుసుకున్నారని,అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారని తెలిపారు. పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీకిరణ్ ఖరే మాట్లాడుతూ, సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రులు దిశానిర్దేశం చేసారని, సరస్వతి పుష్కరాలు మన రాష్ట్ర పండుగని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ శాఖ ఆర్జేసి రామ కృష్ణారావు, ఇరిగేషన్, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, దేవాదాయ,విద్యుత్తు, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్డీఓ, సమాచార శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి




ప్రజాపక్షం/వరంగల్ లీగల్ : నానాటికి పెరుగుతున్న నేరాలు, మోసాల సమాజంలో న్యాయమూర్తులు సామాజిక దృక్పథంతో ఉండాలని, త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణలు అన్నారు. ఇటీవల వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి న్యాయమూర్తులుగా ఎన్నికైన గంగిశెట్టి ప్రసీద, ధారా సాయి మేఘన, అంబటి ప్రణీత లకు వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో వారికి అభినందలు తెలిపి శాలువాలతో సత్కరించి మెమంటోలు ఇచ్చి సన్మానం చేశారు. పలువురు న్యా యవాదులు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిపై మక్కువతో ఎంతో కష్టపడి చిన్న వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎన్నికవడం గొప్ప విషయమని, దేశంలోనే వరంగల్ బార్ న్యాయవాదులకు ఘనమైన చరిత్ర ఉందని, ఇక్కడ పని చేసి న ఎందరో న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉన్నత శిఖరాలకు ఎదిగారని అలాంటి చరిత్రను నూతనంగా ఎదిగిన న్యాయవాదులు నిలబెట్టాలని, బాధితులకు అండగా త్వరితగతిన న్యాయమూర్తుల తీర్పులు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు డి.రమాకాంత్, కొత్త రవి, బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శశిరేఖ, సీనియర్ న్యాయవాదులు అంబరీష్‌రావు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఆదర్శప్రాయుడు లక్ష్మీనారాయణ

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడిన సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి చింతనిప్పు లక్ష్మీనారాయణ ఆదర్శప్రాయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిధిలోని చిన్నమునగాలలో బుధవారం లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతు పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషిచేశాడని కొనియాడారు. పార్టీ విస్తరణే లక్ష్య ంగా పనిచేస్తున్న ఆయనను ఎదుర్కొనలేక కొంతమంది ఆయనను అక్రమంగా హత్యానేరం కేసులో ఇరికించడంతో రెండు సంవత్సరాలు జైలుజీవితం సైతం గడిపారని తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిదండిసురేష్,జిల్లా నాయకులు,సొసైటి చైర్మన్,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య ఇల్లందు గెస్ట్ హౌస్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజపేట, విఠల్‌రావు నగర్ సింగరేణి ఎఫెక్ట్ ఏరియా గ్రామస్తులను తీసుకెళ్లి సమస్యలను మంత్రిగారి దృష్టికి వివరించారు. మణుగూరు మండలంలోనిగ్రామాలు సింగరేణి ఎఫెక్ట్ ఏరియాతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మణుగూరు ఓసి ఎఫెక్ట్ ఏరియాతో ఇప్పటికే ప్రతి రోజు సింగరేణి బ్లాస్టింగ్ తో ఇళ్ళు దెబ్బతిన్నాయని, దుమ్ము ధూళి ఇండ్ల మీద పడడం, చెట్ల మీద పడడంతో మంచినీరు కూడా కాలుష్యం అయి పోయిందని, ప్రతి రోజు గ్రామాలలో ఏదో ఒక సమస్యతో వ్యక్తి ప్రజల రోగాల బారిన పడి ఆసుపత్రిలో పాలవుతున్నారని , ఒక కిలోమీటర్ దూరం నుంచే బ్లాస్టింగ్ జరిగితే ఇండ్లు ఊగిపోతున్నాయని, అలాంటిది 50 మీటర్ల దూరంలో బ్లాస్టింగ్ జరిగితే మేము ఎలా నివసించగలమని, కావున తమరు సంబంధిత కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాకు కూడా పరిహారం ఇప్పించి, మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి, మాకు న్యాయం చేయగలరని సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, మాజీ ఎంపిపి , గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ కన్వీనర్‌గా మండల వాసి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ కన్వీనర్‌గా మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు కోన చంద్రశేఖర్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడుపువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లకు చంద్రశేఖర్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.

## సత్యనారాయణ మృతి కాంగ్రెస్‌కి తీరని లోటు

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావిద్



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** గంగారం మాజీ సర్పంచ్ సత్తుపల్లి నియోజక వర్గ జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచమళ్ల సత్యనారాయణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జావిద్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నగర కాంగ్రెస్ పార్టీ తరుపున సంతాపం ప్రకటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

## ఆక్రమదారులను తొలగించి న్యాయంచేయాలని తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెం బిసి కాలనీకి చెందిన సయ్యద్ రిజ్వాన తన నివాస గృహాన్ని కూల్చివేసి ఆక్రమించిన ఆక్రమదారులనుతొలగించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు సిపి(ఐ)ఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మన్నే ఉషాశారదకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ మండల కేంద్రం ఎర్రుపాలెం బిసి కాలనీలో సయ్యద్ రిజ్వాన గత కొన్ని సంవత్సరాల నుండి నివాసముంటుందని తెలిపారు. గత కొన్ని నెలల క్రితం భార్యాభర్తలకు మనస్పర్థలు కలిగి రిజ్వాన తన పిట్టింటికి వెళ్లగా వారు లేని సమయాన్ని చూసి ఇంటిని కూల్చి వేసి ఆక్రమించుకున్నారని, ఆక్రమణదారులను వెంటనే తొలగించి రిజ్వానకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు, గొల్లపూడి పెద్దకోటేశ్వరరావు, నల్లమోతు హన్మంతరావు, దూదిగం బసవయ్య, బాధితురాలి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణిదీపాలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణిదీపాలని ఆడ పిల్లల సంరక్షరణ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలం జింకలతండా గ్రామంలో బేగం కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు ఆడ పిల్లలను పుట్టనిద్దాం ... పెరగనిద్దాం అనే నినాదంతో ముగ్గులు వేసి కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. బేగం షరీఫ్ దంపతులకు 25 మార్చి 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి వారి ఇంటికి వచ్చిన కలెక్టర్ పాప తల్లిదండ్రులతో కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్ సర్టిఫికెట్స్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలే ఇంటికి మణిదీపాలని ప్రస్తుత యుగంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్న మహిళలు ఏ రంగంలో తక్కువ కాదని నిరూపిస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టిన జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి మంచి సందేశం అందించాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖాధికారి , రఘునాథపాలెం మండల తహసీల్దార్, ఎంపిడిఒ , అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో మంత్రి సుడిగాలి పర్యటన

- ❋పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ❋ సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో మధ్యాహ్న భోజనం
- ❋ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ❋ అర్హుల చెంతకే ప్రభుత్వ పథకాలు మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/భద్రాచలం:** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఏజెన్సీ ప్రాతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ముందుగా చర్ల మండల పరిధిలోని సుబ్బంపేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయితీ కార్యాలయాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారుడు వాసం ముసలయ్య ఇంట్లో ఆయనతో పాటు పలువురు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనం చేశారు. అనంతరం చర్ల లక్ష్మీకాలనీలో రూ.1కోటి 16 లక్షలతో వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అదే విధంగా తేగడలో ఇందిరమ్మ ఇళ్లకు శంకు స్థాపన చేశారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని చిన్నబండిరేవు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి సిసి రోడ్డును ప్రారంభించారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని సింగవరంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా భద్రాచలం మండల పరిధిలోని చర్లరోడ్‌లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తాతగుడి సెంటర్‌లోని గ్రంథాలయ భవన సముదాయంలో ఐటిడిఎ నిధులతో నిర్మించిన రీడింగ్ హాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, ప్రజలకు ఇచ్చిన మాటలను తూచతప్పకుండా నిలబెట్టుకుంటుందని అన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మాయ చేసేందుకు కొందరు ఎదురు చూస్తున్నారని, అలాంటివారి మాటలు నమ్మొద్దన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 80 శాతానికి పైగా బడుగు బలహీన వర్గాలు, దళిత,గిరిజన, మైనార్టీ నిరుపేదలు లబ్ధిపొందుతున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపడతామని, లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ గృహాన్ని నిర్మించి ఇచ్చే బాధ్యత తనదే అని అన్నారు. ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని, రోడ్లు, డ్రైన్లు, తాగు,సాగు నీరు, విద్యుత్ వంటివాటిని నిరంతరం అందిస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకుని అనేక మంది చదువుకుంటున్నారని, వారు చదువుకునేందుకు మరింత సౌకర్యవంతమైన పరిస్థితులు తీసుకొచ్చేందుకు నూతన గ్రంథాలయాలను అన్ని హంగులతో అందుబాటులోనికి తెచ్చినట్లు చెప్పా రు. ఇది ప్రజా ప్రభుత్వం అని, ఈ ప్రభుత్వంలో ప్రతీ ఒ క్కరికీ న్యాయం చేకూరుతుందని చెప్పారు.



**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు**

రానున్న మూడు, నాలుగేళ్లలో రాష్ట్రంలోని పేదలందరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పినపాక మండల పరిధిలోని గొట్టెల గ్రామానికి చెందిన ఇర్ఫా లక్ష్మి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికిశంకుస్థాపన ఆయన చేసి, పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో 20లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే ధైర్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 3500 ఇల్లతో పాటు మరికొన్ని ఇండ్లను మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని అన్నారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎంఎల్‌ఎ తెల్లం వెంకట్రావ్, ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, బ్రహ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కోర్సా ఆనంద్, స్పెషల్ ఆఫీసర్ తాతారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, డిఎల్‌పిఓ సుధీర్‌కుమార్, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపిడిఒ సునీల్‌కుమార్, ఎంపిఒ వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య చరిత్రలో అరుదైన డెలివరీ,సర్కార్ వైద్యంపై నమ్మకం

మిడ్వైఫ్ సుజాత, పాల్వంచ వైద్య సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే కూనంనేని





**ప్రజాపక్షం/పాల్వంచ:** పేద వర్గాల ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు అభినందించి మరింతగా ప్రోచాహించాల్సిందేనని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదురు కళ్ళతో కవలలు ఉన్న పాల్వంచ మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన జూపల్లి పల్లవి అనే గర్భిణీకి వైద్య చరిత్రలోనే అరుదైనదిగా నార్మల్ డెలివరీ చేసి అబ్బుర పర్చారు. వైద్య చరిత్రలోనే ఇది నార్మల్ డెలివరీగా రికార్డు నమోదు చేసుకుంది. పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలలో చోటు చేసుకున్న ఈ అరుదైన డెలివరీపై బుధవారం స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డెలివరీ చేసిన మిడ్వైఫ్ సుజాత, ప్రసూతి వైద్యురాలు, డిసిహెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంఒ డాక్టర్ సోమరాజు దొరలను ఎమ్మెల్యే అభినందించారు.

**నీటి ఎద్దడి నివారణకు 8.92కోట్ల డిఎంఎఫ్టి నిధులు మంజూరు**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలనే లక్ష్యంతో స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు చేసిన కృషి ఫలించింది. కూనంనేని ప్రతిపాదన మేరకు నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారంకోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఫండ్ డిఎంఎఫ్టి ద్వారా రూ.8.92 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కారంకోసం రూ.2.92కోట్లు మంజూరు కాగా, చుంచుపల్లి మండలానికి రూ.1.70కోట్లు, సుజాతనగర్ మండలానికి రూ.1.40కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలానికి రూ.1.53కోట్లు, పాల్వంచ మండలానికి రూ.1.37కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో 71పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. డిఎంఎఫ్టి ద్వారా మంజూరైన రూ.8.92కోట్ల విలువచేసే పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామని, కాలకతీతంగా ప్రజలకు నీటిని అందించడమే లక్ష్యంగా ప్రణాళి కాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంజూరైన రూ.8.92 పనులు పూర్తయితే నియోజకవర్గంలో నీటి సమస్య ఉండదని కూనంనేని స్పష్టం చేశారు. నీటి సమస్య పరిష్కారంకోసం పెద్దమొత్తంలో నిధులు రాబట్టడం పట్ల కూనంనేని ప్రజల నుంచి హర్షం వ్యక్తం చేశారు.

## ఖమ్మంలో నలుగురు మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహా నలుగురు మంత్రులు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. రఘునాథపాలెం మండలం బల్లేపల్లి శివారులో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహిస్తారు.

## వెంకటేశ్వరుని దర్శనానికి మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఎర్రుపాలె:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శిస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 7.30గంటలకు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రానున్నట్లు , కాంగ్రెస్ శ్రేణులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కమ్యూనిస్టు పార్టీ వెంటే బడుగు, బలహీన వర్గాలు


సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** నియోజకవర్గ పరిధిలోని దళిత, గిరిజన కాలనీలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, అయన కృషికి సహకారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణపరిధిలోని పాత కొత్తగూడెం ఎస్సి కాలనీ పార్టీ శాఖా సమావేశం నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గ్రామాలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులకె పేదలు కష్టాలు తెలుసని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీ వెంటే పేద, బడుగు, బలహీన వర్గాలు ఉంటారని, పార్టీకి వారే బలమన్నారు. సమస్యలను గుర్తించి చైతన్యవంతమైన ఉద్యమాలు, పోరాటాలు చేయడం ద్వారానే పరిస్కారం లభిస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో భవాని, కిలారు ప్రసాద్, కళ్లకుల భాస్కర్, నాగేందర్, రామారావు, బండి మంగ, గుర్రం వెంకటేశ్వర్లు, అంజి, జ్యోతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన అన్నదాతలు

తహసీల్దార్ హామీతో రాస్తారోకో విరమించిన రైతులు




**ప్రజాపక్షం/ తల్లాడ:** అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. తల్లాడ మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలలతో కూడిన అకాల వర్షంతో అపార నష్టాన్ని మిగిల్చింది. మండలంలో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. ప్రభుత్వం తమ ధాన్యాన్ని ఖరీదు చేయాలని, గన్ని సంచులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తల్లాడ కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యం వల్లనే పంట నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, గన్ని సంచులు, పరదాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. గత నెలరోజులుగా రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోసుకుని నానా తంటాలు పడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులుమాయ మాటలతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోలు వేగవంతం చేయాలని, లేనిపక్షంలో రహదారులను దిగ్బంధించి వంటవార్పు కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్ అక్కడికి చేరుకుని రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 20వేల గన్ని సంచులు, నాలుగు లారీలు బుధవారమే పంపిస్తామని, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకోను విరమించారు. మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

# జోరుగా ఐపిఎల్ బెట్టింగ్‌లు..

వేల రూపాయలు చేతులు మారుతున్న వైనం

ఐపిఎల్ బెట్టింగ్‌ల్లో చిత్తవుతున్న యువకులు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** క్రీడల్లో ఎంతో ప్రాముఖ్యతను చాటుకున్న క్రికెట్ క్రీడ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు క్రికెట్ పోటీలకు ఆసక్తి చూపుతున్నాయి. క్రికెట్ పోటీల్లో భారత యువకులు రాణించేందుకు ప్రభుత్వాలు ఎన్నో కోచింగ్ సెంటర్లు పెట్టి యువకులను క్రీడల వైపు మళ్లిస్తుంటే కొందరు క్రికెట్ పోటీల పేరుతో బెట్టింగ్‌లకు తెర లేపుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేంవత్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహం కల్పిస్తూ యువతీ యువకులను ప్రోత్సహిస్తుంది. దేశవ్యాప్తంగా మార్చి 22న మొదలైన ఐపిఎల్ టి20 క్రికెట్ పోటీల్లో ప్రపంచంలోని అన్ని దేశాల నుండి క్రీడాకారులు ఆడుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో యువకులు ఐపిఎల్ టి20లో ఆడే జట్లపై ఆన్‌లైన్ బెట్టింగులు పెట్టి మోసపోతున్నారు. ఇటీవల కూసుమంచి మండలంలో చేగమ్మ గ్రామంలో యువకుడు ఐపిఎల్ బెట్టింగ్‌తో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. గత సంవత్సరం ఐపిఎల్ బెట్టింగ్‌లో పిండిప్రోలు గ్రామానికి చెందిన ఓ యువకుడు రూ.5లక్షలు నష్టపోయినట్లు తెలిసింది. మండలంలో ఎక్కువగా మాదక ద్రవ్యాలకు, మద్యానికి, గంజాయికి బానిస అవుతూ ఐపిఎల్ బెట్టింగ్ జూదానికి కాలు దువ్వుతున్నారు. మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, మేడిదేపల్లి, కాకరవాయి, బీరోలు, బచ్చోడు, కొక్కిరేణి, తిరుమలాయపాలెంతో పాటు పలు గ్రామాల్లో ఐపిఎల్ క్రీడలకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్నట్లు సమాచారం. పోలీస్ నిఘా వ్యవస్థ ఐపిఎల్ బెట్టింగులకు అడ్డుకట్ట వేయాల్సి ఉండగా వారు పట్టించుకోకపోవడంతో యువకులు ఆన్‌లైన్ బెట్టింగుల్లో వేల రూపాయలు నష్టపోతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నివారించాలని యువకుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ముదురుతున్న ఇందిరమ్మ ఇండ్ల లొల్లి

వారు ఓకే అంటేనే ఇండ్లు

సర్కార్ నిబంధనలకు తూట్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామాల్లో ఇందిరమ్మ ఇం డ్లపై లొల్లి రోజు రోజుకు ముదురుతుంది. ఇందిరమ్మ గ్రామ కమిటీలు సిఫారసు చేసిన పేర్లను సైతం పట్టించుకోవడం లేదని అధికారులకు పార్టీ నాయకులు ఇచ్చిన జాబితాలో ఉన్న పేర్లకే అవకాశం లభించనుందన్న నేపథ్యంలో నేతల చుట్టూ కొందరు తిరుగుతుండగా మరి కొందరు అధికారులను నిలదీస్తూ తమను ఎందుకు లబ్ధిదారులుగా ఎంపిక చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. మొదట ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఎల్1, ఎల్ 2, ఎల్ 3 పద్ధతిలో ఎల్ 1లో ఉన్న వారికి తొలి దశలో ఎల్ 1 జాబితాలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని చెప్పినప్పటికీ ఇప్పుడు ఆ మాటలకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. ఎల్1, ఎల్2, ఎల్ 3 అనేవి లేకుండా కొందరు నేతల సిఫారసుతో జాబితాలను రూపొందిస్తున్నారని ఇందులో అనర్హులకు చోటు దక్కుతుందని ఆరోపణలు వినవస్తున్నాయి. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యతనిస్తామని ప్రభుత్వం చెప్పడంతో పాటు ఆదాయాన్ని, ఆస్తులను పరిగణలోకి తీసుకుంటామని చెప్పిన మాటలు క్షేత్రస్థాయిలో బేఖాతార్ అవుతున్నాయి.ఇదిలా ఉండగా గ్రామాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. అధికారులు పరిశీలనకు వెళ్లినప్పుడు నిలదీతలు ఎక్కువవుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేయడం, అధికారుల వాహనాలను అడ్డుకోవడం, మండల కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించడం తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి పునరాలోచన చేసి నిరుపేదలకే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

# క్రీడ

## మీ స్టేడియాన్ని పేల్చేస్తాం..

### అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియానికి బెదిరింపులు!



పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్ బుధవారం పీవోకేలోని తొమ్మిది ఉగ్రమూకలను ధ్వంసం చేసింది. దాంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈక్రమంలోనే గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. స్టేడియాన్ని బాంబులతో పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించారు. ఉత్సాహంగా ఐపీఎల్ కొనసాగుతున్న వేళ బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఈ క్రమంలో పాక్ పేరుతో ఈ మెయిల్ బెదిరింపులో రాగా.. భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. 'ఆపరేషన్ సిందూర్' పరిణామాల తర్వాత పాక్ పేరుతో హెచ్చరికలు రావడంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ అధికారిక ఈమెయిల్ ఐడీకి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు వచ్చినట్లుగా విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నారు. తాము మీ స్టేడియాన్ని పేల్చేస్తామంటూ హెచ్చరికలు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బెదిరింపులను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. గుజరాత్ పోలీసులు, సైబర్ క్రైమ్ నిపుణుల బృందం బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడి నుంచి పంపారో తెలుసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఐపీఎల్‌లో రెండు కీలకమైన మ్యాచులు రెండురోజుల్లో జరగనున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం స్టేడియం పరిసర ప్రాంతాలతో పాటు, స్టేడియంలోనూ భారీ భద్రతను పెంచారు.

## టెస్టులకు హిట్‌మ్యాన్ రిటైర్‌మెంట్!



భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నది. టెస్టులకు రిటైర్మెంట్ పలికాడు. ఇటీవల కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బందులుపడుతున్న హిట్‌మ్యాన్ చివరకు టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్.. ఇకపై వన్డేల్లో కొనసాగనున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే టెస్టు సిరీస్ వరకు బీసీసీఐ కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్నది.



## మెరిసిన రహానె, రస్సెల్

### చెన్నై సూపర్ కింగ్స్ టార్గెట్ 180

ఐపిఎల్ 2025లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరుగుతున్న మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ఓపెనర్ రహ్మానుల్లా (11) త్వరగానే నిష్క్రమించగా.. సునీల్ నరైన్ (26; 17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా.. ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కెప్టెన్ అజింక్య రహానె (48; 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఆండ్రీ రస్సెల్ (38; 21 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. మనీశ్ పాండే (36; 28 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. రఘువంశీ (1), రింకు సింగ్ (9) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. నరైన్, రహానె రెండో వికెట్‌కు 58 పరుగులు, రస్సెల్, మనీశ్ పాండే ఐదో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పారు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (4/31) మెరిశాడు. అన్షుల్ కాంబోజ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

## సౌతాఫ్రికాపై విజయం..

## ఫైనల్‌కు భారత్



**కొలంబో:** శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్‌కు చేరింది. బుధవారం సౌతాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిన సౌతాఫ్రికా.. శ్రీలంకతో జరగాల్సి ఉన్న సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో గెలిచినా ఫైనల్‌కు చేరదు. ఆదివారం జరగనున్న ఫైనల్‌లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. జేమిమా రోడ్రిగ్స్ (123; 101 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ బాదేసింది. దీప్తి శర్మ (93; 84 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం అవకాశాన్ని చేజార్చుకుంది. స్మృతి మంధాన (51; 63 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ శతకం చేసింది. భారీ లక్ష్యఛేదనలో సౌతాఫ్రికా పోరాడి ఓడింది. 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది. అన్నరీ డెర్క్సెన్ (81; 80 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్లో ట్రయాన్ (67; 43 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించారు. మియాన్ స్మిత్ (39), నొందుమిసో షాంగసే (36), తజ్మిన్ బ్రిట్స్ (26), నాడిన్ డి క్లర్క్ (22), సినాలో జాఫ్తా (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్ 3, దీప్తి శర్మ 2... శ్రీ చరణి, ప్రతీకా రావల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# రీల్


## ఆ ఉంగరం, చేప ఏమయ్యాయి?

### చిరంజీవితో రామ్‌చరణ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన ఎన్నో వండర్ ఫుల్ హిట్ చిత్రాల్లో దర్శకేంద్రుడు కే రాఘవేంద్రరావు తెరకెక్కించిన ఫాంటసీ వండర్ చిత్రం జగదేక వీరుడు అతిలోక సుందరి కూడా ఒకటి. తెలుగు ఆడియెన్స్ ఎప్పటికీ మర్చిపోలేని ఈ సినిమా ఇపుడు ఫైనల్ గా 35 ఏళ్ళు తర్వాత రీరిలీజ్ కి వస్తుంది. అది కూడా 3డిలో వస్తుంది. మరి ఈ రీరిలీజ్ కోసం మళ్ళీ మెగాస్టార్ మరియు నిర్మాత అశ్వినీదత్ లు తమ మార్క్ ప్రమోషన్స్‌ని గతంలో 'ఇంద్ర'కి చేసిన రీతిలోనే చేస్తుండగా లేటెస్ట్‌గా ఓ క్రేజీ ప్రోమో వదిలారు. మరి ఇందులో మెగాస్టార్ తన మార్క్ ఎనర్జీ, టైమింగ్‌తో అదరగొట్టగా లాస్ట్‌లో మెగాస్టార్ వారసుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా ఇందులో సర్ప్రైజ్ చేయడం జరిగింది. అయితే ఇందులో తాను జగదేక వీరుడు క్లైమాక్స్ కోసం మాట్లాడ్డం ఆసక్తిగా మారింది. పార్ట్ 2కి ఉన్న స్కోప్‌పై తాను మాట్లాడ్డం జరిగింది. చివరిలో ఉంగరం దానిని మింగిన చేప ఏమయ్యాయి అంటూ చరణ్ చెప్పడంతో జగదేక వీరుడు పార్ట్ 2 పై ఆశలు చిగురించినట్టు అయ్యిందని చెప్పాలి. ఇక ఈ ఫుల్ ఇంటర్వ్యూ అయితే ఈ మే 8న రాబోతుండగా ఇందులో పార్ట్ 2పై మరింత క్లారిటీ రావొచ్చు.

## 'కన్నప్ప' కోసం విష్ణు మంచు గ్లోబల్ ప్రమోషన్స్!



డైనమిక్ స్టార్ విష్ణు మం చు తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'ను ఓ మైలు రాయి చిత్రంగా మలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మార్కెట్‌ను స్టడీ చేస్తూ గ్లోబల్‌గా ప్రమోట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. విష్ణు మంచు నటించిన ఈ హిస్టారికల్ మూవీ ప్రమోషన్స్‌ను అమెరికా నుంచి ప్రారంభించబోతున్నారు. కన్నప్ప USA టూర్ మే 8న న్యూజెర్సీలో ప్రారంభం కానుంది. అక్కడ విష్ణు నార్త్ బ్రున్స్‌విక్‌లోని రీగల్ కామర్స్ సెంటర్‌లో అభిమానులతో ముచ్చటించనున్నారు. మే 9న డల్లాస్‌కు బయలుదేరి వెళ్లి సాయంత్రం 7 గంటలకు గెలాక్సీ థియేటర్స్ గ్రాండ్‌స్కేప్, ది కాలనీ, టెక్సాస్‌లో ప్రేక్షకులతో సందడి చేయనున్నారు. ఈ పర్యటన మే 10న శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియాలో ముగుస్తుంది. అక్కడ ఆయన ఉదయం 10:30 గంటలకు సినీ లాంజ్ ఫ్రీమాంట్ 7 సినిమాస్‌ను సందర్శిస్తారు. ఈ చిత్రం ఓవర్సీస్ విడుదలను వాసారా చూసుకుంటోంది. అనంతరం ఇండియాకు తిరిగి రానున్న విష్ణు.. దేశంలోని పలు నగరాల్ని చుట్టి రానున్నారు.ఆధ్యాత్మిక తీర్థయాత్రలు, అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడానికి, అన్ని ప్రాంతాల మీడియాతో విష్ణు మంచు ఇంటరాక్ట్ కానున్నారు. 'కన్నప్ప' నుంచి వచ్చిన భక్తి గీతం శివా శివా శంకరా విడుదలైనప్పటి నుంచి పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని లవ్ ట్రాక్ కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అందరి దృష్టి కన్నప్ప ట్రైలర్‌పై ఉందన్న సంగతి తెలిసిందే. ట్రైలర్ రిలీజ్‌తో ఒక్కసారిగా అంచనాలు ఆకాశాన్నంటుతాయి. జూన్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ ఇలా పలు భాషలలో 'కన్నప్ప' చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

## 'కింగ్‌డమ్'కి లైన్ క్లియర్!



మన టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన అవైటెడ్ భారీ చిత్రమే కింగ్‌డమ్. విజయ్ నుంచి ఒక సాలిడ్ స్పై యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా నుంచి రీసెంట్‌గా వచ్చిన సాంగ్ మంచి హిట్ అయ్యింది. ఇక ఈ సినిమా విడుదల పవన్ వీరమల్లు ఎఫెక్ట్‌తో అటు ఇటుగా ఉందని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. కింగ్‌డమ్ అనుకున్నట్లుగా మే 30నే రాబోతుందట. హరిహర వీరమల్లు ప్రస్తుతానికి ఇంకా డేట్ లాక్ చేసుకోకుండా ఉండడంతో కింగ్‌డమ్ అనుకున్న సమయానికే వస్తుంది అని ఇపుడు టాక్.

## ఫుల్ స్వింగ్‌లో శ్రీవిష్ణు..



మన టాలీవుడ్‌లో ఉన్నటువంటి టాలెంటెడ్ అండ్ వెర్సటైల్ యంగ్ హీరోస్‌లో శ్రీవిష్ణు కూడా ఒకరు. రీసెంట్ చిత్రం 'స్వాగ్' మూడు డిఫరెంట్ షేడ్స్‌ని అద్భుతంగా పండించిన శ్రీవిష్ణు ఇపుడు సింగిల్ సినిమాతో ఎంటర్టైన్ చేసేందుకు రాబోతున్నాడు. అయితే తన నుంచి రానున్న రోజుల్లో మరిన్ని సాలిడ్ ప్రాజెక్ట్‌లు అది కూడా దేనికదే సెపరేట్ కాన్సెప్ట్ లతో అలరించే విధంగా ప్లాన్ చేసుకుంటున్నాడు. మరి తన నెక్స్ట్ మూడు సినిమాలు కూడా ఇంట్రెస్టింగ్ జానర్స్‌లో రాబోతున్నాయి. తెలుగు ఆడియెన్స్‌కి ఎంతో ఇష్టమైన అమృతం సీరియల్ దర్శకుడు గుణ్ణం గంగరాజు బ్యానర్‌లో 'మృత్యుంజయ' అనే సినిమా చేస్తుండగా ఇది ఆల్రెడీ 30 రోజులు షూటింగ్ కూడా కంప్లీట్ అయ్యిందట. ఇక ఈ చిత్రం కాకుండా ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ని తాను ప్లాన్ చేస్తుండగా ఇవి కాకుండా ఒక ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో సినిమా చేయనున్నట్టుగా తెలిపాడు. ఇలా మొత్తం మూడు సినిమాలు తాను ప్లాన్ చేస్తుండగా ఇపుడు వస్తున్న సింగిల్ కాకుండా మిగతా మూడు చిత్రాలు వచ్చే ఏడాది వేసవి నాటికి రిలీజ్ అవుతాయని చెబుతున్నాడు. మరి మొత్తానికి మాత్రం శ్రీవిష్ణు ఇపుడు ఫుల్ స్వింగ్ లో కొనసాగుతున్నాడని చెప్పాలి.

## ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాల అక్రమ

# తరలింపు కట్టడి చేయాలి

> పాలమూరు-రంగారెడ్డి, సమ్మక- సారక్క ప్రాజెక్టులకు తక్షణమే నీటిని కేటాయింపులు చేయాలి
>
> కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌కు నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలోని పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు సమ్మకసారక్క ప్రాజెక్టుకు నీటి కేటాయింపుకు తక్షణమే చర్యలు తీసుకోవడంపాటు, ఆంధ్ర ప్రదేశ్ కృష్ణా జలాల అక్రమ తరలింపును ఆపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో బుధవారం జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించినీటి కేటాయింపు సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. అదేవిధంగా అంతర్‌రాష్ట్ర నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల భద్రత, పోలవరం ప్రాజెక్టు నుండి బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధించిన తదితర అంశాలను మంత్రి కేంద్ర జల సంఘం చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. కరువు ప్రభావిత జిల్లాలైన మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డితో పాటు నల్గొండ జిల్లాలోని సుమారు 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2015లో పాలమూరురంగా రెడ్డి ప్రాజెక్టు ప్రారంభించడం జరిగిందని చైర్మన్‌కు వివరించారు. ఈ పథకం 60 రోజుల వరద కాలంలో కృష్ణా నది నుండి రోజుకు 2 టిఎంసి నీటిని ఎత్తిపోయడానికి ఐదు పంపింగ్ స్టేషన్ల ఉపయోగించి ఈ ప్రాంతంలో నీటి కొరత, భూగర్భ జల క్షీణతను పరిష్కరించడానికి ప్రతిపాదించబడిందని, ఈ ప్రాజెక్టుకు గాను 90 టిఎంసిల నీటి కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మొదటి దశలో 45 టిఎంసిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు, తెలంగాణ ఇప్పటికే సిడబ్ల్యుసి నిర్దేశించిన విధానపరమైన అంశాలను పాటించడంతోపాటు డాక్యుమెంటేషన్ సమర్పించడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా ములుగు జిల్లాలోని తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్కసారక్క బ్యారేజీ, జె. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ (దశలు I అండ్ II) కింద దాదాపు 5.55 లక్షల హెక్టార్లకు నీటి పారుదలని స్థిరీకరించడానికి రూపొందించబడిందని మొత్తం 6.94 టిఎంసి సామర్థ్యంతో, ఈ బ్యారేజీ దాని మార్గంలో ఉన్న అనేక గ్రామాల తాగునీటి అవసరాలను కూడా తీరుస్తుందన్నారు. సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు 44 టిఎంసిల కేటాయింపును వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సిడబ్ల్యుసి చైర్మన్‌ను కోరారు. ఇందుకు సంబంధించి కూడా అన్ని పత్రాలను అందజేయడం జరిగిందని వివరించారు.

**కృష్ణా జలాలను ఎపి అక్రమంగా మళ్లించుకుంటోంది:**
కృష్ణా నది జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా మళ్లించుకుంటుందని, దీనిని అరికట్టేందుకు కీలకమైన ప్రదేశాలలో టెలిమెట్రీ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలని సిడబ్ల్యుసి చైర్మన్‌తో పాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చైర్మన్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న అతుల్ జైన్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించి తెలంగాణ తెలంగాణ ఇప్పటికే తన ఆర్థిక వాటాను కృష్ణా నది నిర్వహణ బోర్డు (కెఆర్ఎంబి)కి విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా చైర్మన్‌కు మంత్రి గుర్తు చేశారు. మరో ప్రధాన అంశమైన పోలవరం ప్రాజెక్ట్ నుండి బ్యాక్ వాటర్ కారణంగా తెలంగాణలో భద్రాచలంతో పాటు పలు ప్రాంతాలు ముప్పుకు గురువుతున్నాయని చైర్మన్ దృష్టికి తెచ్చారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలపై బ్యాక్ వాటర్ ప్రభావాలను మళ్లీ పరిశీలించడంతోపాటు ఆయా ప్రాంతాలు ముంపునకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టేలా ఆంధ్రప్రదేశ్‌కు సిఫార్సు చేయాలని కోరారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు సిడబ్ల్యుసి సహకారం అందించాలి**
కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్ఐఎస్) పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) ఇటీవల ఇచ్చిన నివేదికను ఉత్తమ్ కుమార్ రెడ్డి సిడబ్ల్యుసి చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నివేదిక మొత్తం ప్రాజెక్టు నిర్మాణం, డిజైన్ లోపం కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే పరిమితం కాకుండా అన్నారం, సుందిల్ల బ్యారేజీల సంబంధించి కూడా తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తిందని మంత్రి వివరించారు. ఎన్‌డిఎస్ఎ తన సాంకేతిక తనిఖీల తర్వాత, కాళేశ్వరం ప్రాజెక్టు కొనసాగింపులో భాగంగా భద్రతను అంచనా వేయడానికి సిడబ్ల్యుసి సాంకేతిక సలహా పర్యవేక్షణను కోరాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని మంత్రి ఉత్తమ్ కుమర్‌రెడ్డి వివరించారు. ఇసుక పైపింగ్, ఫౌండేషన్ అస్థిరత, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రాజెక్ట్ యొక్క కొన్ని భాగాలలో కోలుకోలేని నష్టం జరిగిందని తెలిపారు.. ఎన్‌డిఎస్ఎ సిఫార్సుల మేరకు సమగ్ర జియోటెక్నికల్, స్ట్రక్చరల్ సమీక్ష నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో సిడబ్ల్యుసి కలిసి పనిచేయాలని, ప్రాజెక్ట్ పునరుద్ధరణ,రక్షణ కోసం దిద్దుబాటుకు సంబందించి తగినసలహాలు సూచనలు ఇవ్వాలని చైర్మన్ అతుల్ జైన్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి సిడబ్ల్యుసి చైర్మన్ అతుల్ జైన్ సానుకూలంగా స్పందించారని, తెలంగాణ ప్రభుత్వం చేసిన అన్ని విజ్ఞప్తిలపై సిడబ్ల్యుసి తక్షణమే వెంటనే చర్య తీసుకుంటుందని హామీ ఇచ్చారని తెలిపారు.



## సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నట్లుగా దృశ్యాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. డిఆర్‌డిఎ సమీపంలోని ఓ కాలనీలోని 24 అంతస్తుల భవనంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. అక్కడ ఫైరింజన్లను మోహరించారు. మొత్తంగా 12శాఖల అధికారుల సమన్వయంతో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటివారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై అవగాహన కల్పించారు. మరోవైపు, విశాఖలోని పాత పోస్ట్ ఆఫీస్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు.

## ప్రణాళిక ప్రకారం నిర్దేశిత

# లక్ష్యాలు ధ్వంసం చేశాం

### రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ పేరుతో ఒక ప్రణాళిక ప్రకారం నిర్దేశిత లక్ష్యాలను ధ్వంసం చేశామని రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఖచ్చితత్వంతో ఉగ్రవాద శిబిరాలను మాత్రమే ధ్వంసం చేశామన్నారు. భారత సైనిక దళాలు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయానికి దాడులు ప్రారంభించి 25 నిమిషాల వ్యవధిలో తొమ్మిది ప్రాంతాలలో లక్ష్యాలను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని పూర్తిచేశాయని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై ఈ దాడులు చేసినట్లు చెప్పారు. ''ప్రతీకారదాడిహక్కును ఉపయోగించుకుని బాగా లోతుగా ఆలోచించి లెక్కప్రకారం ఈ దాడులు చేశాం, పహల్గామ్‌లో దాడికి ప్రతీకారంగా ఈ దాడులు జరిగాయి, పహల్గామ్‌లో అమాకులైన 26 మంది సామాన్యులను చంపినవారిని మాత్రమే మేం మా దాడుల ద్వారా హతమార్చాం'' అని చెప్పారు. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలో సరిహద్దు రహదారి సంస్థకు చెందిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా బుధవారం నాడు రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ పైవిషయాలు చెప్పారు. ఉగ్రవాదుల మనోధైర్యాన్ని దెబ్బతీశామని, ఈ చర్య చాలా పరిమితమైనదనీ, వారి శిబిరాలను, ఇతర మౌలిక సదుపాయాలను మాత్రమే ధ్వంసం చేశామన్నారు. చాలా అప్రమత్తంగా, సూక్ష్మ బుద్ధితో, ఖచ్చితతత్వంతో భారత ఆర్మీ వ్యవహరించిందని చెప్పారు.

**సరిహద్దుల్లో 15 మంది మృతి**

పాకిస్థాన్ పదాతిదళం దాడుల్లో సరిహద్దుల్లో మంగళవారం రాత్రి 15 మంది పౌరులు మరణించారని 43 మంది గాయపడ్డారని భారత సైన్యం ప్రకటించింది. భారత్ అధీనంలోని పూంఛ్, తాంగ్‌దార్ ప్రాంతాలలో కాల్పులు జరిగాయని పేర్కొంది. ఇదిలా ఉండగా పాకిస్థాన్‌లో అసలు ఉగ్రవాద కేంద్రాలు లేవని, భారత వైమానిక యుద్ధ విమానాలు పౌర ప్రాంతాలపై దాడులు చేసి 26 మంది ప్రజలను హతమార్చాయని, మరో 46 మంది ఈ దాడుల్లో గాయపడ్డారని, భారత ప్రభుత్వం నిరాధారమైన ప్రకటనలు చేస్తోందని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవాధీనరేఖవద్ద గ్రామాలవెంబడి ఉన్న ప్రజలు భయపడి సామాన్లతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు. నియంత్రణరేఖ సమీపంలోని సలమాబాద్ గ్రామం భారత్ దాడుల్లో తీవ్రంగా నష్టపోయింది,. ఇదిలా ఉండగా భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను తమ సైన్యం కూల్చివేసిందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మీడియాకు చెప్పారు. ఐతే భారత్ దీనిపై ప్రతిస్పందించలేదు. పరస్పర దాడుల కారణంగా రెండు దేశాలకు సంబంధించిన 550 విమానాలు రద్దయ్యాయి. పాకిస్థాన్‌వైపు 135 విమానాలు రద్దు కాగా, భారత్‌కు సంబంధించి 417 విమనాలు రద్దయ్యాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com